www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 శనివారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 20, జనవరి 2024

సంపుటి: 5 సంచిక: 241, పేజీలు: 12, వెల: రూ.5/-



## వేములవాడకు పెరిగిన భక్తుల రద్దీ

**వేములవాడ,జనవరి19 వెలుతురు:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండటంతో భక్తులు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. మేడారం వెళ్లే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు సమర్పిస్తారు. ఇక్కడ మొక్కులు తీర్చుకుని మేడారం బయలుదేరుతారు. ఈ క్రమంలో వేములవాడకు భక్తుల రాక పెరిగింది. వేకువజామునే భక్తులు స్నానాలు చేసి, రాజన్నకు ప్రీతికరమైన కోడెమొక్కును చెల్లించారు. పలువురు భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు.

# థేమ్స్ తరహాలో మూసీ ప్రక్షాళన

- లండన్‌లోని థేమ్స్‌ను పరిశీలించిన సీఎం
- థేమ్స్ రివర్ అపెక్స్ బాడీ ప్రతినిధులతో భేటీ



**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగనుంది. లండన్‌లోని థేమ్స్ నదిని తలపించేలా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం థేమ్స్ రివర్ అపెక్స్ బాడీ ప్రతినిధులతో లండన్‌లో ఆయన సమావేశమయ్యారు. మూడు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో థేమ్స్ నది పరిరక్షణ, అభివృద్ధిలో ఏర్పడ్డ హార్డిల్స్‌పై అడిగి తెలుసు కున్నారు. దావోస్ నుంచి లండన్ చేరుకున్న సిఎం రేవంత్ రెడ్డి ఇక్కడ పర్యటించారు. మూసీ నదిపై హైదరాబాదు నగరంలో దాదాపు ఏడు వంతెనలు ఉన్నాయి. వీటిలో పురానా పూల్ అత్యంత పురాతనమైనది. గోల్కొండను పాలించిన కుతుబ్ షాహీ వంశస్తుడైన ఇబ్రహీం కుతుబ్ షా 1578 లో నిర్మించాడు. ఈ వంతెన ఇప్పటికీ వాడుకలో ఉంది. నయాపూల్ వంతెన హైకోర్టు సమీపంలో అఫ్జల్ గంజ్ వద్ద ఉంది. ఇవికాక డబీర్‌పూరా, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, నాగోల్, ఉప్పల్ కలాన్ వద్ద కూడా వంతెనలు ఉన్నాయి. హైదరాబాదు నగర శివార్లలోని పారిశ్రామిక ప్రాంతాలలో వెలువడిన పారిశ్రామిక వ్యర్థ పదార్థాలను నాలాల్లో వదలడం, గణనీయంగా పెరిగిపోయిన జనాభాతో నగరంలో మురికినీరును మూసీనదిలోకి వదలడంతో మూసీ ఒక మురికి కాలువగా మారింది. ప్రతిరోజూ జంటనగరాల నుంచి వెలువడుతున్న 350 మిలియన్ లీటర్ల మురికినీరు, పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు నదిలో కలుస్తున్నవని అంచనా. లండన్ నగరంలోని థేమ్స్ నది తరహాలో మూసీ నదిని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది.

అలా చేయడం ద్వారా నగర సుందరీకరణతో పాటు కాలుష్యం కోరల నుంచి హైదరాబాద్‌ను బయట పడేయొచ్చని భావిస్తుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ లో థేమ్స్ రివర్ అపెక్స్ బాడీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. తాము మూసీ అభివృద్ధి కోసం సహకరి స్తామని వారు తెలిపారు. ఇదిలావుంటే దావోస్ పర్యటనతో పెట్టుబడలను ఆకర్షించడంలో సిఎం రేవంత్ విజయం సాధించారు. పెట్టుబడులను ఆకర్షించటంలో తెలంగాణ సరికొత్త రికార్డు నెలకొల్పింది. దేశంలోనే మొట్టమొదటి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ వేదికపై ప్రత్యేకతను చాటుకుంది. దావోస్ లో మూడు రోజుల పాటు జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ప్రపంచ దిగ్గజ కంపెనీలన్నీ భారీగా

మిగతా.. 2లో

## రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు

- యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యాభివృద్ధి
- న్యాక్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్యాలు అందించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తామని అన్నారు. దీంతో శిక్షణ పొందిన వారు ఆయా రంగాల్లో ఉపాధి, ఉద్యోగాలు పొందుతారని అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కొత్తగూడలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్టక్షన్ క్యాంపస్ లో నిర్వహించిన 45వ

మిగతా.. 2లో

## సీతారామలోనూ భారీ కుంభకోణం

- అంచనాలు పెంచి మోసం చేశారు
- ఒక్క ఎకరాకు కూడా నీళ్లివ్వని దుస్థితి
- ప్రాజెక్టులపై మంత్రుల సమీక్ష



**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** సీతారామ ప్రాజెక్టులో భారీ కుంభకోణం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నీటిని ఇచ్చే ప్రాజెక్టులను వదిలి కాళేశ్వరంతో వృధా చేశారని అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా.. 2లో

## చిన్నతనంలో నేనూ... ఇంటికోసం కలకన్నాను

- ఒక్కసారిగా ఉద్వేగానికి గురైన ప్రధాని
- పిఎం ఆవాసయోజన్ ప్రారంభంలో మోడీ
- 22న ఇళ్లల్లో రామజ్యోతిని వెలిగించాలని పిలుపు




**షోలాపూర్,జనవరి19 (వెలుతురు):** చిన్నతనంలో నాక్కూడా ఇలాంటి ఓ ఇల్లు కావాలని ఆలోచించా..కానీ అవకాశం రాలేదు... అంటూ ప్రధాని మోడీ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం మహారాష్ట్రలో పర్యటించారు. షోలాపూర్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ పథకం కింద పేద ప్రజలకు ఇళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

మిగతా.. 2లో

## అయోధ్యముహూర్తం 84సెకన్లు మాత్రమే...

- అప్పుడే అనేక శుభకార్యాలకు శ్రీకారం
- పెళ్లిళ్లు.. జననాలు, వ్యాపారాలకు ముహూర్తాలు



**అయోధ్య,జనవరి19 (వెలుతురు):** అయోధ్యలో శ్రీరాముడికి జనవరి 22వతేదీన ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది.. ఆరోజు మధ్యాహ్నం 12 గంటల 29 నిమిషాల 8 సెకన్ల నుంచి 12 గంటల 30 నిమిషాల 32 సెకన్ల మధ్య ముహూర్తం ఉంది. అంటే కేవలం 84 సెకన్లు.. అంటే ఒకటిన్నర నిమిషం కూడా లేదు.. కేవలం 84 అంటే 84 సెకన్లు.. ఈ 84 సెకన్లలోనే అయోధ్య శ్రీ రాముడికి ప్రాణ ప్రతిష్ఠ జరగబోతుంది.. ఇది ఎంతో అద్భుతమైన,

మిగతా.. 2లో

## ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా లింబాద్రి కొనసాగింపు

- ప్రభుత్వం ఉత్తర్వుల జారీతో ఊహాగానాలకు తెర



**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా ప్రొఫెసర్ ఆర్ లింబాద్రిని కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా వైస్ చైర్మెన్‌గా వి.వెంకటరమణను కూడా కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్‌గా 2021 ఆగస్టు 25 నుంచి ఆచార్య

మిగతా.. 2లో



## ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించే కుట్ర

- అడ్డుకోకుంటే అసలుకే మోసం వస్తుంది
- తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదం
- ప్రాజెక్టులను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదే
- తెలంగాణ ఉద్యమం జరిగిందే నీటి కోసం
- మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** తెలంగాణ ఉద్యమం జరిగింది నీటి కోసమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..

మిగతా.. 2లో






## తెలంగాణ గుల్ల అంటూ అబద్దాలు ప్రచారం...

- శ్వేతపత్రాలకు ధీటుగా స్వేదపత్రాలు ఇచ్చాం
- కెసిఆర్ వుండివుంటే అదానీ వచ్చేవారా
- పాలమూరుకు జాతీయహోదా సాధించలేకపోయారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మంత్రి కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జనవరి19 (వెలుతురు):** తెలంగాణ గుల్ల అయ్యిందని గవర్నర్ తమిళిసైతో అబద్దాలు చెప్పించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కెటిఆర్ మండిపడ్డారు. అందుకే రాష్ట్ర అభివృద్ధిపై గణాంకాలు, ఆధారాలతో స్వేదపత్రం విడదల చేశామన్నారు. శుక్రవారం కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారని, రుణాలు వసూలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశాలు ఇచ్చారని దుయ్యబట్టారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామ న్నారని, ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా రాదని స్పష్టమైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలు చేసేదాకా విడిచి పెట్టేదేలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్-బిజెపి నాయకుల అసలు రంగు బయటపడుతోందని

మిగతా.. 2లో





## హరిసుందర నందనుడు రాముడు

- రామయ్య విగ్రహ ఫోటోలు విడుదల
- సూర్యకిరణాలు పడేలా అద్భుత ఏర్పాట్లు

**అయోధ్య,జనవరి19 (వెలుతురు):** భారత ప్రజలే కాకుండా.. యావత్ ప్రపంచంలోని హిందూ సమాజం మొత్తం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సమయం ఆసన్నమైంది. మరో మూడు రోజుల్లో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుంది. అయితే, ప్రాణ ప్రతిష్ఠకు ముందే.. రామాలయం గర్భ గుడిలో బాలరాముడి ప్రతిమను ఆలయ నిర్వాహకులు ప్రతిష్ఠించారు. ఆ సుందర బాలరాముడిని చూసేం దుకు రెండు కనులు చాలవంటే అతిశయోక్తికాదు. బాలరాముడి తొలి చిత్రాన్ని శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు విడుదల చేశారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ అవుతోంది. ప్రస్తుతం విడుదలైన బాల రాముడి విగ్రహాన్ని కృష్ణ శిలతో శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కారు. 5 అడుగుల పొడవైన బాల రాముడి విగ్రహం బరువు 150 కేజీలు ఉంది. నల్లని పద్మపీఠంపై ఐదేళ్ల బాలుడి రూపంలో కొలువుదీరారు రామయ్య. ముఖంపై చిరుదరహాసంతో.. నుదిటన మూడు నామాలతో సుందర రూపంలో వెలిగిపోతు న్నారు. బంగారు విల్లు, బాణం చేత పట్టుకుని శ్రీరాముడు నిల్చుని ఉన్నారు. అభిజిత్ ముహూర్తంలో పుష్యశుక్ల ద్వాదశి రోజున ప్రాణప్రతిష్టాపన చేయను న్నారు. శ్రీరామనవమి రోజున గర్భగుడిలో సూర్యకిర ణాలు పడేలా అద్భుతమైన

మిగతా.. 2లో



## రాముడి పేరుతో రాజకీయం ఆపాలి

- ఆలయప్రతిష్టను ప్రధాని ఎలా చేస్తారు
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆక్షేపణ

**మహబూబ్‌నగర్,జనవరి19 (వెలుతురు):** రాముడి పేరుతో రాజకీయాలు చేయడం బీజేపీ ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలం కొల్లూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. రాముడు అందరివాడని.. దేవుడి ఫొటోతో

మిగతా.. 2లో

GeneralNEWS

## తెలంగాణ గుల్ల అంటూ అబద్దాలు ప్రచారం...

(మొదటి పేజీ తరువాయి)

కెటిఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అదానిని తిడితే సిఎం రేవంత్ రెడ్డి ఒప్పందం చేసుకున్నారని ఆయన చురకలంటించారు. కెసిఆర్ ఉన్నంత కాలం అదానీ ఇక్కడ అడుగు పెట్టలేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. మన బలం, మన గళం, గులాబీ జెండా పార్లమెంట్‌లో ఉండాలని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఈ రోజు జరుగనుంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో గల 7 అసెంబ్లీ నియోజకవర్గాలు సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్ చెరు, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో సమీక్షించారు. ఆరు అసెంబ్లీ సీట్లలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. పార్టీ అభ్యర్థుల విజయంలో మాజీమంత్రి హరీశ్ రావు కీలకపాత్ర పోషించారు. 2018లో కూడా బీఆర్ఎస్ పార్టీ ఆరు సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే. దుబ్బాక అసెంబ్లీ నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొందారు. దీంతో మెదక్ లోక్ సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మెదక్ లోక్ సభ సీటును గెలుచుకుంటామని బీఆర్ఎస్ పార్టీ ధీమాతో ఉంది. పార్లమెంట్ పరిధిలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు విజయం సాధించడంతో గెలుపు తథ్యమని భావిస్తున్నారు. మెదక్ లోక్ సభ నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ కేసీఆర్ బరిలోకి దిగకుంటే టికెట్ కోసం నేతలు ప్రయత్నిస్తున్నారు. వంటేరు ప్రతాప్ రెడ్డి, పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, శివకుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. సమీక్షలో మాజీమంత్రి హరీశ్ రావు, పార్టీ జనరల్ సెక్రటరీ కే కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

## హరిసుందర నందనుడు రాముడు

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీని ఉపయోగించారు. జనవరి 22వ తేదీన మధ్యాహ్నం 12.20 - 1.00 గంటల మధ్య ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. కాశీకి చెందిన జ్ఞానేశ్వర్ శాస్త్రి ఆధ్వర్యంలో రామాలయ ప్రతిష్ఠాపన పూజలు జరుగనున్నాయి.

## రాముడి పేరుతో రాజకీయం ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయం చేయడం బీజేపీకి తగదన్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పీఠాధిపతులు వ్యతిరేకించా రని తామెవరం అన్నారు. రాముడంటే అక్షింతలు పేరుతో కొంతమంది బియ్యం సంచులు ఇచ్చి అయోధ్య అక్షింతలుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల తిరస్కరణకు గురైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు అహంకార పూరితంగా మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వద్దంటూ హైకోర్టులో పిల్ వేశారని.. ఒకవేళ వారు ఉచిత బస్ సౌకర్యం వద్దనుకుంటే టికెట్ తీసుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. శ్రీరాముడు అందరివాడని, కొందరి వాడు అన్నట్లుగా బీజేపీ ప్రచారం చేయడం సరికాదని పొన్నం ప్రభాకర్ అన్నారు.

పవిత్ర కార్యాన్ని రాజకీయాలకు వాడుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ చేయడమేంటని ప్రశ్నించారు. ధార్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొల్లూరులో ఏర్పాటు చేసిన శ్రీచింతలపురి చిన్మయ స్వామి మఠం రజతోత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి మంత్రి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుడిని కొలిస్తేనే ఆయన శక్తియుక్తులు కలిగిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గం అనుసరిస్తే ముక్తి ప్రాప్తిస్తుందని తెలిపారు. కొల్లూరులో చిన్మయస్వామి మఠాధిపతి శ్రీనందీశ్వర స్వామి పెద్ద ఎత్తున రజతోత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్ర పీఠాధిపతి 1008వ జగద్గురు శివాచార్య మహాస్వాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావంతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, రాజేశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## అయోధ్యముహూర్తం 84సెకన్లు మాత్రమే...

(మొదటి పేజీ తరువాయి)

శుభకరమైన ముహూర్తం అని అంటున్నారు. లేకపోతే అయోధ్యలో రాముడికే ప్రాణ ప్రతిష్ఠ ఎలా చేస్తారు.. అందుకే ఈ దివ్యమైన.. మంగళమైన ముహూర్తం అని భావిస్తున్నారు జనం.

ఈ దివ్యమైన అద్భుతమైన 84 సెకన్లు ఉన్న సమయంలోనే.. ఉత్తర భారతంలోని వేలాది మంది.. ఈ ముహూర్తంలో పిల్లలను కనటానికి రెడీ అవుతున్నారు. ఈ ముహూర్తంలో సిజేరియన్ ఆపరేషన్లు చేయటానికి డాక్టర్లను కోరుతున్నారు. వేలాది మంది పెళ్లిళ్లు చేసుకోవటానికి సిద్ధం అయ్యారు.. ఈ 84 సెకన్లలోనే తమ పిల్లలకు నామకరణాలు చేయటానికి ముహూర్తం పెట్టుకున్నారు. అంతేనా ఈ 84 సెకన్లలోనే షాపులు ఓపెన్ చేసుకుంటున్నారు..కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు.. కొత్త ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారంటే.. రాములోరికి ఆ దివ్య ముమూర్తంలో ప్రాణ ప్రతిష్ట చేస్తున్నారంటే.. ఆ 84 సెకన్ల దివ్య ముహూర్తం ఎంత బలమైందో తెలుస్తోంది. అందుకే ఈ ముహూర్త బలాన తమ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్దపడుతున్నారు ప్రజలు.

## థేమ్స్ తరహాలో మూసీ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు తమ ఆసక్తి ప్రదర్శించాయి. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలిసారిగా తెలంగాణకు భారీ పెట్టుబడుల వరద వెల్లువెత్తింది. దాదాపు రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి.

దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్ వేదికగా 2020లో రూ.500 కోట్లు, 2022లో రూ.4,200 కోట్లు, 2023లో రూ.21వేల కోట్ల పెట్టుబడులు రాగా.. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల వ్యవధిలోనే అంతకు రెట్టించిన పెట్టుబడులు (దాదాపు రూ.40 వేల కోట్లు) రాష్ట్రానికి తరలివచ్చాయి. వీటితో 35 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. టాటా గ్రూప్, అదానీ, జిందాల్, గోడి ఇండియా, వెబ్ వెర్క్స్, ఆరాజెన్ లైఫ్ సైన్సెస్, గోద్రెజ్ ఇండియా, సర్జికల్ ఇన్‌స్టుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, ఊబర్, క్యూ సెంట్రియో, ఓ9 సొల్యూషన్స్ లాంటి దిగ్గజ కంపెనీలన్నీ తెలంగాణలో వివిధ రంగాల్లో తమ ప్రాజెక్టుల స్థాపన, విస్తరణకు ముందుకు వచ్చాయి.

## చిన్నతనంలో నేనూ... ఇంటికోసం కలకన్నాను

(మొదటి పేజీ తరువాయి)

పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన దేశంలోనే అతిపెద్ద సొసైటీని ప్రారంభించాం. దీనిపై 2014లో నేను హామీ ఇచ్చా. ఆ వాగ్దానం నెరవేరడం, దాన్ని చూడటానికి రావడం.. ఇవన్నీ పరిపూర్ణ క్షణాలు. ఈ ఇళ్లను చూడగానే బాల్యం గుర్తొచ్చింది. చిన్నతనంలో నాక్కూడా ఇలాంటి ఇంట్లో నివసించే అవకాశం వస్తే ఎలా ఉండేదో అని ఆలోచించా అంటూ గద్గద స్వరంతో మాట్లాడారు. కన్నీళ్లను దిగమింగుకుని తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం గురించి ఆయన ప్రస్తావించారు. ఆ మహోన్నత ఘట్టాన్ని పురస్కరించుకుని 22వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో రామజ్యోతి వెలిగించాలని మరోసారి పిలుపునిచ్చారు. శ్రీరాముడి నిజాయతీని మా ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంది. మన విలువలు, కట్టుబాట్లను గౌరవించాలని ఆ భగవంతుడు బోధించాడు. అదే బాటలో నడుస్తూ పేదల సంక్షేమం, వారి సాధికారత కోసం మేం పనిచేస్తున్నాం అని ప్రధాని తెలిపారు. ప్రజల కలలే తమ ప్రభుత్వ హామీలని మోదీ అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు అందరికీ చేరువకాకపోవడంతో 'గరీబీ హఠావో' కేవలం నినాదంగా మిగిలిపోయిందని ప్రతిపక్షాలను విమర్శించారు. తమ పాలనలో చిట్టచివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. కెఆర్ఎంబికి ప్రాజెక్టులను అప్పగిస్తే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. జాతీయ ప్రాజెక్టు తెస్తామని ఢిల్లీకి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు ఉన్న ప్రాజెక్టులు అప్పగిస్తున్నారని దుయ్యబట్టారు.నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టాలని సూచించారు. కెఆర్ఎంబికి అప్పగించాలన్న నిర్ణయాన్ని గతంలో తాము వ్యతిరేకించామన్నారు. కెఆర్ఎంబితో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటాయని తాము వాదించామని, అపెక్స్ కమిటీకి అప్పగించాలని తాము గట్టిగా చెప్పామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు మంజూరు చేసే సమయంలోనే ప్రణాళిక సంఘం కొన్ని షరతులు పెట్టిందని, శ్రీశైలంలో 830 అడుగుల నీటిమట్టం నిర్వహించాలని సూచించింద న్నారు. ప్రాజెక్టుల అప్పగింతపై గతంలో తమ ప్రభుత్వం కొన్ని షరతులు పెట్టిందని హరీష్ రావు వివరించారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులు కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు పరిధిలోకి వెళతాయనే వార్తలు ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. లేదంటే భవిష్యత్ తరాలు ఇబ్బంది పడాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమం చేసిందే నీళ్ల కోసం అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. కేఆర్ఎంబీకి సంబంధించి గతంలో తమపై కూడా ఒత్తిడి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. 264 మెగా వాట్స్ విద్యుత్ శ్రీశైలంలో ఉత్పత్తి చేసి సాగర్‌కు నీటిని విడుదల చేయాలని తాము కోరామని వివరించారు. ఆ సూచనలు పాటించకుంటే ప్రాజెక్టులు విలీనం చేయమని తేల్చి చెప్పామని వివరించారు. కెఆర్ఎంబికి ప్రాజెక్టులు అప్పగిస్తే రాష్ట్రానికి భారీ నష్టం జరుగుతుందని హరీశ్ రావు అంటున్నారు. హైడల్ పవర్ జనరేషన్‌లో స్వయం ప్రతిపత్తిని కోల్పోతామని వివరించారు. సాగర్ ఆయకట్టు దెబ్బ తింటుందని తెలిపారు. హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందని వివరించారు. పాలమూరు రంగారెడ్డి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టుల కోసం అడగాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ గతంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశాయని హరీశ్ రావు గుర్తుచేశారు. ఏడు మండలాలు ఏపీలో కలిపి సీలేరు ప్రాజెక్టును పక్క రాష్ట్రానికి అప్పగించారని ధ్వజమెత్తారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టాయని విరుచుకుపడ్డారు. పోతిరెడ్డిపాడు ద్వారా గోదావరి డెల్టాకు నీటిని తరలిస్తే సాగర్ ఆయకట్టు దెబ్బ తింటుందని తెలిపారు. ప్రాజెక్టులు ఐఖీఓః చేతిలోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. కాళేశ్వరంలో మేడిగడ్డ నుంచి ఇప్పుడు కూడా నీరు తెచ్చుకోవచ్చని హరీశ్ రావు సూచించారు. గోదావరిలో 5 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని వివరించారు. ఆ నీటిని లిఫ్ట్ చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. కాళేశ్వరం పంప్ హౌజుల్లో మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ సిస్టంలో నడుపుతున్నారని తెలిపారు. దీని వల్ల మోటార్లు త్వరగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని మోటార్లు నడపాలని సూచించారు. రాష్ట్రానికి జాతీయ ప్రాజెక్ట్ తీసుకొస్తామని ఢిల్లీ వెళ్లి, ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## సీతారామలోనూ భారీ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు భట్టీ విక్రమార్క, పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి, పలువురు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. సీతారామ ప్రాజెక్టులో భారీ కుంభకోణానికి పాల్పడినట్లు చెప్పారు. స్వతంత్ర భారతంలో ఇంత పెద్ద తప్పిదం ఎప్పుడూ జరగలేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్ట్ ఖర్చు భారీగా పెంచారని తెలిపారు. 2014లో మరో 14 వందల కోట్లు ఖర్చు చేస్తే అయిపోయే ప్రాజెక్టు పదేళ్లు అయినా పూర్తి కాలేదన్నారు. 7వేల ఐదు వందల కోట్ల రూపాయలు అదనంగా కర్చు చేశారని తెలిపారు. 3లక్షలకు పైగా ఆయకట్టుకు నీళ్ళు అప్పుడే వచ్చేదని... కానీ ఇప్పటికీ ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వలేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు మొత్తం 18వేల కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుందే నీళ్ల కోసమని.. కానీ, గత బీఆర్ఎస్ సర్కార్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా.. అక్కరకు రానీ కాళేశ్వరాన్ని కట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. సీతారామ ప్రాజెక్టుపేరు చెప్పి రూ.18 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచారని.. కొత్త ఆయకట్టు కింద ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదన్నారు. సీతమ్మ బ్యారేజీకి నీటిని అందించేందుకు రూ.3వేలకు కోట్లకు పైగా ప్రాజెక్టు ఖర్చు అంచనా వేశారని... కానీ ఖర్చు చేసింది మాత్రం రూ.4వేల కోట్లే అని తెలిపారు. రీడిజైన్ పేరుతో ఒక్క ఎకరానికి నీరు అందివ్వలేదన్నారు. మొదటి మూడు సంవత్సరాల్లో సంవత్సరానికి 500 కోట్లు ఖర్చు చేస్తే వేల ఎకరాలకు నీరు వచ్చేదని..కానీ కేసీఆర్ ప్రభుత్వం అలా చేయలదని మంత్రి భట్టి చెప్పారు.

## 22న విగ్రహంపై వస్త్రం తొలగింపు

**శాస్త్రోక్తంగా సాగుతున్న పూజాక్రతువు**

**ప్రధాని మోడీ సమక్షంలో నిర్వహణ**

**అయోధ్య,జనవరి19 (వెలుతురు):** అయోధ్య ప్రాణప్రతిష్టకు సంబంధించి చేస్తున్న కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. అనుకున్న ప్రకారం ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శాస్త్రోక్రంగా వేదోక్తంగా పూజాదికాలు సాగుతున్నాయి. ఈ నెల 22వ తేదీన బాల రాముడి విగ్రహానికి ఉన్న వస్త్రాన్ని తొలగించడంతో రామాలయంలో పూజలు ప్రారంభం అవుతాయి. ప్రధాని మోదీ రామ్ లల్లాను దర్శించుకొని హారతి ఇస్తారని అయోధ్య ఆలయ వర్గాలు తెలిపాయి.గురువారం ఉదయం రాముడి విగ్రహాన్ని పవిత్ర నదీ జలాలతో అభిషేకించారు. తర్వాత గణెళిశాంబికా పూజ, వరుణ పూజ, చతుర్వేదోక్త పుణ్యాహవచనం క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అనిల్ మిశ్రా దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అయోధ్య రామ మందిరం గర్భగుడిలోకి రామ్ లల్లా (బాలరాముడు) ప్రవేశించారు. రామ్ లల్లా ఐదేళ్ల బాలుడిగా దర్శనం ఇస్తారు. ఆ విగ్రహం ఎలా ఉండనుందో అనే సందేహం ప్రతి ఒక్కరిలో నెలకొంది. బాల రాముడి విగ్రహ ఫొటోను ఓ జాతీయ వార్తా సంస్థ విడుదల చేసింది. 51 అంగులాల పొడవు ఉన్న విగ్రహం పై భాగాన్ని తెల్లని వస్త్రంతో కప్పి ఉంచారు. ఆ విగ్రహం సుందరంగా కనిపించింది. బాలరాముడి విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకొచ్చే సమయంలో శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు రామ నామాన్ని స్మరించారు. రామ్ లల్లా విగ్రహాన్ని మైసూర్‌కు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ అందంగా తీర్చిదిద్దారు.

## 22న బ్యాంక్‌లకు హాఫ్‌డే లీవ్

**స్టాక్ మార్కెట్లు మధ్యాహ్నం ఓపెన్**

**ముంబై,జనవరి19 (వెలుతురు):** అయోధ్యలో రామ మందిర్ ప్రాణప్రతిష్ట కార్యక్రమం జనవరి 22న జరగనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అయోధ్యలోని బ్యాంకులు ఆ రోజున హాఫ్ డే మాత్రమే పనిచేస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలు దేశవ్యాప్తంగా ఆ రోజున మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయని ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రాణప్రతిష్ట కార్యక్రమం రోజున స్టాక్ మార్కెట్ సమయాల్లో కూడా మార్పులు చేస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. జనవరి 22న కరెన్సీ మార్కెట్లు ఉదయం 9 గంటలకు బదులు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. జనవరి 22న ప్రభుత్వం సగం రోజుల సెలవు ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పు ఫారెక్స్, బాండ్ మార్కెట్‌కు కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు సర్క్యూలర్ జారీ చేస్తూ ఆర్బీఐ వెల్లడించింది. జనవరి 22, 2024న అయోధ్యలో రాంలాలా ప్రాణ్ ప్రతిష్ఠా వేడుకను భారతదేశం(శిఠజీసజీబి) అంతటా ఘనంగా జరుపుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా భారతదేశం అంతటా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర సంస్థలు, కేంద్ర పారిశ్రామిక సంస్థలు జనవరి 22, 2024 మధ్యాహ్నం 2:30 గంటల వరకు మూసివేయాలని నిర్ణయించారు.

## ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా లింబాద్రి కొనసాగింపు

(మొదటి పేజీ తరువాయి)

లింబాద్రి కొనసాగగా.. 2023 జూన్ 26 నుంచి రెగ్యులర్ ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన్ను మూడేళ్లపాటు పదవిలో కొనసాగాలని గత జూన్‌లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 54 కార్పొరేషన్ల చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, సభ్యులను తొలగిస్తూ డిసెంబరు 10న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణను కూడా తొలగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్లు 16,17ను విడుదల చేసింది. అయితే ఎంసెట్ సహా పలు ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సి ఉండటంతో పునరాలోచనలో పడిన సర్కార్ మళ్లీ వారే కొనసాగాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ లింబాద్రి పాల్గొన్నారు. కానీ ఆయన కొనసాగింపునకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాకుండానే ఆయన పాల్గొనడంపై విద్యాశాఖ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

గతనెల పదో తేదీ నుంచి ఇప్పటి వరకు ఉన్న ఉత్కంఠకు తెరపడింది. గతంలలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వెంకటరమణను తొలగిస్తున్నట్టు జారీ చేసిన జీవోలను తొలగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. అప్పట్లో ఉన్నత విద్యామండలి మొదటి చైర్మన్‌గా ఉన్న తుమ్మల పాపిరెడ్డికి 65 సంవత్సరాలు దాటడంతో హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను తొలగించింది. ఆ క్రమంలో 2021, ఆగస్టు 24న ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జీ చైర్మెన్‌గా లింబాద్రిని నియమించింది. ఆ తర్వాత గతేడాది జూన్ 26న పూర్తిస్థాయి చైర్మెన్‌గా లింబాద్రిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగుతారని స్పష్టం చేసింది. అంటే 2025, జూన్ 25 వరకు లింబాద్రి కొనసాగే అవకాశమున్నది. లింబాద్రి స్వస్థలం నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం రావుట్ల గ్రామం. దళిత కుటుంబంలో పుట్టిన ఆయన విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో పనిచేశాడు. వివాదరహితుడిగా పేరున్న ఆయన ఆర్మూర్ డివిజన్‌లో రైతు కూలీ సంఘంలో పనిచేశాడు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, పీహెచ్?డీ పట్టా పొందిన ఆయన.. సికింద్రాబాద్ పీజీ కాలేజీకి వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. కొన్నాళ్లు ఉన్నత విద్యామండలి సభ్యుడిగా కొనసాగిన ఆయన.. అనంతరం రెండేళ్ల పాటు ఇన్‌చార్జ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గతేడాది జులైలో పూర్తి స్థాయిలో ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పింది.

తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట ఆయన తొలగించాల్ని భావించినప్పటికీ.. ఆయననే ఛైర్మన్‌గా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి నూతన చైర్మెన్ లింబాద్రి నవతెలంగాణతో మాట్లాడుతూ చైర్మెన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్య అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుడతామని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)


న్యాక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి న్యాక్ వైస్ చైర్మన్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజ్ లు పాల్గొన్నారు.ఈ సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఫ్యూచర్ కన్స్టక్షన్ అకాడమితోపాటు స్కిల్ డెవలప్ మెంట్ సెక్టార్స్, ఓల్డ్ డిస్టిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయాలంటుకొంటున్నామని తెలిపారు. అలాగే, కన్స్టక్షన్ యూనివర్సిటీ ప్రపోజల్ కూడా వుందని.. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్ లో 10వేల మందికి టీఎస్సీ ద్వారా ట్రైనింగ్ ఇస్తామని చెప్పారు. ఒకేషనల్, పాలిటెక్నిక్, ఐటిఐ కాలేజీల వారికి టెక్నికల్‌గా సపోర్ట్ చేయడం కోసం సుదీర్ఘంగా చర్చించామన్నారు. న్యాక్ ప్రాపర్టీ మిస్ యూజ్ అవ్వకుండా, లీజ్ తీసుకున్నవారు ప్రాపర్ గా ఉపయోగించుకునే విధంగా ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇన్స్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో దుబాయ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తప్పుడు ప్రచారం చేశారని.. దుబాయ్ కంపెనీతో ఎలాంటి ఎంవోయూ కాలేదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటుపై సీఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందులో కమర్షియల్ యాక్టివిటీస్ జరిగితే చర్యలు తీసుకుంటామని.. ఓన్లీ ట్రైనింగ్ సెంటర్ పర్పస్ గా ట్రైనింగ్ డెవలప్మెంట్ ప్రోగ్రాంతో ప్రతీ సంవత్సరం రెండు లక్షల మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. నిరుద్యోగుల కోసం మండలానికొక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. అందులో భాగంగా మొదటిగా మహబూబ్ నగర్ లేదా నల్గొండ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలనుకొంటున్నామని మంత్రి వెంకట్ రెడ్డి చెప్పారు.

## అయోధ్య రాముడిపై అన్నీ అబ్బురాలే...

**కొనసాగుతున్న కొత్త 500 నోట్ల ప్రచారం**

**న్యూఢిల్లీ,జనవరి19 (వెలుతురు):** అయోధ్యలోని రామాలయ స్మారక పోస్టల్ స్టాంపు, రాముడి స్మారక పోస్టల్ స్టాంపు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా శ్రీరాముడిపై విడుదల చేసిన స్టాంపులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్మారక స్టాంపు, ఈ పుస్తకం శ్రీరామ జన్మభూమి ఆలయంలో జీవ ప్రతిష్ఠాపన ఈ పవిత్ర సందర్భాన్ని రాబోయే తరాలకు గుర్తు చేస్తాయని నేను విశ్వసిస్తున్నాను అని మోదీ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కొత్తగా 500 నోటును తీసుకుని వస్తారని ప్రచారం సాగుతోంది. రామరాజ్యం వచ్చేస్తోంది.. అయోధ్యలో శ్రీ రాములోరు పరిపాలన ప్రారంభం కాబోతున్నది. దేశం మొత్తం ఇప్పుడు రాములోరి గురించే మాట్లాడుకుంటుంది.. ఆ రోజు అంటే జనవరి 22వ తేదీ సోమవారం మధ్యాహ్నం ప్రాణ ప్రతిష్టతో దేశంలోని రామ భక్తులు అందరికీ పండుగ.. అలాంటి రోజు మరో అద్భుతాన్ని కూడా మన ప్రధాని మోదీ ఆవిష్కరించబోతున్నట్లు సోషల్ మీడియాలో ఓ వార్త చెక్కర్లు కొడుతుంది.. రాముడి చిత్రంతో ఉన్న కొత్త 500 రూపాయల నోట్లు.. ఇప్పటి వరకు గాంధీ బొమ్మ ఉన్న స్థానంలో.. శ్రీరామ చంద్రుడితో బొమ్మతో ఉన్న కొత్త 500 రూపాయల నోట్లను.. ఆ రోజు అంటే జనవరి 22వ తేదీ మధ్యాహ్నం విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు, ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి.. కొన్ని రోజులుగా వస్తున్న ఈ వార్తలు నిజమే అన్నట్లు.. చాలా మంది భావించటం విశేషం..

చాలా ఇళ్లలో ఈ విషయంపై చర్చ జరగటం మరో విశేషం..అయితే దీనిని ఎవరు కూడా ఖండించడం లేదు. ఇలాంటి సమయంలో.. ఈ వార్తలో.. శ్రీ రాముడు బొమ్మతో ఉన్న 500 రూపాయల నోట్లపై మీకు నిజం తెలుసా.. ఇది పచ్చి అబద్ధం.. తప్పుడు




వార్త.. ఎవరో సృష్టించిన డీప్ ఫేక్ న్యూస్.. ఈ వార్తను ఎవరూ అస్సలు నమ్మొద్దు.. రాముడు బొమ్మతో ఉన్న 500 రూపాయల నోట్ల ఫొటోలను షేర్ చేయొద్దని కోరుతుంది. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం ఈ వార్తలను ఖండించింది.. అలాంటిది ఏమీ జరగటం లేదని.. 500 రూపాయల నోట్లపై గాంధీ బొమ్మను తొలగించటం లేదని స్పష్టం చేస్తూనే.. రాములోరి బొమ్మతో కొత్త 500 రూపాయల నోట్లను అస్సలు విడుదల చేయటం లేదని వివరణ ఇచ్చింది.

జనవరి 22వ తేదీన ఎలాంటి కొత్త నోట్లు విడుదల కావటం లేదు.. జనం ఎవరూ ఆందోళన పడొద్దు.. ఒకవేళ రాములోరి బొమ్మతో మీ దగ్గరకు ఏమైనా డబ్బుల నోట్లు వస్తే.. అవి కచ్చితంగా నకిలీ నోట్లు అని తెలుసుకోండి.. అలాంటి నోట్లను ఇస్తున్న వాళ్లను పోలీసులకు పట్టించండి అని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. స్పష్టం చేస్తుంది.



## జహీరాబాద్‌లో ఎయిడ్స్‌పై
# అవగాహనా సదస్సు

**జహీరాబాద్, 19 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మునిసిపల్ పరిధిలో ఉన్న బస్ స్టాండ్ పరిసరాలలో, మార్కెట్, ప్రాంతాలలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా కలెక్టర్, జిల్లా ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో డిఎంహెచ్వో, డిపిఎం వారి ఆధ్వర్యంలో సిదిపెట్ట జిల్లాకు చెందిన సత్య జానపద కళా సమితి కళాకారులచే హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి పైన రక్షణ లేని సెక్స్ చేయడం ద్వారా కలుషితమైన సూదులు, సిరంజీలా ద్వారా కలుషితమైన రక్తమార్పిడి ద్వారా, తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవి రాకుండగా నాలుగు అంశాల పైన ప్రదర్శన నిర్వహించారు. టీమ్ లీడర్ పి.చిరంజీవి, పి.యాదగిరి, ఎం.కమలాకర్, పి.మహేష్, ఎం.భాగ్యశ్రీ లచే తదితరాంశాల పైన జానపద గీతాలు, ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.

## భూగర్భ జలాలు వృద్ధికి
# చిన్న నీటి వనరులే కీలకం
### ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
భూగర్భ జలాలు వృద్ధికి చిన్న నీటి వనరులే కీలకం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి అన్నారు. నారాయణపూర్ మండల చిల్లపురం పీటీ పరిధిలో గల పొర్ల



గడ్డ తండా బుగ్గ చెరువు కు 6 లక్షల రూపాయల తో చేపట్టిన మరమ్మతు పనులను ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేయుటకు చెరువు, కుంటలు నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించాలి అన్నారు. యేండ్ల కాలంగా మరమ్మతులకు నోచుకోని చెరువులను బాగు చేయుటకు ప్రభుత్వం నుండిఅధిక నిధులు కేటాహింపుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐబీ డీ ఈ గీత మాధురి, సర్పంచ్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏపూరి సతీష్, జగ్రాం నాయక్, పాండు నాయక్, రాజు నాయక్, శంకర్ నాయక్ రైతులు పాల్గొన్నారు.

# సైకిల్‌పై 'ఛలో అయోధ్య'
### - కరీంనగర్ యువకుల సైకిల్ యాత్రను ప్రారంభించిన బండి సంజయ్.

**కరీంనగర్, వెలుతురు, జనవరి 19:**
ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ:ప్రతిష్ట నేపథ్యంలో కరీంనగర్ యువకులు అయోధ్యకు సైకిల్ పై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నగరానికి చెందిన



మంగ వంశీ కృష్ణ, ఆదిత్య అనే ఇద్దరు యువకులు శుక్రవారం బండి సంజయ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. రాత్రి వేళల్లో మంచు కురిసే అవకాశమున్నందున జాగ్రత్తగా వెళ్లాలని, వీలైనంత మేరకు పగటిపూటే సైకిల్ యాత్ర కొనసాగించాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు.

## ఎస్.ఎం.హుస్సేనికి
## స్వామి వివేకానంద సేవా పురస్కార్ 2024

**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**
నేషనల్ యూత్ డే మరియు స్వామి వివేకానంద జయంతి ముగింపు వేడుకల సందర్భంగా ఈరోజు టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) గారిని స్వామి వివేకానంద సేవ పురస్కార్ 2024 తో




ముఖ్య అతిథులు డాక్టర్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ మరియు తెలంగాణ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ గారు జ్యోతి వెలిగించారు. శ్రీ బొగ్గరపు దయానంద్ ఎమ్మెల్సీ,తెలంగాణ కౌన్సిల్ మరియు విశిష్ట అతిథి డాక్టర్ బాబు మోహన్, సినీ కళాకారుడు, మాజీ మంత్రివర్యులు మరియు అధ్యక్షులు రాజ్ నారాయణ, తెలంగాణ ఇంటలెక్చువల్ ఫారం సమక్షంలో బిరుదు ప్రధానం చేయబడింది. స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా తనకు బిరుదు ఇవ్వడం తన తల్లిదండ్రులకు, తనకు విద్య నేర్పిన ఉపాధ్యాయులకు, తన కుటుంబ సభ్యులకు మరియు ఈనాటి ముఖ్య అతిథులకు శిరసు వంచి కృతజ్ఞతలు తెలిపారు.





# విద్యార్థుల ఉన్నతకి క్రీడలు దోహదం చేస్తాయి..
### డిపిఎస్ సొసైటీ జాతీయ జాయింట్ సెక్రటరీ. డాక్టర్. చనా. - జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన తుమ్ భీం సేన్..






**కొల్లూరు వెలుతురు జనవరి 19:**
పఠాన్ చేరు పరిధిలోని కొల్లూరులోనీ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డిపి ఎస్)లో 2023-24 జాతీయ ఆర్చరీ చాంపియన్షిప్ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అసోసియేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి డోలి చాన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ ఆర్చరీ చాంపియన్షిప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసిక ఒత్తిడిని జయించే విధంగా ఆటలు బాగా ఉపయోగపడుతాయి అని, దీనితో పాటు విద్యార్థి లో క్రియేటటివి, అలోచన విధానం పెరిగేందుకు దోహదం చేస్తాయి అని ఆమె తెలిపారు. డిల్లీ పబ్లిక్ స్కూల్ అసోసియేషన్ చరిత్ర లో కొల్లూరు బ్రాంచ్ లో మాత్రమే ఇటువంటి జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఇటువంటి చొరవ తీసుకున్న డీపిఎస్ కొల్లూరు యాజమాన్యాన్ని అభినందించారు. మరో వైపు డీపిఎస్ కొల్లూరు ఛైర్మన్ తూమ్ భీం సేన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థిలో నూతన ఆలోచన విధానం పెరిగేందుకు దోహదం చేస్తాయి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్ర, తెలంగాణ తో పాటు, జమ్ము, బెంగుళూరు, హరిద్వార్, నవి ముంబయి, అమృత్ సర్, గయ, వింధ్య నగర్ లోని డీపిఎస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపిఎస్ సెక్రటరీ ,ప్రణయ కుమార్, తుము పవన్ కళ్యాణ్, ప్రిన్సిపాల్ సిజె వసంత లు పాల్గొన్నారు.












# అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధికి కృషి

### ప్రపంచంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలపడం ప్రధాని మోదీ లక్ష్యం
### వికసిత్ భారత్ తో ప్రతి గ్రామానికి కేంద్ర పథకాలు
### కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే
### పులిచర్లలో పర్యటన

**పెద్దవూర మండలం, వెలుతురు జనవరి,19:**
భారత దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత అభివృద్ది చెందిన దేశంగా నిలబెట్టడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్ష్యం అని కేంద్ర భారీ పరశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పులిచర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టరు హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందించడం వికసిత్ భారత్ లక్ష్యం అని తెలిపారు. దేశంలో 2.7 లక్షల గ్రామాలలో వికసిత భారత్ వెళ్తుంది అని చెప్పారు. మోడీ హయాంలో తెలంగాణలోని ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1000 కోట్ల ఖర్చుతో అఖిల భారత వైద్య విద్య సంస్థ( ఏయిమ్స్) నిర్మించింది అని తెలిపారు. తెలంగాణలో జాతీయ రహదారులు 2500 కిలోమీటరు నుంచి 5000 కిలోమీటర్లు, రైల్వే లైన్లు రెట్టింపు చేసినట్లు వెల్లడించారు. ప్రతి పేద మహిళకు ఉచితంగా ఉజ్జ్వల యోజన కింద వంట గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చి మహిళల కష్టాలు తొలగించినట్లు పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా 2 కోట్ల మంది మహిళలు లక్షాది కారుల్ని చేయడం ప్రధాని మోదీ లక్ష్యంగా ప్రకటించారన్నారు. అయుష్మాన్ భారత్ కింద పేదలందరికీ రూ. 5 లక్షల వరకు ఉచింతంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు గుర్తు చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పథకాల లబ్ది దారులతో ఆయన నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతకు ముందు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా ప్రచురించిన కరపత్రాలు, 2024 క్యాలెండర్ ఆవిష్కరుంచారు. పులిచర్ల గ్రామం నుంచి ఎదిగి రగ్బీ క్రీడలో జాతీయ స్థాయికి ఎదిగిన షా మినిని ఆయన సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజీఎం ప్రశాంత్ కుమార్ బరియార్, రీజనల్ మేనేజర్ అలీముద్దిన్, జిల్లా బ్యాంకు నోడల్ అధికారి శ్రామిక్, నాబార్డు జిల్లా మేనేజర్ వినయ్ కుమార్, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వర్ రావు, డీఆర్డిఓ కాళిదిని, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కొండల రావు , అర్ డీ వో చెన్నయ్య, ఐసీడీఎస్ పీడీ కృష్ణ వేణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మచ్చలేని నాయకుడు మచ్చ ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**
మచ్చలేని నాయకుడు మచ్చ ప్రభాకర్ అని శుక్రవారం నారాయణగూడ పద్మశాలి భవన్ లో జరిగిన ప్రభాకర్ సంస్మరణ సభలో పాల్గొన్న భక్తులు ముక్తకంఠంగా కొనియాడారు ఈ సభలో పాల్గొన్న అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎల్ రమణ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అనిల్ తెలంగాణ ప్రాంతం పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కమ్మర్త మురళి అఖిలభారత పద్మశాలి యువజన విభాగం జాతీయ భాస్కర్ హాలో మాట్లాడుతూ మనిషి బతుకునంత కాలమే కాకుండా ప్రతి మనిషి జీవితం ఉండాలని చెప్పే వ్యక్తి ప్రభాకర్ అని అన్నారు కాకై కలకాలం బతికే కంటే అంశై ఆరు నెలలు బతికిన చాలు అన్న చందంగా ఆయన జీవితం కొనసాగిందన్నారు ఒక తండ్రి తన పెద్ద కొడుకుని కోల్పోతే ఎంత అయితే బాధ ఉంటుందో అదే బాధ పద్మశాలి సమాజానికి ఉందన్నారు తెలంగాణ పద్మశాలి పునర్నిర్మాణానికి, సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చే క్రమంలో తాను ఎంతో శ్రమకూర్చాడని దాని ఫలాలు సమాజానికి అందించే క్రమంలోనే అతను సమాజాన్ని దూరం కావడం తీరని వేదనను మిగిల్చిందన్నారు ఈ కార్యక్రమంలో



తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాచర్ల రామచంద్రరావు కోశాధికారి బొమ్మ రఘురాం యువజన సంఘం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ మహిళా అధ్యక్షురాలు గుంటుక రూప అఖిలభారత నాయకులు పుట్ట పాండురంగయ్య వనం దుష్యంతల చిలువేరు సునీత 33 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్టీ సెల్ చైర్మన్
## రాథోడ్ వినోద్ కుమార్‌కు సన్మానం

**జహీరాబాద్, 19 జనవరి, వెలుతురు:**
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల ఎస్టీ సెల్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన రాథోడ్ వినోద్ కుమార్ కు జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎండి. ముల్తాని, కాంగ్రెస్ నాయకులు పద్మారావు, మోజెష్, రాజు నాయక్ ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్ రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికీ భవిష్యత్తు ఉంటుందినీ అదేవిదంగా మండలంలో వున్నా అన్ని గిరిజన సమస్యలు పరిష్కారం కోసం తాను పని చేస్తానని తెలిపారు. మున్ముందు మరెన్నో పదవులు పొందే విధంగా పార్టీ కోసం కృషి చేస్థానాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం..

## జగమంతా రామమయం!

అంతా రామమయం..జగమంతా రామమయం అన్నట్లుగా ఇప్పుడు దేశమంతా రామనామంతో మార్మోగు తోంది. దేశమే కాదు..ప్రపంచమంతా ఆయోధ్యవైపు ఆసక్తిగా చూస్తోంది. రామాలయ ప్రాణప్రతిష్ట కోసం రామకోటి.. కోటానుకోట్ల జనకోటి ఎదురుచూస్తోంది. ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తోంది. ఈ నెల22న జరిగే ప్రాణప్రతిష్టలో అత్యంత కీలకమైన రామ్‌లల్లా విగ్రహం గర్భగుడికి చేరిన ఘట్టం అత్యంత భక్తిశ్రద్దల తో చేపట్టారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అయోధ్య అక్షితలు ఊరూరా చేరుతున్నాయి. ప్రజలంతా ఉజ్వల ఘట్టం కోసం ఎదురు చూస్తున్నారు. తమ జీవితకాలంలో ఇలాంటి ఘట్టాన్ని చూస్తామని ఊహించలేదని పరవశించి పోతున్నారు. అయోధ్య ఇప్పుడు ప్రపంచ ఆధ్యాత్మిక నగరిగా విలసిల్లనుంది. ఈ ఆలయ ప్రతిష్ఠలో ఇప్పుడన్నీ విశేషాలే. వెయ్యేళ్లయినా చెక్కుచెదరని విధంగా ఇనుము, సిమెంట్ లేకుండా ఆలయ నిర్మాణం జరిగితే..ఆలయ నిర్మాణంలో దేశంలోని ప్రముఖ ప్రదేశాల మట్టి, నదులు, సముద్రాల నీటిని ఉపయోగించారు. నేపాల్ సాలిగ్రామ శిలను బాలరాముడి విగ్రహం కోసం ఉపయోగించారు. ద్వారాలను హైదరాబాద్ నుంచి తెప్పించారు. గంటలను తమిళనాడు నుంచి రప్పించారు. తిరుమల శ్రీవారి చెంత నుంచి లడ్డూ ప్రసాదాలు వస్తున్నాయి. ఇలా దేశం యావత్తూ ఏదో విదంగా అయోధ్య రామాలయంలో అనుబంధం పొందేలా ఆలయ నిర్మాణం జరుపుకోవడం విశేషం. ఈ క్రమంలో ఈ నెల22న ప్రాణప్రతిష్ట తరవాత అయోధ్య ఇక భక్తులతో కిటకిటలాడనుంది. 22న జరిగే కార్యక్రమానికి సామాన్యభక్తులు రావద్దని ట్రస్ట్ సభ్యులు ఇప్పటికే విన్నవించుకున్నారు. అయోధ్యలో మరో అపూర్వ ఘట్టంగా మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కావడం..విమానాల రాకపోకలు ప్రారంభం కావడంతో ప్రజలు సులువుగా అయోధ్యకు వెళ్లే అవకాశం దక్కనుంది. గురువారమే అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామమందిరం గర్భగుడి వద్దకు రామ్ లల్లా చేరుకున్నారు. నేపాల్ లోని కాళీనది నుంచి తీసుకొచ్చిన సాలిగ్రామ శిలతో తయారు చేసిన 51 అంగుళాల విగ్రహాన్ని గుడిలోకి చేర్చిన అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసే పక్రియ చేపట్టారు. జనవరి 22న ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ఆలయంలో స్వామికి కుంకుమార్చన జరగనుంది. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్టలో చేసే పవిత్ర కార్యక్రమంలో భాగంగా తెల్లవారు జామున స్థానిక మహిళలు మహా కలశ యాత్ర చేపట్టారు. ఆ తర్వాత పూజలు చేసి రామాలయ ప్రాంగణం లోకి రామ్ లల్లా విగ్రహాన్ని తీసుకుని వెళ్లారు. ఈ రామ్ లల్లా విగ్రహం దాదాపు 200 కిలోల బరువు ఉంటుందని చెబుతున్నారు. విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకెళ్లే ముందు యాగమండపం లోని 16 స్తంభాలు, నాలుగు ద్వారాలకు పూజలు చేశారు. ప్రధాన ఆలయంలోని 16 స్తంభాలు 16 దేవుళ్లకు చిహ్నాలు అని చెప్పారు. మండపం నాలుగు ద్వారాలు నాలుగు వేదాలను సూచిస్తున్నాయి. ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఇద్దరు ద్వారపాలకులు నాలుగు వేదాలలోని రెండు శాఖలకు ప్రతినిధులుగా పేర్కొన్నారు. సుమారు 500 సంవత్సరాల పోరాటం తర్వాత శ్రీ రామ జన్మభూమికి విముక్తి లభించిందన్న సంగతి తెలిసిందే. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ , ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం నియమ నిబంధనల ప్రకారం నిర్వహిస్తారు. దేశ, విదేశాల నుంచి వేలాది మంది అతిథులు దీనిని తిలకించనున్నారు. మొదటి రోజు అంటే జనవరి 22న అందరినీ రాముడి గర్భగుడిలోకి అనుమతించనప్పటికీ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత భక్తు ల దర్శనం కోసం గర్భాలయం తెరచి ఉంచుతారు. ఐదు శతాబ్దాల కల సాకారం కానుండడంతో రామభక్తులు పలు రకాలుగా రామయ్య మీద తమ భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తున్నారు. కొందరు వజ్రాల నగలు సమర్పిస్తే.. మరికొందరు భారీగా

ప్రసాదాలను సమర్పిస్తున్నారు.. శ్రీరాముడు అత్తారిల్లు నుంచి భారీగా కానుకలను ఇప్పటికే అందుకున్నారు. శ్రీరామచంద్రుడికి నగలు నాణెలిలు కంటే.. తులసి అత్యంత పీతిప్రాత్రం. ఓ భక్తుడు.. రామయ్యను సేవించ డానికి ఏకంగా తులసి వనాన్ని సృష్టించాడు. బెంగుళూరు నగరానికి చెందిన ఒక భక్తుడు శ్రీరాముడిని తులసితో పూజించడానికి ఏకంగా తులసి వనాన్ని రెడీ చేశాడు. అయోధ్య సమీపంలో సుమారు 60 కిలోమీటర్ల దూరంలో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి తులసి మొక్కలను పెంచుతున్నాడు. గుజరాత్‌లోని తులసి అడవుల నుంచి కృష్ణతులసి విత్తనాలను తీసుకొచ్చి నాటారు. ప్రస్తుతం తులసి మొక్కలు పెరగడంతో బాల రామయ్య ప్రతిష్టాపన సమయంలో తులసి మాలను సమర్పించాలని నిర్ణయించారు. మొత్తంగా ఆధ్మాత్మిక విశ్వనగరి అయోధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అత్యద్భుత నిర్మాణ శైలితో..అయోధ్య రామమందిరం ప్రపంచాన్ని అబ్బురపరుస్తోంది. ప్రాణప్రతిష్ఠ కర్మకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నియమ నిష్టలతో దీక్ష చేస్తున్నారు.ప్రాణప్రతిష్టకు ఆతిథ్యం ఇవ్వడానికి అవసరమైన నియమాలపై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో ప్రధాని కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతూ, నేలపై దుప్పటి కప్పుకుని నిద్రపోతున్నారు. ప్రధాని మోదీ గత వారం రోజుల్లో మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా పర్యటించారు. ఈ నేపథ్యంలోనే అయోధ్యలోని ప్రతి ఇంట్లో, ప్రతి దుకాణం లో ప్రతి చౌరస్తాలో రామనామం తాండవమాడుతోంది. రామ్‌ఘాట్ నుండి అయోధ్యలోకి ప్రవేశి స్తున్నప్పుడు అక్కడ ఏర్పాటు చేసిన ఒక హోర్డింగ్ దీపావళి వేడుకలను గుర్తుచేసేలా ఉంది. రామభజన, రామాయణానికి సంబంధించిన పాటలు వాడవాడలా ప్రతిధ్వనిస్తుండంతో రామభక్తులకు మరింత ఉత్సాహాన్ని అందిస్తున్నాయి.

మరోవైపు అయోధ్యకు దేశ విదేశాల నుంచి భక్తులు, సాధుసంతులు చేరుకుంటున్నారు. ఇకపోతే రామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా అరుదైన కానుకగా చేనేత మగ్గం పై బంగారు పట్టుచీరను సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు సిద్దం చేశాడు. సీతారాములకు సిరిసిల్ల బంగారు పట్టు చీర.. ప్రధాని మోడీ చేతుల మీదుగా అందిస్తానని తెలిపారు. రామయ్య కోసం తిరుమల శ్రీవారి కూడా తన ప్రసాదాన్ని పంపిస్తున్నారు.దాదాపు 3 వేల కేజీల బరువు ఉన్న శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని విమానంలో అయోధ్యకు పంపేందుకు టీటీడీ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. మొత్తంగా దేశం యావత్తూ ఈ క్రతువులో పాలుపంచుకోవడం మహద్భాగ్యంగా చూడాలి. రాముడి జన్మస్థానంలో ఆలయం నిర్మితం కావడం..మనమంతా చూసే భాగ్యం కలగడం ఈయేటిమేటి ఘట్టంగా చరిత్రలో నిలిచిపోనుంది.



## ఈ అలల రూపం - ఆ కెరటముల తేజం

- శ్రీతేజ కలం

అలల కిరణం ఆ రూపం
వెన్నెల కెరటం ఆ బింబం !!

కళల గాంభీర్యం ఆ తేజం
ఆటల కోలాహలం ఆ గమనం !!

ముత్యాల అందం ఆ స్నేహం
పువ్వుల మకరందం ఆ జగడం !!

పదనిసల మాధుర్యం ఆ రాగం
పగడముల సంగీతం ఆ వ్యాఖ్యానం !!

నగవుల కిరీటం ఆ చాతుర్యం
మాణిక్యముల చందనం ఆ హృదయం !!!



- శశికాంత్ మెంచు
(91)789-316-9944

# అప్పులపై కాదు..
# అంశాలపైనే దృష్టి ముఖ్యం

రాజకీయ చదరంగంలో ఎవరు ఎప్పుడు సోపానపటం ఎక్కుతారో చెప్పలేం. కింద ఉన్న పాములు మింగకుండా పైకి ఎదగడం అన్నది అంత సులువు కాదు. అయితే అలా వచ్చిచేరిన వారిలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు వరసలో ఉంటారు. పదమపద సోపానంలో ఆయన పెద్దపాములను తప్పించుకుని పైకి వచ్చారు. ఇప్పుడు తన దక్షతతో ముందుకు సాగితేనే ప్రజలు ఆశీర్వదిస్తారు. ఇకపోతే రాజకీయాల్లో ఎత్తులు, పై ఎత్తులు సహజం.అవే గెలుపు ఓటములను నిర్దేశిస్తాయి. రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలన్నా..నేతగా నిలవాలన్నా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా సాగాల్సి ఉంటుంది. నేటి రాజకీయాల్లో ప్రజల మధ్య వేసే ఎత్తులతోనే ఎత్తుకు ఎదుగుతారు. లేదా అధోపాతాళానికి పడిపోతారు. కేసీఆర్ సైతం పదేళ్ల పాలనలో ఇలాంటి వ్యూహాలతోనే ప్రత్యర్థులకు చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. ఆయన పాలనా పగ్గాలు చెపట్టిన తర్వాత ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. ప్రధానంగా నిరంతర విద్యుత్ ఆయనను సమర్ధ నేతగా ప్రజల ముందు నిలిపింది. ఇక మిగతావన్నీ పెద్దగా కదిలించలేకపోయినా..ఆయన మాత్రం అప్పులు చేశారని ఇప్పుడు తేలింది. అయితే ప్రజలు ఈ అప్పుల గురించి పెద్దగా పట్టించుకోరు. సంఓమం అభివృద్ధి సాగుతుందా లేదా అన్నది మాత్రమే చూస్తారు. గత ప్రభుత్వానికి భిన్నంగా పాలన కావాలని కోరుకుంటారు. గత ప్రభుత్వ అప్పులను చూపిస్తూ..పోతే ప్రజలు పట్టించుకోరు. అప్పులను ఎలా తీరుస్తారన్నది ప్రజలకు అనవసరం. పథకాలను కొనసాగిస్తూ..అక్రమాలను అరికట్టే సామర్థ్యం ఇప్పుడు అవసరం. తెలంగాణ ఉద్యమే నీళ్లపై నడిచింది. సాగు నీరు లేని తెలంగాణకు కాళేశ్వరమే దిక్కు అని పెద్ద ఎత్తున బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ప్రచారం చేశారు. రివర్స్ ఇంజనీరింగ్ అని, ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ అద్భుతమని ప్రపంచ వ్యాప్తంగా కాళేశ్వరం గురంచి ప్రచారం చేశారు.

కాళేశ్వరం ద్వారా సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టుగా కేసీఆర్ పలు వేదికల్లో గొంతెత్తి చెప్పారు. ఇప్పుడు అదే కాళేశ్వరం ప్రాజెక్టు విఫల ప్రాజెక్టుగా కనిపిస్తోంది. దీనిని మెయింటెయిన్ చేయడం కూడా కష్టమేనని అంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజల్లో ఇమేజ్ సంపాదించుకున్న కేసీఆర్‌ను ఇదే అస్త్రంతో పలుచన చేసే దిశగా కాళేశ్వరం అస్త్రాన్ని రేవంత్ రెడ్డి ప్రయోగిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని అందుకు మేడిగడ్డ కుంగిపోవడమే కారణం అని తేల్చారు. అసెంబ్లీలో కాళేశ్వరం ఆవశ్యకతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కేసీఆర్ ఇచ్చినట్లే...రేవంత్ రెడ్డి కూడా సీఎం హోదాలో కాళేశ్వరం అవినీతికి, నాణ్యతా ప్రమాణాలు లేని అనవసరప్రాజెక్టుగా తన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అభివర్ణించారు.

తెలంగాణ రాష్ట్రంలో మౌళిక సదుపాయల కల్పన కోసమే అప్పులు చేశామని, మనది ధనిక రాష్ట్రమని కెసిఆర్ బాకా ఊదారు.ఇదే అంశాన్ని ఇప్పుడు రేవంత్ రెడ్డి కేసీఆర్ పై ప్రయోగిస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని



అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు అప్పులు 72,658 కోట్లు ఉంటే, ఇప్పుడు ఆ అప్పు 6,71,757 కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రాష్ట్రంలో చీకటే అన్న మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి మాటలను బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రతీవేదికపైన చెప్పారు. కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలో చీకటి లేదు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి అమలు చేశారు. అయితే విద్యుత్ సంస్థలన్నీ అప్పుల్లో ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. విద్యుత్ రంగంలో అప్పు 81,516 కోట్లు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. 29 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, డిస్కంలు అప్పుల్లో కూరుకుపోయాయని, నీటి పారుదల శాఖ నుండే 14వేల కోట్ల రూపాయలు రావాలని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై ఎదురు దాడికి దిగింది. భూ సంస్కరణల్లో ధరణి పోర్టల్ ఆధునిక విప్లవంగా కేసీఆర్ సర్కార్ పేర్కొంది. భూకబ్జాలు జరగకుండా, భూహక్కుదారులకే హక్కు కల్పించేది ధరణి అని కేసీఆర్ చెప్పారు. ధరణి పోర్టల్ ఓ లోపాల పుట్టగా అభివర్ణిస్తున్నారు. రైతులకు లేని సమస్యలు తెచ్చిపెట్టిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ధరణితోనే బీఆర్ఎస్ పై దాడికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కొత్త జిల్లాల ఏర్పాటు పాలనా పరంగా తీసుకున్న గొప్ప నిర్ణయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రజల వద్దకు ఐఏఎస్, ఐపీఎస్ లను తీసుకెళ్లిన నిర్ణయంగా చెప్పుకుంది. అయితే ఈ జిల్లాల ఏర్పాటు పారదర్శకంగా లేదని రేవంత్ రెడ్డి విమర్శలు ఎక్కుపెట్టారు. జిల్లాలు, మండలాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, దీనిపై ఓ కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. దీంతో జిల్లాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ప్రకటించారు.


బీఆర్ఎస్‌కు కొంత మంచి పేరు తెచ్చిన అంశాలుగా చెప్పుకున్న వాటిపైన పూర్తి స్థాయిలో విఫలమైన అంశాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. అయితే ప్రజలకు మాత్రం ఇవన్నీ పట్టవు. అప్పుల గురించికూడా వారు పట్టించుకోరు. ఉద్యోగాలు, నీళ్లు, నియామకాలు వచ్చాయా లేదా అన్నది చూస్తారు. ఇవి సక్రమంగా నెరవేర్చే సత్తా చాటితేనే రేవంత్ ప్రజల్లో నిలుస్తారు..గెలుస్తారు.

## అయోధ్య ప్రాణప్రతిష్ట వేళ మరో విశేషం

### సరయూనదిలో సోలార్ బోట్ షికారు

అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్టాపన వేడుకలకు అయోధ్య సిద్ధమవుతోంది. జనవరి 22 న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకల సన్నాహాల్లో భాగంగా అయోధ్య నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతే కాదు అయోధ్య నగరాన్ని మోడల్ సోలార్ సిటీగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మారుస్తోంది. రామయ్య ప్రాణ ప్రతిష్ట వేడుకకు వచ్చే భక్తుల కోం సరయూ నదిలో సూర్య శక్తితో నడిచే ఎలక్ట్రిక్ బోట్ ప్రారంభించారు. నదిలో సోలార్ బోట్ ను ప్రవేశపెట్టడం దేశంలోనే ఇది మొదటిసారి. ఇది పర్యావరణ అనుకూల బోట్. దీనిని యూపీ ప్రభుత్వానికి చెందిన న్యూ ఎనర్జీ డెవలప్ మెంట్ అథారిటీ , పుణెలికు చెందిన పడవ తయారీ సంస్థ కలిసి తయారు చేశారు.

అయోధ్య తర్వాత వారణాసిలోని గంగా నదిలో కూడా సోలార్ బోట్ ను ప్రారంభించనున్నారు. ఈ ఎలక్ట్రిక్ సోలార్ బోట్ లో 30 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చు. సరయూ నదిపై ఉన్న అయోధ్య కొత్త ఘాట్ నుంచి ఈ పడవ నడుస్తుంది. భక్తులు 45 నిమిషాల్లో అయోధ్య చేరుకోవచ్చు. సరయూ నది ఒడ్డున ఉన్న చారిత్ర దేవాలయాలు, వారసత్వ ప్రదేశాలను చూడొచ్చు. ఫుల్ ఛార్జింగ్‌తో సోలార్ బోట్ 5 నుంచి 6 గంటల పాటు నడుస్తుంది. ఈ సోలార్ బోట్ లో కొన్ని ప్రత్యేకతలున్నాయి. పడవలో 550 వాట్ల శక్తిని ఉత్పత్తి చేసే 3.3 కిలో వాట్ రూఫ్ టాప్ సౌర ఫలకాలుంటాయి. 46 కిలో వాట్– గంట బ్యాటరీతో రన్ అయ్యే 12 వోల్ట్ ట్విన్ మోటార్ ను కలిగి ఉంటుంది. అదనంగా రిమోట్ ద్వారా చూసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఎక్కడ నుంచైనా దీనిని చూడొచ్చు.



# రాహుల్ ఒంటరి ప్రయాణం!

దేశంలో మిత మత వాదానికి, మత సహన అభ్యుదయ వాదానికి మధ్య మరో భారీ బ్యాలట్ పోరుకు రంగం సిద్ధమవుతున్నది. పాలక, ప్రతిపక్షాలు చెరో వైపు ఉండి ఈ తాడు ఆటను రక్తికట్టిస్తున్నాయి. ప్రజలు ఎవరి వెంట ఎంత మంది మోహరించి ఈ తాడును లాగుతారో, ఎవరు గెలిచి, ఎవరు ఓడుతారో కొద్ది మాసాల దూరంలో గల లోక్‌సభ ఎన్నికలు రుజువు చేస్తాయి. ప్రస్తుతం రెండు సన్నివేశాలు ఈ రెండు శిబిరాల ఆరాటాన్ని చాటుతున్నాయి. ఇందులో ఒకటి ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న రామాలయ ప్రాణ ప్రతిష్ట మహెూత్కృష్ట ఘట్టం కాగా, రెండవది కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మొన్న సోమవారం నాడు సంక్షుభిత మణిపూర్ నుంచి ముంబై వరకు ఉద్దేశించి ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్ యాత్ర. ఏడాది క్రితం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. మొదటి యాత్ర ఆయనకు మంచి పేరు తెచ్చిందని అనుకొన్నారు.

కాని మొన్నటి అయిదు రాష్ట్రాల శాసన సభ ఎన్నికల్లో మూడు కీలక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి రాహుల్ యాత్ర గాలిని తీసి వేసింది. అయినా కుంగిపోయి కాడి వదిలేయకుండా రెండో యాత్రను దీక్షతో కొనసాగించడంలో ఆయన పట్టుదల కనిపిస్తున్నది. ఈ యాత్ర రెండో రోజు మంగళవారం నాడు నాగాలాండ్‌లో మాట్లాడుతూ అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠపై రాహుల్ వ్యాఖ్యానించారు. అది పూర్తిగా నరేంద్ర మోడీకి చెందిన రాజకీయ ఉత్సవమన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపిల ఉత్సవమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చుట్టూ అల్లిన ఈ ఘట్టంలో పాలు పంచుకోడం తమకు సాధ్యం కాదని కూడా స్పష్టం చేశారు. రామాలయ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలను ఆహ్వానించగా వారు అందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్ సభలో పార్టీ నాయకుడు అధిర్ రంజన్ ఈ ఉత్సవాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు.

ఈ ఉత్సవాలను ఎందుకు తాము బహిష్కరిస్తున్నారో రాహుల్ గాంధీ వివరించారు. తాము అన్ని మతాలను గౌరవిస్తామని రాహుల్ స్పష్టం చేశారు. అయోధ్యలో బిజెపి, ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న ప్రాణ ప్రతిష్ఠ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందులో గెలుపును ఆశించిన రాజకీయ సన్నివేశమని అన్నారు. ఈ వైఖరిని ఆక్షేపించవలసిన పని లేదు. బాబ్రీ మసీదు విధ్వంసం నాటి నుంచి అదే స్థలంలో ఇప్పుడు అట్టహాసంగా జరుపుకొంటున్న ప్రాణప్రతిష్ఠ ఘట్టం వరకు సాగిన వివాదాస్పద చరిత్ర అందరికీ తెలిసిందే. ఈ అంశాన్ని కేంద్రంగా చేసుకొని బిజెపి పొందిన రాజకీయ ఫలాల గురించి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. అందుచేత సరైన అవగాహన గల వారెవరైనా అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని రాజకీయాలకు అతీతమైనదిగా ఎంతమాత్రం పరిగణించలేరు. అయితే రాహుల్ గాంధీ విమర్శకు బిజెపి ఇచ్చిన సమాధానం కూడా ప్రస్తావించుకోదగినది.




రామాలయ ఘట్టంపై రాహుల్ గాంధీ విమర్శ రాజకీయ పూరితమైనదని, ఆయనకు ఎటువంటి సమాధానం ఇవ్వాలనే దాన్ని తాము ప్రజలకే వదిలిపెడుతున్నామని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మంగళవారం నాడు ప్రకటించారు. రాహుల్ గాంధీ రాజకీయాలను దేశ ప్రజలు అర్థం చేసుకోగలరని అన్నారు. రాముడి పట్ల దేశ ప్రజలకున్న భయభక్తులపైన, ఆరాధన భావం పట్ల బిజెపికి వున్న నమ్మకం ఎంత గట్టిదో దీనిని బట్టి ఆర్థం అవుతున్నది. అయోధ్య బాబ్రీ మసీదు స్థలంలో రామాలయాన్ని కట్టి తీరుతామని ప్రజలకు వాగ్దానం చేసి తాము అధికారంలోకి వచ్చామని, దానిని చేసి చూపించామని చెప్పి వారి నుంచి తిరిగి అధికారాన్ని పొందవచ్చని బిజెపి ఆశిస్తున్నది. ఈ సారి లోక్‌సభలో తమ బలం 400కి చేరడం ఖాయమని వారు చెబుతున్నారు. కాని దేశ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాది జనం ప్రాణప్రదంగా భావించి ఆరాధించే మర్యాద రాముడికి ఇప్పటి అయోధ్య రాముడికి తేడా ఉంది.

అందుకే ఈ ఉత్సవం రాజకీయమైనది అని అనడాన్ని కొట్టిపారేయలేము. పరమత ద్వేషం పునాదుల మీద బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు నిర్మించిన ఆలయ ఉద్యమానికి ఊపిరి కరిన హిందుత్వమనేది వాస్తవమే. అయితే ఉత్తరాది ప్రజలు కూడా దీనితో మమేకమవుతున్నారనేది కూడా నిజమే. పటిష్టమైన ప్రజాస్వామిక సెక్యులర్ మహెూద్యమం ద్వారానే వారిని బిజెపి హిందుత్వ వ్యూహం నుంచి వేరుచేయగలం. బిజెపిని ఈసారి ఓడించి తీరాలని సంకల్పం వహించిన 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ ఒక్క పిడికిలిగా మారి ఈ సందేశాన్ని బలంగా జనంలోకి తీసుకెళ్లాలి. లోక్‌సభలో అత్యధిక స్థానాలు (80) కలిగిన ఉత్తరప్రదేశ్‌లో సామాజిక న్యాయశక్తులను కలుపుకొని ఉమ్మడి ప్రతి పక్ష ఓటును నిర్మించవలసి ఉంది. కొన్ని చిన్న చిన్న పార్టీలు పోటీ చేయడం వల్ల కూడా అక్కడ ప్రతిపక్ష వ్యతిరేక ఓటు చీలిపోయి బిజెపికి మేలు చేస్తున్నది. అటువంటి రంధ్రాలను పూడ్చుకోగలగాలి. రాహుల్ గాంధీ తాజా యాత్ర యుపిలో కుప్పకూలిపోయి ఉన్న కాంగ్రెస్ ఏనుగును ఏమేరకు తిరిగి లేపగలుగుతుందో చూడాలి.




# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### నూతన సంవత్సరం క్యాలెండరును ఆవిష్కరణ చేసిన పిఆర్టియు మండల శాఖ

**శంకర్‌పల్లి జనవరి 19 (వెలుతురు):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం పి ఆర్ టి యు టి స్ అని టి ఆర్ టి యు టి ఎస్ శంకర్పల్లి మండల శాఖ అధ్యక్షులు రాజశేఖర్ అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి డి ఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలి పదోన్నతులతో కూడిన ట్రాన్స్ఫర్లను జరిపించాలి అని అన్నారు. శుక్రవారం శంకర్ పల్లి బాలుర ఉన్నత పాఠశాల శంకర్ పల్లి ప్రాంగణంలో పిఆర్టియు టిఎస్ మండల శాఖ మరియు రాష్ట్ర శాఖ వాల్ క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు ఎం. రాజశేఖర్, గౌరవాధ్యక్షులు కె. బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి సి. రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి. రాములు, మరియు కార్యవర్గ సభ్యులు సి. ఆనందం, ఆరిఫ్ పాషా, అంజిరెడ్డి, కె. శ్రీరాములు, కె. మల్లేశం, సంజి మల్లేశం, రవి కాంత్ రెడ్డి, అస్రఫ్ ఖాన్, బలరాం, మాణిక్యం, శ్రీధర్ రెడ్డి, జయరాములు, కె. రవీందర్ రెడ్డి, హరికృష్ణ, కె. యాదయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్యయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన సర్పంచ్

**వెలుతురు న్యూస్, తలకొండపల్లి:**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం, చౌదర్పల్లి గ్రామంలో ఈరోజు ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ చంద్రయ్య ఏర్పాటు చేయడం జరిగింది. బాడీలో రక్త ప్రసరణ ఏ విధంగా ఉంది, బీపీ షుగర్ గుండె లివర్ సంబంధిత వ్యాధుల గురించి మిషన్ ద్వా ర ఫ్రీగా



చెకింగ్ చేయడం జరిగింది. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రయ్య ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి భగవాన్ రెడ్డి రవి కిరణ్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, స్కూల్ వైస్ చైర్మన్ మల్లయ్య , మహేష్ కృష్ణయ్య డాక్టర్స్ గ్రామ ప్రజలు గ్రామ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తాం..

### మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్
### పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి కలిసి పర్యటన..

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
తెలంగాణ గౌరవ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సారధ్యంలో వికారాబాద్ మున్సిపల్ ను మరింత అభివృద్ధి చేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముందుకు వెళ్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. శుక్రవారం స్పీకర్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు



10, 12 వ వార్డులలో చైర్ పర్సన్ గారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వార్డులలో కావాల్సిన అభివృద్ధి.. అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి నోట్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ సమస్యలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి వార్డులను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ లు వేణుగోపాల్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు రెడ్య నాయక్, దీపు,సందీప్, మున్సిపల్ సిబ్బంది ఉదయ్,మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాస్ నియామకం పట్ల హర్షం

### జిల్లా బిజెపి అధ్యక్షులుగా రెండవసారి గడ్డం శ్రీనివాస్ ను నియమించిన పట్ల
### శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 19:** మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాస్ ను నియమించడం



పట్ల ప్రత్యేకంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ జిల్లాలో బిజెపి పటిష్టత కోసం కృషి చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్ మంగళ కృష్ణ బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ఆల్విన్ కాలనీలో ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు...

### రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం పండ్లు పంపిణీ...
### జీవిత సత్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన వేమన పద్యాలు రఘునాథ్ రెడ్డి...

**కూకట్‌పల్లి, వెలుతురు:** యోగి వేమన రచించిన పద్యాలు తరతరాలకు జీవిత సారాన్ని సత్యాన్ని తెలిపే గొప్ప కవితలని రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన జయంతిని పురస్కరించుకొని రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద నగర్ కాలనీ రెడ్డి సోదరులు వృద్ధులకు అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. ఈ మేరకు ఆల్విన్ కాలనీ రాజేశ్వరి వృద్ధాశ్రమంలో రెడ్డి సోదరులు యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రఘునాథ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను చీల్చి చెండాడిన సంఘసంస్కర్త, కవి మహాయోగి వేమన అని కొనియాడారు. వేమన పద్యాలలో సమాజహితం ఉంటుందని, అలతి పదాల పద్యాలతో అనంత అర్థం ఉంటుందన్నారు. పాతుకుపోయిన దురాచారాలు, మూఢ నమ్మకాలు, మోసాలు, లోపాలు, తప్పులను ఎత్తి చూపారని అన్నారు. వేమన పద్యాలు తెలియని తెలుగు ప్రజలు లేరని, ఆయనను స్మరించుకోవడం ప్రజల కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, కసిరెడ్డి రామలింగేశ్వర్ రెడ్డి నారాయణ రెడ్డి, వినోద్ రెడ్డి తదితరుల రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ -శంకర్పల్లి రోడ్డు అస్తవ్యస్తం

### వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్న స్థానికుల ఆవేదన..!!
### నరకం చూస్తున్న ప్రయాణికులు,
### పట్టించుకోని అధికారులు ,ప్రజాప్రతినిధులు...



వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్): మండలపరిధిలోని గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. నవాబుపేట్ మండల కేంద్రంలో వికారాబాద్ -శంకర్పల్లి వెళ్ళు రోడ్డు పూర్తిగా గుంతలమై వాహన దారులు ప్రమాదలకు గురవుతున్నారు.నవాబుపేట్ మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు,లింకురోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో రాత్రివేళ ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఈ దారులపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి..**

మండలంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. రద్దీగా ఉండే ఈ రోడ్లకు నామమాత్రంగా మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని పలువురు వాపోతున్నారు. వికారాబాద్ -శంకర్ పల్లి వెళ్ళు రోడ్డు నవాబుపేట్ మండల కేంద్రంలో రోడ్డు గుంతలతో అధ్వణంగా తయారైంది, వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు.అదే విదంగా రహదారిపై మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేక అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

# రాబోవు పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

### అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి:
### జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి..

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, ఓటర్ నమోదు, సవరణలుపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలను రాజకీయ పార్టీల సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా పార్లమెంటు ఎన్నికలలో సహకరించాలని కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా ఈనెల 20, 21 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలతో ఎల్ ఓ లు అందుబాటులో ఉంటారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అలాగే స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

జిల్లాలో ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా



ప్రచురితమైనందున ఇందులో ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే ఈనెల 22వ తేదీ వరకు తెలియపరచాలన్నారు. మార్పులు చేర్పులు, షిఫ్టింగులు, ఓటరు నమోదుకు ఫామ్ 6,7,8 ద్వారా దరఖాస్తు చేసుకోనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని రాజకీయ ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా 18 - 19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.
పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా వీ.సీ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 20 , 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్ళు పూర్తి చేసుకున్న యువతీ, యువకులందరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిర్ణీత 6 , 7 , 8 దరఖాస్తు ఫారాలతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.




ఓటరు ముసాయిదా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు చేపట్టాల్సి ఉన్నట్లయితే, వాటిని సరిచేసుకునేలా చూడాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను, సిమిలర్ ఫోటో ఎంట్రీ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ ఓటర్లను గుర్తించడం జరిగిందని, అలాంటి వారికి నోటీసులు పంపించి ఓటరు జాబితా నుండి అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తుది జాబితాలో ఏ ఒక్క డూప్లికేట్ పేరు ఉండకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలని సూచించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల కోసం వెంటనే ప్రింటింగ్ కోసం సమగ్ర వివరాలతో జాబితాను పంపించాలని ఎన్నికల విభాగం అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్లకు పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లయితే, వాటి వివరాలు తెలియజేయాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 న విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, వికారాబాద్, తాండూర్ ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాస రావు ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్‌ను అభివృద్ధి పరచడానికి
# అన్ని విధాలుగా కృషి

### డ్రైనేజీ పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్

**మేడిపల్లి, వెలుతురు:** డివిజన్ ప్రజలకు అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని, డివిజన్ అభివృద్ధిలో సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని అన్నారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్. ఈ మేరకు 24వ డివిజన్ లో జరుగుతున్న డ్రైనేజ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. జ్యోతి నగర్ నుంచి సాయి దుర్గా నగర్ వరకు జరుగుతున్న డ్రైనేజ్ భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని రాజీ పడకూడదని కాంట్రాక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 డివిజన్ ను నాలుగు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, తాము చేసినా పనులతో డివిజన్ ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించి వారితో మమేకం అవ్వడమే తనకు ముఖ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దం రామచందర్, జ్యోతి నగర్ కాలనీ అధ్యక్షులు శివ గౌడ్, సాయి దుర్గా కాలనీ అధ్యక్షులు రమణ, అమూల్య దివ్య నగర్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరు ఓటర్‌గా
# నమోదు చేసుకోవాలి

### ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ జహీరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్లాం ఫారోఖీ

**జహీరాబాద్, 19 జనవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీప్ (SVEEP) మరియు రాజనీతి శాస్త్రం అధ్యర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ జహీరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్లాం ఫారోఖీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకొని




ప్రజాస్వామ్య విజయానికి కృషి చేయాలనీ పేర్కొన్నారు. జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ,18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలి అని తమ పరిసర ప్రాంత వ్యక్తులకు కూడ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ గౌస్ మాట్లాడుతూ, గత శాసన సభ ఎన్నికల నాటికీ నూటికి నూరు శాతం నమోదు ప్రక్రియ జరిగిందని ఇప్పుడు కూడ అర్హులైన విద్యార్థులు అందరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ రుకమోద్దీన్, మాస్టర్ ట్రైనర్ తులసి రామ్ రాథోడ్, రాజనీతి శాస్త్రం ఉపన్యాసకులు డాక్టర్ సురేందర్‌తో పాటు ఉపన్యాసకులు డాక్టర్ నరహరి మూర్తి, శకుంతల, డాక్టర్ అయేషా బేగం, బదర్ సుల్తానా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో జాతీయ రహదారి
# భద్రతా మాసోత్సవాలు

**జహీరాబాద్, 19 జనవరి, వెలుతురు :** 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మహీంద్ర కంపెని వద్ద సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రోడ్డు రవాణా శాఖ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్





జయప్రకాష్ రెడ్డి, ఎల్ అండ్ టి పెట్రోలింగ్, మహీంద్రా కంపెని సిబ్బందితో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమన్నీ బైక్ ర్యాలీలతో ప్రారంభించారు. ద్విచక్ర వాహనాలకు హెల్మెట్ మరియు కార్ వాహన దారులకు సీట్ బెల్ట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రోడ్డు రవాణా శాఖ సిబ్బంది, ఎల్ అండ్ టి పెట్రోలింగ్ సిబ్బంది మరియు మహిద్ర కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధిత అధికారులందరూ
# అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిపై శాఖల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి పరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రికి వాటర్ ప్లాంట్, రెండు అంబు లెన్సులు, జనరేటర్ తో పాటు అవసరమైన సిబ్బంది కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ సెంటర్‌ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. రోడ్లు మరియు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా అవసరమైన సింగిల్ డబుల్ రోడ్లతో పాటు జిపి బిల్డింగ్స్, కమ్యూనిటీ హాల్స్, వంతెనలు, అతిథి గృహం కొరకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ద్వారా వ్యవసాయం మరియు డొమెస్టిక్ అవసరాల మేరకు అవసరం మేరకు కొత్త ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని



అన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి అవసరమైన సాగు త్రాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా రిసర్చ్ సెంటర్ ఏర్పాటుకు 50 ఎకరాల స్థల సేకరణ వారం రోజులలో జరగాలని అన్నారు. పశుసంవర్ధక శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించిన డిప్లొమా కళాశాల ఏర్పాటుకు నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు.

కొడంగల్ నియోజకవర్గంలో జిల్లా స్థాయి తరహాలో అభివృద్ధి పరిచేందుకు అన్ని ప్రతిపాదనలను సిద్ధం చేసి కడ ప్రత్యేక అధికారికి సోమవారం వరకు అందజేయాలని అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పనిచేసే అధికారులందరూ పూర్తి బాధ్యతతో చురుకుగా పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, కడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# మహిళ హత్య కేసును చేధించిన పోలీసులు..

### హత్యకు దారి తీసిన అక్రమ సంబంధం

### వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

**వికారాబాద్ జిల్లా వెలుతురు ప్రతినిధి:** పులమద్ది గ్రామ సర్పంచ్ తిమ్మాపురం మాధవరెడ్డి కి ద్వారా తెలిసిన విషయం వారి గ్రామ శివారులలో ఒక చిన్న కాలువలో ఒక గుర్తు తెలియని ఆడ మనిషి శవము సగం కాలి ఉన్నది అని సమాచారం రాగానే వెంటనే వికారాబాద్ పోలీస్ వారు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేయడం జరిగింది. ఇట్టి కేసును లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఛేదించాలి అని వికారాబాద్ డి.ఎస్.పి నర్సింహులు కి ఆదేశాలిస్తూ ఆధ్వర్యంలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను,మోమిన్ పేట్ సిఐ ఆంజనేయులు , నవాబ్ పేట్ ఎస్సై భరత్ భూషణ్ , ధరూర్ ఎస్సై సంతోష్ కుమార్, మర్పల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి మరియు ఐటి సెల్ అధికారులతో 4,5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇట్టి విషయం పైన దర్యాప్తు మొదలు పెట్టడం జరిగింది.ఇట్టి దర్యాప్తు లో భాగంగా టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఆధారాలు సేకరించి వాటిని విశ్లేషిస్తూ,వివిధ పోలీస్ స్టేషన్ లకు గుర్తు తెలియని మహిళలకు సంబంధించిన దొరికిన ఆధారాలతో లుక్ అవుట్ నోటీసులను పంపించడం జరిగింది. అన్ని బృందాల నుండి ఇట్టి కేసుపైన ముమ్మరంగా కేసు పరిశోధన చేస్తున్నా క్రమం లో తేదీ 17.01.2024 నాడు చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో ఒక ఆడ మనిషి మిస్సింగ్ కేసు ను గుర్తించడం జరిగింది. అట్టి కేసు యొక్క వివరాలు తీసుకోని తప్పిపోయిన మహిళ వివరాలు, గుర్తుతెలియని మహిళ శవము యొక్క వివరాలు పరిశీలించి మృతురాలి కుటుంబీకులతో చర్చించగా తెలిసినది ఏమనగా అట్టి తప్పిపోయిన మహిళనే ఈ గుర్తు తెలియని మహిళ శవము అని నిర్ధారించుకోవడం జరిగింది. కేసు పరిశోధనలో భాగంగా మృతురాలు యొక్క కుటుంబీకుల భయానాల ఆధారంగా మృతురాలు అవుసుపల్లి బాబు అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని తరచూ ఫోన్లో మాట్లాడి కలుసుకునేది అని తెలిసినది. అవుసుపల్లి బాబు గురించి వెతకగా 18.01.2024 రాత్రి తన ఇంటి దగ్గర అదుపులోకి తీసుకొని విచారించగ నేరస్థుడు మృతురాలతో గత మూడు నాలుగు సంవత్సరాల నుండి అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అప్పుడప్పుడు ఆమెకు డబ్బులు ఇచ్చేవాడు. నేరస్తుడు మృతురాలకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా మృతురాలు ఇవ్వకపోవడంతో మరియు మృతురాలు వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుంది అని అనుమానంతో మృతురాలను చంపుటకు నిర్ణయించుకున్నాడు.

అందుకుగాను నేరస్తుడైన అవుసుపల్లి బాబు మృతురాలు ఎర్రోళ్ల అనుసూజను మాయ మాటలు చెప్పి పులమద్ది గ్రామ శివారులోకి తీసుకువచ్చి మద్యం తాపీ తను వేరే వాళ్ళతో అక్రమ సంబంధం పెట్టుకుంది అని అనుమానించి ఆమెతో గొడవకు దిగి ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్ది తరువాత ఆమె చీర కొంగు తో మెడకు బిగించి హత్య చేసినాడు. ఆమె చనిపోయింది అని నిర్ధారించుకొని పక్కన ఉన్న చిన్న కాలువలోకి దొబ్బి ఎవరూ గుర్తుపట్టకుండా ఉండుటకు ఆమె ముఖంపై చీర కప్పి తన వెంట తెచ్చుకున్న అగ్గిపెట్టతో అంటించి మృతదేహన్ని కాల్చి అక్కడి నుండి పారిపోయినాడు అని తెలపడం జరిగింది. ఇట్టి విషయం పైన పోలీస్ అధికారులు ఆవుసులపల్లి బాబు చెప్పిన విషయాలను టెక్నికల్ సీసీటీవీల ద్వారా సేకరించిన ఆధారాలను పరిశీలించి, అతని దగ్గర మహిళకు సంబందించిన పలు వస్తువులు దొరకడం వలన క్రైమ్ సీన్స్ రీ కన్స్ట్రక్షన్స్ చేసి ఆవుసులపల్లి బాబునే ఇట్టి నేరాన్ని చేసాడు అని నిర్ధారించు కోవడం జరిగింది.

నేరస్థుని పైన క్రైమ్ నెంబర్ 277/2016 పైన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మర్డర్ కేసు కూడా నమోదు చేయడం జరిగింది. అప్పటి నుండి అవుసుపల్లి బాబు తన పేరును,చిరునామా మార్చుకుంటూ తిరుగుతున్నాడు.

జిల్లా ప్రజలు కుడా తమ జీవన ప్రయాణంలో తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే జీవించాలని, చుట్టూ ప్రక్కల ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని ఎల్లప్పుడు జిల్లా పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలియజేయడం జరుగుతుంది.

### నిందితులు వివరాలు

ఎఫ్ఐఆర్ నెంబర్.30/2024 యు/సెక్షన్ 302.201. నేమ్ అఫ్ దా తలారి బాబు డాట్ కామ్ హౌస్ పల్లి బాబు సన్నాఫ్ అనంతయ్య. వయస్సు 32 సంవత్సరాలు కులం ఎస్సీ మాదిగ. డ్రైవర్ లేబర్ అండ్ ప్రజెంట్ అడ్రస్. తెల్లాపూర్ విలేజ్ అండ్ పటాన్చెరు మండల్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్ ప్రజెంట్ అడ్రస్ 1-85 రాజాపూర్ విలేజ్ మండల్ వికారాబాద్ డిస్టిక్ .. మధుగుల చట్టంపల్లి విలేజి వికారాబాద్ మున్సిపాలిటీ. శ్రీమతి ఎర్రోళ్ల అనసూయ భర్త లేట్ నర్సింలు 35. సంవత్సరాలు క్యాస్ట్ ఎస్సీ మాదిగ లేబర్ . సిపిఐ కాలనీ చేవెళ్ల విలేజ్ చేవెళ్ల మండల్ రంగారెడ్డి జిల్లా అని తెలిపారు.

## సంక్షేమ గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల
# కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

### రోజురోజుకు సంక్షేమం విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుంది

### పేద విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం

### ఎస్ఎస్డి కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**జహీరాబాద్,19 జనవరి, వెలుతురు :** సంక్షేమ గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, విద్యార్థులు మృత్యువాత పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. రంజోల్ గురుకుల కాలేజీలో చనిపోయిన విద్యార్థిని బేగరి స్వప్న కుటుంబ సభ్యులతో కలిసి సమతా సైనిక్ దళ్ (ఎస్ఎస్డి) కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన బేగరి స్వప్న అనే విద్యార్థిని రంజోల్ గురుకుల కాలేజీలో చదువుతూ కాలేజీలోనే ఆత్మహత్య చేసుకున్నదని అన్నారు. రంజోల్ గ్రామానికి చెందిన ప్రియదర్శిని అనే విద్యార్థిని ఆందోల్ గురుకుల కాలేజీలో చదువుతూ అనారోగ్యంతో చనిపోయింది. సిర్గాపూర్



గిరిజన గురుకులంలో విద్యార్థిని భవనం నుంచి పడి చనిపోయిందని అన్నారు. రోజు రోజుకు సంక్షేమం విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. విద్యార్థుల మృత్యువాత అరికట్టే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థులకు ఒక్కొక్క కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం, ఇందిరమ్మ గృహాలు, మూడు ఎకరాల భూమి,కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్డి జిల్లా అధ్యక్షులు కర్ణం రవి మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**వెలుతురు న్యూస్ తుంగతుర్తి:** తుంగతుర్తి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మందుల సామేలు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిందని, ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన ఆరు గ్యారంటీలను పేదలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు రాష్ట్రంలో గత బి అర్ స్ హయాంలో నియంతత్వ పాలన సాగిందని, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



వెలుతురు నారాయణఖేడ్ జనవరి 19: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ వెంకటాపూర్ గ్రామంలో కురుమ సంగం మల్కొండ ఉపాధ్యక్షులు నియోజకవర్గం అయోధ్య అక్షాంతను గ్రామంలో పంచుతూ గ్రామాన్ని ఎల్లవేళలా ప్రశాంతంగా ఉండాలని భక్తి అన్ని కులమతాలకు ప్రశాంతంగా పంచితో శ్రద్ధలతో ఉండాలని కోరుకుంటున్నా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మలకొండ అని చేపట్టాడు.

## ఖేడ్ మైనారిటీ బాలుర పాఠశాల & కళాశాలలో
# ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

వెలుతురు నారాయణఖేడ్ జనవరి 19 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ లో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ప్రకారం ఈ రోజు నుండి అర్హులైన విద్యార్థుల నుంచి పాఠశాల మరియు కళాశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రిన్సిపల్ తెలిపిన వివరాల ప్రకారం 2024-2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో మైనారిటీ 60 సీట్లు, నాన్ మైనారిటీ 20 సీట్లు మరియు 6వ తరగతిలో 12, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 04 మైనారిటీ సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ ఫస్ట్ఇయర్ కొరకు ఎం.ఈ.సి( ఎం ఇ సి) సి.ఈ.సి( సి ఈ సి )గ్రూపులు ఉన్నాయన్నారు. ఫస్ట్ ఇయర్ లో మొత్తం 40 సీట్లు దాంట్లో 30 మైనారిటీ, 10 నాన్ మైనారిటీ సీట్లకు నేటి తో అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ రోజు నుంచి వ్యక్తిగతంగా స్కూల్ కు వచ్చి లేదా ఆన్లైన్ లో గాని అప్లై చేసుకోవచ్చు అన్నారు.

చివరి తేదీ : ఫిబ్రవరి 06-2024.
కావాల్సిన పత్రాలు :
1.ఆధార్ నకలు, 2. రెండు ఫోటోలు , 3. నాన్ మైనారిటీకి , ఇన్కం-కాస్ట్-లోకల్
4. ఫోన్ నెంబర్., మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్
బాలుర పాఠశాల: 9440054943 / 7995057963లో సంప్రదించాలని కోరారు.



## శ్రీ కాకి సదానంద స్వామి ముదిరాజ్‌కి
# స్వామి వివేకానంద సేవ పురస్కారం

హైదరాబాద్ వెలుతురు జనవరి 19:
నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ద్వారా స్వామి వివేకానంద సేవ పురస్కారం 2024 సంవత్సరానికి గాను శ్రీ కాకి సదానంద స్వామి ముదిరాజ్ గారికి ప్రధానం చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్ గారు తెలియజేశారు. శుక్రవారం రోజున తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియం లో జరిగిన స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలలో భాగంగా





తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ గారు మరియు తెలంగాణ శాసన మండలి సభ్యులు బొగ్గారపు దయానంద్ గుప్త గారు అదేవిధంగా ప్రముఖ సినీ నటులు మాజీ మంత్రి డాక్టర్ బాబు మోహన్ గారు పాల్గొని అవార్డును ప్రధానం చేశారని ఆయన వెల్లడించారు. ఈ అవార్డుకు కాకి సదానంద స్వామి ముదిరాజ్ గారు అన్నోజిగూడ గ్రామం, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా గారు అనేక వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తూ పేద విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు యూనిఫార్మ్ అందజేయడం మరియు పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం వృద్ధాశ్రమాలకు వివిధ రకాల వస్తువులను పంపిణీ చేయడం అదేవిధంగా అనాధాశ్రమ పిల్లలకు వివిధ రకాలైనటువంటి సేవలు అందించినందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభకు పతీవియోగం
అనారోగ్యంతో మృతి చెందిన గాలన్న
కరీంనగర్,జనవరి19వెలుతురు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె భర్త బొడిగె గాలన్న మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బొడిగె గాలన్న కన్నుమూశారు. దీంతో పలువురు రాజకీయ ప్రముఖులు గాలన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఎంపి బండి సంజయ్, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ ఆయన మృతిపై సంతాపం తెలిపారు. బొడిగె గాలన్న తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం నుంచి పని చేశారని, శంకరపట్నం జడ్పీటీసీగా, చొప్పదండి ఎమ్మెల్యేగా పనిచేసిన తన సతీమణి శోభక్కకు అండగా ఉండి పనిచేసారని గుర్తు చేశారు.
గాలన్న చిన్నతనం నుంచే పేదప్రజల సమస్యలపై పోరాటం చేయడంతో పాటు వామపక్ష పార్టీలలో పని చేశారని, గాలన్న మృతి తీరని లోటన్నారు. బొడిగె గాలన్న భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన సైదాపూర్ మండలం వెంకటేశ్వర్ల పల్లెకు తరలించారు. రేపు

# తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రాం

### హాజరైన ఆదర్శ రైతు, వ్యవసాయ అధికారి

తూప్రాన్ వెలుతురు జనవరి, 19:
రైతు దేశానికి వెన్నెముక అని వారి శ్రమతోనే మనకు ఆహారం అందుతుందని తూప్రాన్ మండల వ్యవసాయ అధికారి సచిన్ అన్నారు. రైతులు పొలం లో నిరంతరం కృషి చేస్తేనే మనం ప్రతి నిత్యం ప్రతి పూట తినేందుకు తిండి లభిస్తుందని అన్నారు. అలాంటి రైతుల శ్రమను గుర్తించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అంతే కాకుండా రైతులు వ్యవసాయ సాగులో మెళుకువలు పాటించి అధిక దిగుబడిని సాధించాలని సూచించారు.
వర్షా కాలంలో, యాసంగి లో ఏ విధమైన పంటలు వేయాలనే పలు ఆసక్తికర విషయాలు వివరించారు. అనంతరం ఆదర్శ రైతు మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు సామాజిక స్పృహ కూడా అవసరమని ఆయన అన్నారు. ప్రతి నిత్యం మనం తినే ఆహారం రసాయన ఎరువులు పురుగు మందులు వాడిన ధాన్యం కాకుండా సేంద్రీయ వ్యవసాయం ద్వార పండించిన కల్తీ లేని ఆహారం



తీసుకుంటే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, తద్వారా మెదడు చురుకు గా ఉండి ర్యాంక్ లు సాధిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్ పాల్ రామకృష్ణ, కొంపల్లి జోన్ ఏజీఎం రమణరావు, జోనల్ డీన్ జైపాల్ రెడ్డి, డీన్ నవీన్, సి ఇంఛార్జి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణం విధి నిర్ణయం

### అందుకు మోడీని ఎంచుకున్న రాముడు
### అయోధ్య రథయాత్ర తన సంకల్ప బలం
### రాష్ట్రధర్మ వ్యాసంలో అద్వానీ వెల్లడి

న్యూఢిల్లీ,జనవరి19(వెలుతురు):
అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరగాలనేది విధి నిర్ణయమని, అందుకు అది ప్రధాని మోడీని ఎంచుకున్నదని బిజెపి సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కె ఆద్వానీ పేర్కొన్నారు. వచ్చే వారం ప్రచురితం కానున్న 'రాష్ట్రధర్మ ' ప్రత్యేక ఎడిషన్‌లో రాసిన ఓ ఆర్టికల్‌లో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. ' రామమందిర్ నిర్మాణ్, ఏక్ దివ్య స్వప్న కీ పూర్తి' పేరుతో రాసిన ఆ వ్యాసంలో అద్వానీ 33 ఏళ్ల క్రితం అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం తాను చేపట్టిన రథయాత్రను గుర్తు చేసుకున్నారు. అయోధ్య ఉద్యమం తన రాజకీయ జీవితంలో అత్యంత
నిర్ణయాత్మకమైన, పూర్తిగా మార్చివేసిన సంఘటన అని తాను నమ్ముతానని , అది భారత దేశాన్ని తిరిగి కనుగొనడానికి, ఆ ప్రక్రియలో తనను మళ్లీ అర్థం చేసుకోవడానికి తోడ్పడిందని ఆయన పేర్కొన్నారు.
రామమందిర ఉద్యమంలో అగ్రభాగాన ఉన్న అద్వానీ ఈ సందర్భంగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయిని గుర్తు చేసుకుంటూ, అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ సమయంలో ఆయన లేని లోటు తనను బాధిస్తోందన్నారు.' ఈ రోజు రథయాత్ర 33 ఏళ్లు పూర్తి చేసుకుంది. 1990 సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం మేము ఈ యాత్రను ప్రారంభించినప్పుడు భగవాన్ రాముడిపై నమ్మకంతో తాము ప్రారంభించిన ఈ



యాత్ర ఒక ఉద్యమంగా మారుతుందని మేము ఊహించలేదు' అని అద్వానీ ఆ వ్యాసంలో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ యాత్ర పొడవునా తనతో ఉన్న విషయాన్ని అద్వానీ గుర్తు చేశారు. 'ఆ సమయంలో ఆయన అంత ఫేమస్ కాదు. అయితే ఆ సమయంలో శ్రీరాముడు తన ఆలయాన్ని నిర్మించడానికి ఈ భక్తుడి( మోడీ)ని ఎంచుకున్నారు' అని ఆయన పేర్కొన్నారు. 'అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణం అవుతుందని ఆ సమయంలో నాకు అనిపించింది. అది ఇప్పుడు మరి కొన్ని రోజుల్లోనే నెరవేరబోతోంది' అని అద్వానీ పేర్కొన్నారు.

# బంగ్లా ఖాళీచేసిన టిఎంసి బహిష్కృత ఎంపి

### అధికారులు రాకముందే ఖాళీచేసిన మహువా మొయిత్రా

న్యూఢిల్లీ,జనవరి19వెలుతురు:
లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రా ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయక తప్పలేదు. ఎంపీగా ఉన్నప్పుడు దిల్లీలో ఆమెకు కేటాయించిన ప్రభుత్వ భవనాన్ని ఖాళీ చేయాలంటూ అధికారులు జారీచేసిన నోటీసుపై స్టే ఇచ్చేందుకు దిల్లీ హైకోర్టు గురువారం నిరాకరించింది. ఈ క్రమంలోనే శుక్రవారం డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ విభాగ అధికారులు ఆమె ఇంటికి వెళ్లారు. అయితే అప్పటికే నివాసాన్ని ఖాళీ చేసినట్లు ఆమె న్యాయవాది వెల్లడించారు. డిసెంబరు 8న మొయిత్రా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే.
ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ లోగా ఆమెకు కేటాయించిన అధికార నివాసాన్ని ఖాళీ చేయాలంటూ గతంలో నోటీసులు ఇచ్చారు. దీనిపై ఆమె దిల్లీ హైకోర్టును




ఆశ్రయించారు. కానీ, ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడంతో డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ చర్యలు చేపట్టింది. ఈ ఉదయం అధికారుల బృందం మహువాకు కేటాయించిన టెలిగ్రాఫ్ లేన్‌లోని 9బీ నివాసానికి చేరుకుంది. అయితే, అధికారులు రావడానికి ముందే మహువా మొయిత్రా బంగ్లాను ఖాళీ చేసినట్లు న్యాయవాది షాదాన్ ఫరాసెత్ తెలిపారు. ఎలాంటి బలవంతపు చర్యలు చోటుచేసుకోలేదని, ఇంటి తాళాలను డీవోఈ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరా నందాని నుంచి మొయిత్రా డబ్బులు, ఖరీదైన కానుకలు తీసుకున్నారని, పార్లమెంట్ లాగిన్‌ను దుబాయ్ నుంచి యాక్సెస్ చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎథిక్స్ కమిటీ.. మహువా అనైతిక ప్రవర్తన, సభా ధిక్కరణకు పాల్పడ్డారని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా తన పార్లమెంట్ లాగిన్ వివరాలను బయటి వ్యక్తులకు ఇచ్చినట్లు తేల్చింది. ఈ నివేదికకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. దాంతో ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసి.. సభ నుంచి బహిష్కరించారు.

# నారాయణుడే నరుడిగా నడయాడిన నేల

### అయోధ్య అతిపురాతనమైన నగరంగా పేరు
### తిరుమలలో స్వయంభువుగా శ్రీమన్నారాయణుడు

అయోధ్య,జనవరి19వెలుతురు:
అతిపురాతన హిందూ నగరాలలో అయోధ్య ఒకటి. రామాయణంలో ఈ నగరవైశాల్యం 250 చదరపు కిలోమీటర్లుగా వర్ణించబడింది. కోసలరాజ్యానికి రాజధాని అయోధ్య గంగానదీ తీరంలో సరయూనది కుడివైపున ఉన్నది. అయోధ్యను రాజధానిగా చేసుకుని సూర్యవంశరాజైన ఇక్ష్వాకు కోసలరాజ్యాన్ని పాలించాడు. 63వ సూర్యవంశరాజైన దశరథుడి రాజ్యసభగా అయోధ్య ఉంది. దశరథుడి కుమారుడే శ్రీరాముడు. వాల్మీకి విరచితమైన రామాయణ మహాకావ్యం మొదటి అధ్యాయాలలో అయోధ్యను మహోన్నతంగా వర్ణించాడు. అంతేకాక కోసల సామ్రాజ్యవైభవం, రాజ్యంలోని ప్రజలు అనుసరిస్తున్న ధర్మం, వారి సంపద, ప్రజల విశ్వసనీయత గురించిన గొప్ప వర్ణన ఉంది. తులసీదాసు తిరిగి రచించిన రామచరితమానస్‌లో అయోధ్య వైభవం వర్ణించాడు. కంబరామాయణంలో కూడా అయోధ్య గురించి అత్యున్నతంగా వర్ణించాడు. తమిళ వైష్ణవ భక్తులైన ఆళ్వారులు తమ రచనలలో అయోధ్యను అద్భుతంగా వర్ణించారు. జడభరత, బహుబలి, సుందరి, పాడలిప్తసురీశ్వరి, హరిచంద్ర, అచలభరత మొదలైనవారు అయోధ్యలో జన్మించిన వారే. అయోధ్య, బౌద్ధమత వారసత్వం కలిగిన నగరం. ఇక్కడ మౌర్యాచక్రవర్తుల కాలంలో నిర్మించబడిన పలు బౌద్ధాలయాలు, స్మారకనిహ్నాలు, శిక్షణాకేంద్రాలు ఉన్నాయి. గుప్తులకాలంలో అయోధ్య వాణిజ్యంలో శిఖరాగ్రం చేరుకుంది. చరిత్రకారులు దీనిని సాకేతపురంగా పేర్కొన్నారు. క్రీ.పూ 5వ శతాబ్ద ప్రారంభం నుండి సా.శ. 5వ శతాబ్దాంతం వరకు బౌద్ధమతకేంద్రంగా అయోధ్య విలసిల్లినది. బుద్ధుడు ఈనగరానికి ఒకటి కంటే ఎక్కువసార్లు వచ్చినట్లు భావిస్తున్నారు. స్వామినారాయణ మార్గ స్థాపకుడైన స్వామినారాయణుడు ఇక్కడ జన్మించాడని, ఏడు సంవత్సరాల అనంతరం నీల్కాంత్‌గా భారతదేశ సంచారానికి వెళ్లాడని విశ్వసిస్తారు. పురాణాలలో మహారాజైన ఆయుధ్‌ను శ్రీరాముని పూర్వీకునిగా పేర్కొన్నారు. అతడి పేరు సంస్కృత పదమైన యుద్ధ్ నుండి వచ్చింది. ఆయుధ్ అపరాజితుడు కనుక ఈ నగరానికి అయోధ్య అన్న పేరు వచ్చింది. అయోధ్య అంటే జయించ శక్యం కానిది అని అర్థం. గౌతమబుద్ధుని కాలంలో ఈ నగరం పాళీ భాషలో అయోజిహాగా పేర్కొన్నారు. అది కూడా సంస్కృతంలో అయోధ్య అనే అర్థాన్ని ఇస్తుంది. పురాణాలలో గంగానది గురించి వివరించినప్పుడు అయోధ్య ప్రస్తావన ఉంది. సామాన్య శకం మొదటి శతాబ్దాలలో ఈ నగరాన్ని సాంకేతపురంగా పేర్కొన్నారు. సా.శ.127 సాంకేతపురాన్ని కుషన్ చక్రవర్తి చేత జయించబడింది. కుషన్ చక్రవర్తి



తూర్పుప్రాంతంనికి అయోధ్యను కేంద్రంగా చేసి పాలించాడు. 5వ శతాబ్దంలో ఈ నగరం ఫాక్సియన్ అన్న పేరుతో పిలువబడింది. చైనా సన్యాసి యువాన్ త్స్యాంగ్ సా.శ.636 లో తన భారతదేశ యాత్రలో ఈనగరాన్ని అయోధ్యగా పేర్కొన్నాడు. మొఘల్ పాలనా కాలంలో ఇది గవర్నర్ ఆయుధ్ స్థానంగా ఉండేది. బ్రిటిష్ పాలనా సమయంలో ఈనగరాన్ని అయోధ్య, అజోధియగా పేర్కొన్నారు . అలాగే అయోధ్య, బ్రిటిష్ వారి కేంద్రపాలిత ప్రాంతాలైన ఆగ్రా-అయుధ్ ప్రాంతాలలో ఒక భాగంగా ఉండేది. నారాయణుడే స్వయంగా మానవావతారంలో వచ్చి..ఇక్కడ పాలన చేశాడు కనక అయోధ్యకు అంతగా ప్రాధాన్యం ఉంది. తిరుమలలో మాత్రం దేవదేవుడు స్వయంభువు అని అంటారు. ప్రపంచ వ్యాప్తంగా తిరుమల ఎంతో గొప్ప పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. తిరుమలకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. తిరుమల కొండలకు .. ఆ స్థలానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని పురాణాలు చెబుతున్నాయి. అలానే ఇప్పుడు అయోధ్య కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా సంతరించుకుంది. రామ జన్మభూమి అయోధ్య చరిత్ర ఏంటి.. దానికి ఆపేరు ఎలా వచ్చింది.. తిరుమలకు... అయోధ్యకు ఉన్న విశిష్టతలు ఏంటి.. ఆ రెండు ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య తేడాపై ఇప్పుడు చర్చ సాగుతోంది. తిరుమల తిరుపతి పట్టణానికి ఆనుకొని ఉన్న కొండలపై గల హిందూ పుణ్యక్షేత్రం. ఇక్కడ గల వెంకటేశ్వర ఆలయం ఒక హిందూ ఆలయం. ఈ ఆలయం విష్ణువు రూపమైన వెంకటేశ్వరుడికి అంకితం చేయబడింది. కలియుగ కాలంలో పరీక్షలు, కష్టాల నుండి మానవాళిని రక్షించడానికి భగవంతుడు ఇక్కడ స్వయంగా వెలిసాడని నమ్ముతారు. ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నిర్వహిస్తుంది. తిరుమల కొండలు శేషాచలం కొండలు పరిధిలో భాగం. కొండలు సముద్ర మట్టా నికి పైన 853 అడుగులఎత్తులో ఉన్నాయి. కొండలశ్రేణిలోగల ఏడు శిఖరాలు, ఆదిశేషుని ఏడు తలలను సూచిస్తాయి. ఈ ఆలయం పవిత్ర జలాశయమైన శ్రీ స్వామి పుష్కరిణి దక్షిణ ఒడ్డున ఏడవ శిఖరం వెంకటాద్రిపై ఉంది. అందువల్ల ఈ ఆలయాన్ని 'ఏడు కొండల ఆలయం' అని కూడా పిలుస్తారు.
తిరుమల తిరుపతిలో మొదటి ఆలయాన్ని పురాతన తోండైమండలం తమిళ పాలకుడు తొండమాన్ సా.శ. 8 వ శతాబ్దంలో గాలిగోపురం, ప్రాకారాన్ని నిర్మించాడని చెబుతారు. ఈ ఆలయం వైఖానస ఆగమ ఆరాధన సంప్రదాయాన్ని అనుసరిస్తుంది. ఇది ఎనిమిది విష్ణు స్వయంభు క్షేత్రాలలో ఒకటి. ఇది 108 దివ్యదేశాలలో చివరి భూసంబంధమైన దివ్యదేశంగా 106 స్థానంలో ఉంది. ఆలయ ప్రాంగణంలో యాత్రికుల రద్దీని నిర్వహించడానికి రెండు ఆధునిక వేచివుండే భవనాలు ఉన్నాయి. ఇక్కడ యాత్రికులకు ఉచిత భోజనం కోసం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం, తల నీలాలు సమర్పించు భవనాలు, అనేక యాత్రికుల బస స్థలాలు ఉన్నాయి.

# రామపేరుతో ఉన్న రైల్వేస్టేషన్లకు మహర్దశ

## దేశవ్యాప్తంగా 343 స్టేషన్ల గుర్తింపు

## దీపాలతో అలంకరించనున్న రైల్వేశాఖ

**న్యూఢిల్లీ,జనవరి19వెలుతురు:** దేశంలో మరో మూడు రోజుల్లో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానున్నది. కోట్లాది మంది భారతీయులు ఎన్నో ఏండులగా ఎదురుస్తున్న అయోధ్య రామ మందిరం ఈనెల 22న ప్రారంభం కానున్నది. రాముల వారికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. ఈ చారిత్రక సన్నివేశంలో రైల్వే శాఖ కూడా భాగం పంచుకోనున్నది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రామయ్య పేరుతో ఉన్న 343 రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో రాముని పేరుతో ఉన్న ఈ రైల్వే స్టేషన్లను విద్యుత్ దీపాలతో అలంకరించనున్నది. ఈ 343 స్టేషన్లలో ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో ఉన్నాయి. ఆంధ్రాలో 55 రైల్వేస్టేషన్లు ఉండగా, తమిళనాడులో 54 ఉన్నాయి. తర్వాతి స్థానంలో బీహార్ ఉన్నది. తెలంగాణలో రామగుండం, రామకృష్ణాపురం, రామన్నపేట, ఆంధ్రప్రదేశ్‌లో రామచంద్రాపురం, రామాపురం, కర్ణాటకలో రామగిరి, రామనగరం, ఉత్తరప్రదేశ్‌లో రామచంద్రాపూర్, రామ్‌గంజ్, రామ్‌చౌరా రోడ్ ఇలా.. ఊరు పేరు చివర, ముందు రామ నామంతో ఉన్న రైల్వే స్టేషన్లను రైల్వేశాఖ సుందరీకరించనున్నది. ఈ నెల 22 రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా.. ఆస్తా స్పెషల్ పేరుతో దేశ నలు మూలల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపనున్నది. ఆ తర్వాత వంద రోజులపాటు అయోధ్యకు వెళ్లాలనుకునే భక్తు కోసం వెయ్యి రైళ్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కాగా, ప్రత్యేక రైళ్లలో రానుపోను టికెట్లను ఒకేసారి బుక్‌చేసుకోవాల్సి ఉంటుంది. ఈ రైళ్లు గమ్య స్థానం చేరేవరకు మధ్యలో ఎక్కడా ఆగకుండా వెళ్లనున్నాయి.

# కేస్లాపూర్‌లో సందడే సందడి

## నాగోబా జాతరకు సర్వం సిద్ధం

**ఆదిలాబాద్,జనవరి19వెలుతురు:** నాగోబా జాతర ప్రాంతంలో సందడి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, పనులతో ఇక్కడంతా పండగ వాతావరణం నెలకొంది. కేస్లాపూర్‌లో ఈ నెల మెస్రం వంశీయులు నిర్వహించే మహాపూజలతో ప్రారంభం అయ్యాయి. నాగోబా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతున్నారు. ప్రధానంగా గోండులు అత్యంత పవిత్రంగా భవించే జాతర కావడంతో ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తోంది. నాగోబా దర్శనం కోసం వచ్చే ప్రముఖులకు భక్తుల నుంచి ఇబ్బందులు ఎదురు కాకుండా చూస్తున్నారు. గిరిజనుల సంప్రదాయ సంస్కృతికి సంబంధించిన ఆటలపోటీల నిర్వహణపై శ్రద్ధ తీసుకున్నారు.నాగోబా ఆలయంతోపాటు అవసరం ఉన్న చోట్లల్లో ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు. ముఖ్యంగా వచ్చే భక్తులకు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతొ జాతర సందడిగా మారింది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని స్థానిక నేతలు అన్నారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. నాగోబా జాతర ఉత్సవాలు నిర్వహణతోపాటు చేపట్టే అభివృద్ధికి నిధులు మంజురు చేసిందన్నారు. సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా పండుగలను జరుపుకో వాలన్నారు. మెస్రం వంశీయులు నిర్వహించే ప్రత్యేక పూజలతోపాటు వారి సంప్రదాయాలు చాలా బాగున్నాయన్నారు. ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతిని ఇలాగే ముందుకు తీసుకుపోవాలన్నారు. నాగోబా జాతరలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# ఓల్వో బస్సు టైరు ఊడి మంటలు

## డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ముప్పు

**మహబూబ్‌నగర్,జనవరి19వెలుతురు :** జిల్లాలోని అడ్డాకుల 44వ జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. అడ్డాకుల సబ్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి 44 పై కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వోల్వో బస్సువేగంగా వెళ్తున్న క్రమంలో టైరు ఊడిపోయి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ అప్రమత్తతో బస్సును రోడ్డు పక్కన ఆపి మంటలార్పడంతో ప్రమాదం తప్పింది. బస్సులో 30 మంది ప్రయాణికులున్నారు. తృటిలో భారీ ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# బిల్కిస్ బానో కేసు దోషాలకు షాక్

## ఆదివారంలోగా లొంగిపోవాలని సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జనవరి19వెలుతురు:** తమకు లొంగిపోవడానికి మరింత సమయం కావాలంటూ పిటిషన్లు వేసిన బిల్కిస్ బానో కేసు దోషులకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. వారి పిటిషన్లను తిరస్కరిస్తూ.. ఆదివారం నాటికి వాళ్లంతా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని బెంచ్ ఈ మేరకు శుక్రవారం తీర్పునిచ్చింది. ఫ్యామిలీ వెడ్డింగ్స్‌కు హాజరు కావడం దగ్గర నుంచి పంట కాలం వరకు.. తమకు కొన్ని కుటుంబ బాధ్యతలున్నాయని, కాబట్టి లొంగపోయేందుకు సమయం ఇవ్వాలని కోరుతూ దోషులు వేసిన పిటిషన్లు విచారణకు అర్హత లేనివని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.ఆదివారంలోపు లొంగిపోవాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. ఒూగా.. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురిని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఆ ఏడుగురిలో ఆమె మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. అలాగే.. ఆ సమయంలో ఐదు నెలల గర్భిణిగా ఉన్న బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో మొత్తం 11 మంది దుండుగులు దోషులుగా తేలారు. వాళ్లు 15 ఏళ్లపాటు జైలుజీవితం గడిపారు. అయితే.. 2022లో ఈ దోషులకు గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేసింది. దీంతో.. అదే ఏడాదిలో ఆగస్టు 15వ తేదీన వాళ్లు జైలు నుంచి విడుదల అయ్యారు. వీరి విడుదలని సవాల్ చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. జనవరి 8వ తేదీన వారి విడుదల చెల్లదని, రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తాజాగా గడువు కావాలంటూ దోషులు వేసిన పిటిషన్‌ని తిరస్కరిస్తూ.. పైవిధంగా తీర్పునిచ్చింది. ఇదిలావుండగా.. 2022 ఆగస్టు 15వ తేదీన దోషులు జైలు నుంచి విడుదల అయ్యారు.

# కోనసీమ జిల్లాలో వైకాపాకు గట్టి షాక్

## టిడిపిలో చేరనున్న వాసంశెట్టి సుభాష్

**అమరావతి,జనవరి19వెలుతురు:** కోనసీమ జిల్లాలో వైకాపాకు గట్టి షాక్ తగిలింది. అమలాపురానికి చెందిన వైకాపా యువజన నాయుడు, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు వాసంశెట్టి సుభాష్ తెదేపాలో చేరనున్నారు. చంద్రబాబు సమక్షంలో శనివారం 5వేల మందితో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. వైకాపాకు రాజీనామా చేసినట్టు ఇప్పటికే సుభాష్ ప్రకటించారు. మంత్రి విశ్వరూప్, మరికొంత మంది సొంత పార్టీ నేతలే ఇబ్బంది పెట్టారని.. అలాంటి వారికి టికెట్ ఇవ్వొద్దని అగ్రనాయకత్వానికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. జిల్లా పేరు మార్పు విషయంలో జరిగిన అల్లర్ల కేసులో తమ సామాజిక వర్గాన్ని ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అమాయకులపై కేసులు ఎత్తివేయాలని కోరగా వైకాపా జిల్లా అధ్యక్షుడు, స్థానిక నేతలు అడ్డుపడ్డారని ఆరోపించారు.

# మదర్సాలో ఘర్షణ..ఓ బాలుడు మృతి

**రంగారెడ్డి,జనవరి19వెలుతురు:** రంగారెడ్డి జిల్లా నార్సింగిలో విషాదం చోటుచేసుకున్నది. నార్సింగి అల్కాపురి కాలనీలో ఉన్న మదర్సాలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. దీంతో బాలుడు మృతిచెందాడు. బీహార్‌కు చెందిన 12 మంది విద్యార్థులు మదర్సాలో ఉంటున్నారు. గురువారం రాత్రి చిన్న వివాదంలో పన్నేండ్ల మహ్మద్ రకీమ్‌పై తోటి విద్యార్థులు దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో మదర్సా సిబ్బంది రకీమ్‌ను హుటాహుటిన గోల్కొండలోని దవాఖానకు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





# అసోంలో రాహుల్ న్యాయయాత్ర

## యాత్ర మార్గాలను మళ్లించారని కేసు

**గౌహతి,జనవరి19వెలుతురు :** కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై అస్సాంలో కేసు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గ దర్శకాలను ఉల్లంఘించి యాత్ర రూట్స్‌లో మార్పులు చేయడంతో పోలీసులు.. యాత్ర నిర్వాహకుడు కేబీ బైజుపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం రాహుల్ యాత్ర అస్సాంలోని జోర్హాట్ పట్టణంలో కొనసాగుతోంది. అయితే తాము ముందుగా నిర్దేశిరచిన మార్గంలో కాకుండా వేరే మార్గంలోకి యాత్రను మళ్లించినట్లు అస్సాం పోలీసులు తెలిపారు. చార్ట్‌లో చూపించని మార్గాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. రూట్‌ను అకస్మాత్తుగా మార్చడం అంతరాయాలకు దారితీసినట్లు తెలిపారు. యాత్ర నిర్వాహకులు, సహ నిర్వాహకులు ట్రాఫిక్ బారికేడ్‌లను బద్దలు కొట్టేలా అక్కడి సమూహాన్ని ప్రేరేపించారని ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసు అధికారిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. కాగా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై కేసు నమోదు చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. యాత్రకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కాంగ్రెస్‌కు చెందిన అస్సాం ప్రతిపక్ష నేత దేబబ్రత సైకియా మండిపడ్డారు. ట్రాఫిక్ మళ్లింపు దగ్గర పోలీసులెవరూ లేరని చెప్పారు. యాత్ర కోసం తమకు కేటాయించిన మార్గం చాలా ఇరుకుగా ఉందని, జనాలు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో కొన్ని మీటర్ల పాటు పక్కనున్న దారి గుండా ప్రయాణించాల్సి వచ్చిందని వివరించారు. రాహుల్ న్యాయ్ యాత్ర విజయవంతం అమవుతోందన్న భయంతోనే.. సీఎం హిమంత శర్మ తమ యాత్రకు ఆటంకం కలిగించాలనుకుంటున్నారని ఆరోపించారు.

# పారిశ్రామిక ప్రగతి కోసమే ఆదానీతో ఒప్పందం

**అభివృద్ధిపైనా బిఆర్ఎస్ నేతల వక్రభాష్యాలు**

**బిజెపితో అంటకాగిన పార్టీ బిఆర్ఎస్ మాత్రమే**

**కెటిఆర్,హరీష్ రావులకు నిద్ర పట్టడం లేదు**

**ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం**

**మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి స్పష్టీకరణ**

**హైదరాబాద్,జనవరి19వెలుతురు:** తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగానే పారిశ్రామికవేత్త అదానీని సీఎం రేవంత్ రెడ్డి కలిశారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పెట్టుబడులు పెట్టేవారు వస్తానంటే వద్దని అంటామా అని ప్రశ్నించారు. దీనికి బిఆర్ఎస్ నేతలు వక్రభాష్యాలు పలుకరుతున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..భారాస ప్రభుత్వం ఎన్నో చీకటి జీవోలు ఇచ్చింది. రాష్ట్రం బంగారుప్లళెం కాదు.. అప్పుల కుప్పగా మార్చారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారు. రూ.40 వేల కోట్లు వడ్డీలకే పోతోంది. భాజపా తెచ్చిన ప్రతి బిల్లుకు పార్లమెంటులో భారాస మద్దతు ఇచ్చింది. వారి బంధం ఎలాంటిదో మొన్నటి ఎన్నికల్లో కూడా బయటపడిందన్నారు. బిజెపితో బిఆర్ఎస్ అంటకాగిందే తప్ప కాంగ్రెస్ ఎప్పుడూ బిజెపిని దగ్గరకు రానీయలేదన్నారు. ఇరుపార్టీల స్నేహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు. అందువల్లే రూ.వేల కోట్లు కుమ్మరించినా.. శాసనసభ ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలవలేదన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం అదానిని కలిస్తే తప్పేంటని జూపల్లి న్నారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్యున్న మైత్రి ప్రజలందరికీ తెలుసునన్నారు. 2018 ఎన్నికలప్పుడు భారాస చాలా హామీలు ఇచ్చి అమలు చేయలేదు. గతంలో విపక్షాలు తెరాసను రెండేళ్ల తర్వాత విమర్శిస్తే.. పసికందును విమర్శిస్తున్నారా అని వాపోయారు. మరి భారాస నేతలు 2




నెలలు కూడా ఎందుకు ఆగలేకపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. అప్పుడే విమర్శలు చేస్తూ..ప్రభుత్వం కూలిపోతుందని శాపనార్థాలు పెడుతున్నది ఎవరని మంత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేసింది. మిగతా గ్యారంటీల అమలు కోసమే 'ప్రజాపాలన' నిర్వహించాం. దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగానే మిగతావి అమలు చేస్తాం. లోక్‌సభ ఎన్నికల్లో భారాస తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు భయపడుతున్నారు. భారాసను వీడటానికి ఇప్పటికే చాలా మంది సిద్ధంగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీ ప్రతినిధులే అవిశ్వాసాలు పెడుతున్నారు. గత రెండేళ్లలో కృష్ణా బేసిన్‌లో నిండుగా నీరు ఉన్నప్పటికీ సాగుకు నీళ్లివ్వలేదు. ఈ ఏడాది వర్షాలు లేక నాగార్జునసాగర్‌లో జలాలు అడుగంటిపోయాయి. కృష్ణా బేసిన్‌లో నీరు లేనప్పుడు రెండో పంటకు ఇవ్వడం ఎలా సాధ్యం?' అని జూపల్లి అన్నారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని చెప్పారు. తమ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చిందని అంటున్నారని బీఆర్ఎస్ తమతో పోటీపడి మరి హామీలు ఇచ్చిందని మరి వాటిని ఎలా అమలు చేసేవారిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కు ప్రజలు బుద్ధి చెప్పి 2 నెలలు కూడా కాలేదు.. అప్పుడే కేటీఆర్, హరీష్ రావు లు పోటీపడి సమావేశాలు పెడుతున్నారని మంత్రి జూపల్లి విమర్శించారు. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీ లోకి రావడానికి సిద్ధంగా ఉన్నా.. తాము వద్దనుకుంటున్నామని అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. ప్రజా పాలన నిర్వహణ ప్రణాళిక రూపొందించాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. దశాబ్దాల పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది సమస్యలు, కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్నారన్నారు. ప్రజల సమస్యలను తీర్చి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశ్యంతో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందని అన్నారు. అధికారులు ఏదో మొక్కుబడిగా కాకుండా నిర్లక్ష్యాన్ని వీడి, జవాబుదారీ తనంతో అత్యంత పారదర్శంకంగా పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి ఆ డాటాను డిజిటలైజ్ చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# మూడు దశబ్దాల ఎమ్మార్పీఎస్ పోరాటం

**ఎస్సీ వర్గకరణకు మందకృష్ణ అలుపెరగని పోరు**

**కమిటీ ఏర్పాటుతో సమస్యకు దక్కనున్న పరిష్కారం**

**హైదరాబాద్,జనవరి19వెలుతురు:** ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలో కదలిక వచ్చింది. దీనిపై అధ్యయనంతో పాటు వివిధ వర్గాల అభిప్రాయాలు తీసుకునేందుకు కేంద్రం ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఇందులో ఐదుగురు సభ్యులు ఉంటారు. దీనికి కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ నాయకత్వంలో కమిటీ పనిచేయ నుంది. దీంతో దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని మందకృష్ణ మాదిగా అన్నారు. ఈ మేరకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ దీనిపై హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన చేసిన కొద్ది రోజులకే షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం కమిటీ నియమిస్తున్నట్లుగా ప్రధాని మోదీ అదేశాలు ఇచ్చారు. ఇన్నాళ్లకు ఇప్పుడు కమిటీ ఏర్పాటు అయింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గత 30 ఏళ్లుగా ఈ వర్గీకరణ కోసం పోరాడుతోంది. దీన్ని మందక్రిష్ణ మాదిగ ప్రారంభించారు. గత మూడు దశాబ్దాలుగా జరిగిన ప్రతి పోరాటంలో బీజేపీ వారికి అండగా నిలుస్తోందని హైదరాబాద్ సభలో మోదీ హామీ ఇచ్చారు. ఈ పక్రియను వీలైనంత త్వరగా పరిష్కరించ డానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. మాదిగలకు సాధికారత కల్పించడానికి ఓ కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని అప్పుడు హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ పోరాటం న్యాయమైనదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. మాదిగలు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని షెడ్యూల్డ్ కులాలలో (ఎస్సీ) ఎక్కువ భాగం ఉన్నారు. దీనివల్ల ఉద్యోగాలు సహా ఇతర విషయాల్లో రిజర్వేషన్లు, ఇతర బెనిఫిట్స్ తమకు అందడం లేదని వాదన వారిలో ఉంది. అందుకే ఎమ్మార్పీఎస్ గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతోంది.రాజీవ్ గౌబా నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం అందులో పలు కీలకమైన శాఖలకు స్థానం కల్పించింది. ఈ కమిటీలో కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, గిరిజిన శాఖ కార్యదర్శులను భాగం చేసింది. వీలైనంత త్వరగా కమిటీ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది. కేంద్ర ఆదేశాల మేరకు త్వరగా రిపోర్టు ఇవ్వడానికి సమాయత్తమైన కమిటీ.. ఈ నెల 22న తొలిసారిగా సమావేశం కానుంది. ప్రభుత్వానికి త్వరగా రిపోర్ట్ ఇవ్వడానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో సబ్-కేటగిరైజేషన్ పక్రియలో భాగంగా ఒక కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని నవంబరు 24నే కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా, ఇతర సీనియర్ అధికారులను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు.

## ఎస్సీ వర్గీకరణపై కమిటీ

### కేంద్రప్రభుత్వం నిర్ణయం

**న్యూఢిల్లీ,జనవరి19వెలుతురు:** ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. కమిటీకి కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వం వహిస్తారు. కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. హోం, న్యాయ, గిరిజ, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వర్గీకరణపై ఏడుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకు గతంలోనే సుప్రీంకోర్టు అంగీకరించిన సంగతి తెలిసిందే. కమిటీ ఈ నెల 22న తొలిసారిగా భేటీ కానుంది. ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ తెలంగాణ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ మేరకు అడుగులు పడ్డాయి. కమిటీ వర్గీకరణపై సమగ్ర పరిశీలన జరుపనుంది.

# 21న బాధ్యతలు స్వీకరించనున్న షర్మిల

**రెండోరోజులపాటు ఎపిలో పర్యటించేలా షెడ్యూల్**

**నేడు ఇడుపులపాయకు..రేపు విజయవాడకు రాక**

**అమరావతి,జనవరి19వెలుతురు:** ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ మేరకు ఆమె పర్యటన షెడ్యూల్ ఖరారైంది. పిసిసి చీఫ్‌గా నియమితులు అయ్యాక ఆమె ఆంధ్రాకు రావడం ఇదే తొలిసారు. శనివారం ఆమె ఇడుపులపాయకు వస్తారు. ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది. ఈ మేరకు 20, 21వ తేదీలలో షర్మిల ఏపీలో పర్యటించనున్నారు. ఈ నెల 20న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2 గంటలకు షర్మిల ఇడుపులపాయకు బయలు దేరుతారు. సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించనున్నారు. రాత్రి అక్కడే బస చేయనున్న షర్మిల.. 21న కడప నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. విజయవాడలో ఉదయం 11 గంటలకు పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వైఎస్సార్టీపీని షర్మిల కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన షర్మిలకు పార్టీ అధిష్ఠానం పెద్ద బాధ్యతలే అప్పగించింది. షర్మిలను ఏపీపీసీసీ చీఫ్‌గా కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను షర్మిలకు కాంగ్రెస్ హైకమాండ్ అప్పగించింది. అంతకుముందు ఏపీసీసీ చీఫ్‌గా ఉన్న గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా అధిష్టానం నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వేళ...రాజకీయాల్లో అనూహ్య మలుపులు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణలో మొన్నటి వరకు సొంత పార్టీ నడిపిన షర్మిల వైఎస్సాఆర్ టీపీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. షర్మిల నియామకంతో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రిగా, వైసీపీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉంటే...ఇటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా 21న షర్మిల బాధ్యతలు స్వీకరించబోతున్నారు. రెండు వేర్వేరు పార్టీలకు అన్నాచెల్లెళ్లు అధ్యక్షులుగా ఉండటంతో రాజకీయాలు రక్తి కట్టిస్తున్నాయి. 2019లో జగన్ అధికారాన్ని చేపట్టే వరకు....రాజకీయంగా షర్మిల అండగా నిలిచారు. మరికొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలతోపాటు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడుతున్న షర్మిల ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్న దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం, పార్టీకి దూరమైన నేతలను తిరిగి ఆహ్వానించడం,అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయడం, కేడర్‌కు తానున్నా అంటూ భరోసా కల్పించడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు రాష్ట్రానికి చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమైనవిగా చెప్పుకుంటున్నారు. అలాగే విభజన హామీల అమలుకు ప్రజల్లో భరోసా కూడా కల్పించాల్సి ఉంటుంది. నిత్యం కాంగ్రెస్ పార్టీ చేసిన పనులను పదే పదే చెప్పడం ద్వారా...ప్రజలలో ఆలోచన రెకేత్తించాలి. ఇలా చేయడం ద్వారా జవసత్వాలు కోల్పోయిన కాంగ్రెస్ కు పునర్ వైభవం వస్తుంది.



ఆరోగ్యం పట్ల అప్రమత్తత పెరగడంతో అందరూ వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో చాలామంది బయటకు వెళ్లాల్సిన అవసరం లేని యోగా, ధ్యానం (మెడిటేషన్) వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కొంత కాలంగా బాక్స్ బ్రీతింగ్ ట్రెండ్‌గా మారింది. బాక్స్ బ్రీతింగ్ అంటే శ్వాసను నియంత్రించి క్రమబద్ధీకరించడం. పని ఒత్తిడి నుంచి సాంత్వన పొందడానికి ఈ టెక్నిక్‌ను వినియోగిస్తున్నారు. ఈ బాక్స్ బ్రీతింగ్ విశేషాలేంటో తెలుసుకుందాం.

# పని ఒత్తిడి నుంచి సాంత్వన పొందాలంటే..

బాక్స్ బ్రీతింగ్ అంటే చతురస్రాకార క్రమంలో శ్వాస పీల్చి, వదిలే ప్రక్రియ. పని ప్రదేశంలో ఒత్తిడికి గురైనట్లు అనిపించినప్పుడు ఈ బాక్స్ బ్రీతింగ్‌ను అభ్యాసం చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది. వాస్తవానికి ఈ టెక్నిక్‌ను అమెరికా రక్షణ దళాలకు చెందిన సైనికులు అమలు చేసేవారు. దీని గురించి తెలుసుకున్న తర్వాత క్రమంగా కంపెనీ సీఈవోలు, క్రీడాకారులు, ఇతర ప్రముఖులు ఆచరించడం ప్రారంభించారు.
ట్రాఫిక్‌లో చిక్కుకున్నప్పుడు, ఊహించని ఈ%--%మెయిల్ వచ్చినప్పుడు, పని సందర్భంగా డెడ్ లైన్లు (గడువు సమయం) దగ్గరపడుతున్నప్పుడు, వాహనంపై వెళ్ళేటప్పుడు మరొకరు ఢీకొన్న సందర్భంలో, ఇష్టంలేని వ్యక్తితో వాదనకు దిగినప్పుడు కూడా తీవ్ర ఒత్తిడికి లోనుకావడం సర్వసాధారణం. ఆ ఒత్తిడిని అధిగమించడం కోసం ఈ టెక్నిక్‌ను ఉపయోగించేవారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది.

### సాంత్వన కోసమే

బాక్స్ బ్రీతింగ్ అంటే ప్రాథమికంగా శ్వాసకు సంబంధించిన ఎక్సర్‌సైజు (వ్యాయామం). ఇది చేస్తే నరాల వ్యవస్థ మెరుగుపడుతుంది. తద్వారా మానసికంగా సాంత్వన చేకూరుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది సాంత్వన కోసం చేసే టెక్నిక్ అయినా శ్వాస ప్రక్రియను గాడిలో పెట్టడమే దీని లక్ష్యం. ఒత్తిడికి గురైన సమయంలో ఉచ్ఛ్వాసనిశ్వాసములను లయబద్ధంగా జరిగేలా చేయడం ద్వారా గుండెపోటు వంటి ముప్పు రాకుండా చేస్తుంది. అలాగే విద్యార్థులకు చదువుపై దృష్టిని కేంద్రీకరించడానికి కూడా తోడ్పడుతుంది. ఈ ఎక్సర్‌సైజు చేయడం చాలా సులభం. ఎటువంటి పరికరాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ఖర్చు ఉండదు. పని చేసే ప్రదేశంలో, ఆఫీసులో, హోటల్‌లో కూడా ఈ ఎక్సర్‌సైజును చేయొచ్చు. వెన్నుకు సపోర్టు ఉండేలా కుర్చీలో కూర్చుని కాళ్ళు నేలపై ఉంచి బాక్స్ బ్రీతింగ్ చేయాలి.

### ఎంతసేపు?

కళ్ళు మూసుకోవాలి. ముక్కు ద్వారా మాత్రమే శ్వాస తీసుకోవాలి. ఊపిరి తిత్తులలోకి గాలి ప్రవేశిస్తోందన్న భావనతో ఉండాలి. గుండెల నిండా గాలి పీల్చుకుంటూ.. మనసులోనే ఒకటి నుంచి నాలుగు వరకూ అంకెలను నెమ్మదిగా లెక్కించాలి. గాలి పీల్చుకున్న తర్వాత శ్వాసను స్తంభింపజేసి మరోసారి ఒకటి నుంచి నాలుగు వరకూ అంకెలను నెమ్మదిగా లెక్కించాలి. ఆ సమయంలో నోటిని తెరవకూడదు. కనీసం నాలుగు సెకన్లపాటు అలా స్తంభింపజేయాలి. ఆ తర్వాత నెమ్మదిగా గాలిని నాలుగు అంకెలు లెక్కబెడుతూ నాలుగు సెకన్లపాటు వదలాలి. ఇలా నాలుగుసార్లు వంతున రోజుకు రెండుసార్లు చేయాలని నిపుణులు చెబుతున్నారు. అంటే నాలుగుసార్లు శ్వాసను పీల్చడం, నాలుగుసార్లు దానిని ఆపి ఉంచడం (స్తంభింపజేయడం), నాలుగుసార్లు గాలి వదలడం (నిశ్వాసం), నాలుగుసార్లు అలాగే (శ్వాస పీల్చకుండా) ఉండటం. ఒక రకంగా ఇది మెడిటేషన్ (ధ్యానం) వంటిదే. నిశ్శబ్దంగా, ప్రశాంత వాతావరణంలో రెండు నిమిషాల పాటు దీనిని చేస్తే ఆశించిన ఫలితం త్వరగా వస్తుంది.
వాతావరణం ఎలా ఉన్నప్పటికీ పని చేసే ప్రదేశంలోనే కళ్ళు మూసుకుని ఈ ఎక్సర్‌సైజును చేయొచ్చు. ఇంటి దగ్గర స్టౌ మీద వంట చేసేటప్పుడు నిలబడి చేయొచ్చు. రైలులో ప్రయాణం చేసేటప్పుడు, ఏదైనా సమావేశానికి వెళ్ళే ముందు కూడా ఈ బాక్స్ బ్రీతింగ్ చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆఫీసులోకి అడుగు పెట్టేముందు, వాహనాన్ని పార్కు చేసిన తర్వాత కూడా కేవలం రెండు నిమిషాల్లో పూర్తయ్యే ఈ ఎక్సర్‌సైజును చేయొచ్చు. ఆ సమయంలో మిమ్మల్ని ఎవరైనా గమనించినా ఒత్తిడి నుంచి బయటపడేందుకు చేస్తున్న ఎక్సర్‌సైజు అని తెలుసుకోలేరు.

### కలిగే ప్రయోజనాలు

నెమ్మదిగా ఈ ఎక్సర్‌సైజును క్రమం తప్పకుండా చేయడంవల్ల ఉచ్ఛ్వాసనిశ్వాసాలు తిరిగి గాడిలో పెట్టడం (క్రమబద్ధీకరించడం) జరుగుతుంది. తద్వారా మెదడుకు, దేహానికి ఆక్సిజన్ సరఫరా సక్రమంగా జరుగుతుంది. ప్రతిగా గుండె చప్పుడు, కడుపులో జీర్ణప్రక్రియను పర్యవేక్షించే నరాల వ్యవస్థ పునరుత్పాదకత పొందేలా చేస్తుంది. మానసికంగా స్పష్టత పెంపొందుతుంది. చేసే పనిపై శక్తిని కేంద్రీకరించడం అలవడుతుంది. భౌతికంగా కూడా భుజాలు, వీపుపై ఒత్తిడి తగ్గుతుంది. భవిష్యత్తులో ఒత్తిడికి లోను కాకుండా ఉండేలా చేస్తుంది. ప్రతి పనిపై మరింతగా దృష్టిని కేంద్రీకరించడానికి జీవిత కాలం ఇది తోడ్పడుతుంది. నరాల వ్యవస్థ సక్రమంగా ఉండటంతో దేహంలో ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు కూడా అదుపులోకి రావడంతో మానసికంగా ప్రశాంత ఏర్పడుతుంది. ఏదైనా భయంకర ఘటన జరిగినప్పుడు కలిగే ఆందోళన, కుంగుబాటును దూరం చేయడంలో బాక్స్ బ్రీతింగ్ ఎంతో మేలు చేస్తుందని అమెరికా రక్షణ శాఖ జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది.

### ఇలా ప్రారంభమైంది

అమెరికాలోనే కాదు వివిధ దేశాల్లో సహాయక, రక్షణ విధుల్లో పాల్గొనే ఆ దేశ సైనికులు ఓవర్-షెడ్యూల్ కారణంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఒక్కోసారి నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల ఒంటరితనం కూడా వారిని మరింత ఆందోళనకు గురిచేస్తుంది. నిరంతర అప్రమత్తత కారణంగా కూడా ఒత్తిడితో అనారోగ్యాలకు లోనయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అమెరికా మిలటరీ అధికారులు బాక్స్ బ్రీతింగ్ ఎక్సర్‌సైజును ప్రవేశపెట్టినట్లు అమెరికాకు చెందిన ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది.
బాక్స్ బ్రీతింగ్ వల్ల సైనికుల్లో ఒత్తిడి తగ్గిపోవడమే కాక సామూహికంగా, వ్యక్తిగతంగా కూడా ఒకరినొకరు ప్రోత్సహించుకునేందుకు తోడ్పడింది. నిరంతరం బిజీగా కాలం గడుపుతూ తమ ఆరోగ్యం గురించి కూడా ఆలోచించడానికి వీలులేనటువంటి పరిస్థితులు ఉంటున్నాయి. అందువల్ల దిగజారుతున్న ఆరోగ్యం కాపాడుకునేందుకు రోజులో కనీసం రెండు నిమిషాలు కేటాయించేందుకు ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు. తద్వారా ఒత్తిడి నుంచి స్వాంతన చేకూరి ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని మిలటరీ అధికారులు భావించారు. ఈ టెక్నిక్‌ను అమెరికన్ నేవీ సీల్స్ కూడా ఉపయోగించేవారు.

### ఆలోచనలను దూరంపెట్టి

బాక్స్ బ్రీతింగ్ అనే ఈ ప్రక్రియలో ఉచ్ఛ్వాసనిశ్వాసములను నియంత్రించడం ప్రధానం. ఈ ఎక్సర్‌సైజులో కొద్ది నిమిషాల సేపు ఆలోచనలకు విరామం ఇస్తారు. ప్రత్యేక దళాలు, ప్రధాన ఉపన్యాసకులు, సర్జన్లు కూడా తమ ఆలోచనలకు నియంత్రించేందుకు ఈ టెక్నిక్‌ను ఉపయోగిస్తున్నారు. సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఈ ఎక్సర్‌సైజు చేయడం వల్ల ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించడం సాధ్యపడుతోందని వారు చెబుతున్నారు. చేసే పనిపై మరింతగా దృష్టిని కేంద్రీకరించడానికి ఇది తోడ్పడుతోందని పేర్కొంటున్నారు. ఒకవేళ ఆలోచనలను దూరం పెట్టడంలో ఇబ్బంది అనిపిస్తే ఏదైనా ఇష్టమైన పాటను మనసులోనే హమ్ చేయాలి. కుదిరితే అంకెలను లెక్కపెట్టాలి.

### అధ్యయనం ఇలా

బాక్స్ బ్రీతింగ్ ఎక్సర్‌సైజు చేయడం గురించి ఇటీవల జరిపిన అధ్యయనంలో ఆసక్తికరమైన ఫలితాలు వచ్చాయి. ఆరోగ్యానికి సంబంధించిన ఏ అంశంపైన అయినా మెడిటేషన్ ప్రభావాన్ని అంచనా వేసేందుకు అమెరికాలో చేపట్టిన అధ్యయనంలో దాదాపు ఎనిమిది వేల మంది తమ అనుభవాలను వెల్లడించారు. రోజూ మెడిటేషన్ (ధ్యానం) వల్ల అనేక సమస్యల నుంచి బయటపడినట్లు వారు తెలిపారు. లక్ష్యాలు, మెడిటేషన్ చేసే విధానాల్లో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ ఫలితాలు మాత్రం సానుకూలంగా రావడం గమనార్హం. భారతీయ యోగా విధానంలో వివిధ ఆసనాల తర్వాత చివరగా వేసే శవాసనంలో ఉచ్ఛ్వాసనిశ్వాసాలను అదుపు చేయడం గమనించాల్సిన విషయమని నిపుణులు చెబుతున్నారు. శవాసనం వేసినప్పుడు అన్ని రకాల ఆలోచనలను నియంత్రించడం జరుగుతుంది. గాలిని పీల్చి వదిలినప్పుడు ఊపిరితిత్తులు ఒక క్రమపద్ధతిలో వ్యాకోచించి, సంకోచించడం మాత్రమే కనబడుతుంది. దీనివల్ల మానసిక, శారీరక ఒత్తిడి తగ్గిపోతుందని మనసు ఆహ్లాదకరంగా ఉంటుంది. బాక్స్ బ్రీతింగ్ ఎక్సర్‌సైజులో జరిగే ప్రక్రియ కూడా శ్వాసమీద దృష్టిపెట్టడమే.

### ప్రాణాయామం వంటిదే

బాక్స్ బ్రీతింగ్ అంటే ఒక రకంగా ప్రాణాయామం వంటిదే. బాక్స్ బ్రీతింగ్‌లో కూడా ప్రాణాయామంలో మాదిరిగానే ఉచ్ఛ్వాస నిశ్వాసాల నియంత్రణ (గాలి పీల్చి, దిగ్బంధించి, వదలడం) ప్రక్రియ ఉంటుంది. సాధారణంగా ఉదయం, సాయంత్రం పూజల సందర్భంగా కానీ, త్రికాలాల్లో (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) సంధ్యవార్చేటప్పుడు ముమ్మారు మూడుసార్లు చొప్పున ప్రాణాయామం చేయాల్సి ఉంటుంది. అయితే బాక్స్ బ్రీతింగ్ చేయడానికి ఫలానా సమయం అంటూ ఉండదు. ఇంట్లో, ఆఫీసులో ఎక్కడైనా చేయొచ్చు. ఒత్తిడి తగ్గించుకునేందుకు చేసే ఈ ఎక్సర్‌సైజుకు ఇటీవలి కాలంలో గణనీయంగా ఆదరణ పెరుగుతోంది. బాక్స్ బ్రీతింగ్ చేసేటప్పుడు కూర్చునే విధానంలో చిన్నపాటి సూచనలు పాటించాలి. శరీరం పూర్తిగా రిలాక్స్ అయ్యే రీతిలో వీలైనంత సౌకర్యంగా కూర్చోవాలి. కూర్చున్నప్పుడు వీపు భాగం వంగిపోకుండా నిటారుగా ఉండాలి. ఊపిరి తిత్తులలోని గాలి మొత్తం నెమ్మదిగా బయటకు వదలాలి. ఈ విషయమై ఏవిధంగా చేస్తున్నదీ దృష్టిని కేంద్రీకరించాలి. తర్వాత ముక్కు ద్వారా నెమ్మదిగా గాలి పీల్చాలి. ఈ క్రమంలో నాలుగు అంకెలను చాలా నెమ్మదిగా మనస్సులోనే లెక్కించాలి. పీల్చేగాలి ఊపిరితిత్తులలోకి చల్లగా చేరుతోందనే భావనతో ఉండాలి. గుండెల నిండుగా గాలి పీల్చిన తర్వాత నాలుగు అంకెలు లెక్కపెట్టేవరకూ దానిని అలాగే స్తంభింపజేయాలి. ఆ తర్వాత నాలుగు అంకెలను మననం చేసుకుంటూ గాలిని నోటి ద్వారా నెమ్మదిగా బయటకు వదలాలి. ఊపిరితిత్తులు, కడుపులో నుంచి గాలి పూర్తిగా బయటకు వెళ్ళిపోయిందన్న భావన కలగగానే అప్పుడు సాంత్వన ఏర్పడుతుంది. ఆ తర్వాత గాలి పీల్చకుండా నాలుగు అంకెలను లెక్కించాలి. ఈ ప్రక్రియను ఇలాగే మరోసారి చేయాలి.

## ఆరోగ్యాన్ని కుదేలు చేసే భావోద్వేగాలు

తన కోపం తనకు శత్రువు అంటూ ఉంటారు. ఇది అక్షరాలా నిజం. కోపంతో పాటు చికాకు, సంతోషం, ఆందోళన మొదలైన భావోద్వేగాలు శరీరం మీద ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి వాటి ప్రభావాల పట్ల అవగాహన పెంచుకోవడం అవసరం.

**నవ్వు:** నవ్వుతో రోగనిరోధకశక్తికి తోడ్పడే కణాలు పెరగడంతో పాటు, ఇన్‌ఫెక్షన్‌తో పోరాడే యాంటీబాడీలు కూడా వృద్ధి చెందుతాయి. కాబట్టే సంతోషం సగం బలం అన్నారు. నవ్వుతో రక్తనాళాల పనితీరు మెరుగై, రక్తప్రసరణ మెరుగవుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యం క్షేమంగా ఉంటుంది.

**కోపం:** కోపోద్రిక్తులైన రెండు గంటల తర్వాత గుండెపోటుకు గురయ్యే అవకాశాలు పెరుగుతాయి. అయితే కన్‌స్ట్రక్టివ్ యాంగర్... అంటే, అకారణంగా కోపం తెచ్చుకోవడం కాకుండా, కోపం తెప్పించే సందర్భాల వల్ల కోపోద్రిక్తులవడం వల్ల గుండె మీద పడే ప్రభావం తక్కువగా ఉండే వీలుంది. అలాగే కోపం తెచ్చుకున్న ఆరు గంటల లోపు శరీరంలో యాంటీబాడీల పరిమాణం తగ్గి వ్యాధినిరోధక వ్యవస్థ కుంటుపడుతుంది. అలాగని కోపాన్ని అదుపు చేసుకున్నా, ఆయుష్షు తగ్గుతుంది. కాబట్టి కోపాన్ని అవసరం మేరకు



వ్యక్తపరచాలి.


**భావోద్వేగాలు చెప్పుచేతల్లో:** నిస్సహాయత, నిరాశ లాంటి భావోద్వేగాలు శరీరంలో హార్మోన్ల అసమతౌల్యానికి కారణమవుతాయి. సంతోషం, ఇమ్యూన్ రెస్పాన్స్‌కు కారణమయ్యే మెదడులోని రసాయనాల ఉత్పత్తిని తగ్గిస్తాయి. కాబట్టి అలాంటి భావోద్వేగాలకు మూల కారణాలను వెతికి, వాటిని సరిదిద్దుకోవాలి.

**ఒత్తిడి:** తీవ్ర ఒత్తిడితో డిఎన్ఎలో ఉండే టీలోమీయర్స్ పొడవు తగ్గుతుంది. ఫలితంగా ఆయుష్షు తగ్గుతుంది.

**భయం:** భయం... ఫైట్ అండ్ ఫ్లయిట్ స్పందన కోసం ఉద్దేశించినది. అయితే ఇదే భావోద్వేగం నిరంతరంగా కొనసాగితే, కార్డియో వాస్క్యులర్ సిస్టమ్ దెబ్బతినడంతో పాటు, ఆకలి మందగించి, అజీర్తి మొదలవుతుంది. కాబట్టి అర్థం లేని భయాలను, అనుమానాలను వదిలించుకోవాలి.

## ఒక్క క్లిక్‌తో సర్టిఫికెట్ల పరిశీలన

రాష్ట్రంలో బోగస్ సర్టిఫికెట్లను గుర్తించడంలో ఆధునిక విధానం అందుబాటులోకి రానుంది. ఒక్క క్లిక్‌తో అభ్యర్థి చదువుకు



సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్రంలో 'స్టూడెంట్ అకడమిక్ వెరిఫికేషన్ సర్వీస'ను ప్రారంభిస్తున్నారు. బోగస్ సర్టిఫికెట్ల సమస్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. శుక్రవారం (ఈ నెల 18న) రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దీన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో కొనసాగే ఈ సర్వీసు ద్వారా బోగస్ సర్టిఫికెట్ల గుర్తింపు సులభం కానుంది. ఇందుకోసం 2010 నుంచి 2021 ఏడాది వరకు డిగ్రీ (అన్ని రకాల కోర్సులు) పూర్తి చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను స్కాన్ చేసి, ఆన్‌లైన్‌లో ఉంచారు. మొత్తం 15 యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో చదువుకున్న సుమారు 24.45 లక్షల మంది అభ్యర్థుల డేటాను ఇందులో పొందుపరిచారు.
సర్టిఫికెట్ల తనిఖీ రెండు దశల్లో ఉండనుంది. తొలుత ఇన్‌స్టంట్‌గా వివరాలను పొందవచ్చు. ఇందుకోసం ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థి వివరాలను నమోదు చేసిన వెంటనే, అతని సర్టిఫికెట్లు నిజమైనవా? కాదా? అనే విషయం స్పష్టం అవుతుంది. రెండో విధానంలో అభ్యర్థికి సంబంధించిన మరిన్ని వివరాలు.. అంటే ఆయా డిగ్రీల్లో సాధించిన మార్కులు, గ్రేడ్ వంటి వాటిని పరిశీలించవచ్చు. తొలి దశ వెరిఫికేషన్ సర్వీసును ఉచితంగానే పొందవచ్చు. రెండో దశ పరిశీలనకు మాత్రం నిర్ణీత ఫీజును నిర్ణయించారు. అది చెల్లించిన తర్వాత సంబంధిత వర్సిటీలు అభ్యర్థికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లోనే అందజేస్తాయి.

## గుండెపోటు తర్వాత ఏ ఆహారాలను ఎంచుకుంటున్నారు..

గుండెపోటు తర్వాత ఆరోగ్యం కాపాడుకోవడానికి తీసుకునే ఆహారం మనల్ని అన్ని భయాల నుంచి పక్కకు పెట్టేసేదిగా ఉండాలి. ఆరోగ్యం సరిగా ఉంచుకోవాలనే భయం కూడా గుండెపోటు బారిన పడిన వ్యక్తుల్లో ఉంటుంది. ఇది ఇంకా కంగారుకు లోనయ్యేలా చేస్తుంది. అసలు ఏ ఆహారం తీసుకుంటే గుండె పదిలమో తెలుసుకుందాం.

1. సాల్మన్
ఈ చేప ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలతో నిండి ఉంటుంది, ఇది గుండె,రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచే ఒక రకమైన అసంతృప్త కొవ్వు. ఇది వ్యవసాయ-పెంపకం చేపల కంటే ఎక్కువ ఒమేగా-3లను కలిగి ఉంటుంది. దీనితో పాటు సార్డినెస్, మాకేరెల్, హెర్రింగ్, ట్రౌట్, ట్యూనా. వారానికి 2-3 సేర్విన్గ్స్ లక్ష్యంగా పెట్టుకుని తీసుకోవడం మంచిది.

2. ఆలివ్ నూనె
ఈ నూనె పోషకాలలో లిగ్నాన్స్ ఉన్నాయి, ఇది పాలీఫెనాల్స్ అని పిలువబడే యాంటీఆక్సిడెంట్ల సమూహంలో భాగం. ఆలివ్ నూనెలో మొక్కల ఆధారిత ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. మీ హృదయాన్ని రక్షించడానికి నూనెలోని పాలీఫెనాల్స్ , ఒమేగా-3లు కలిసి పని చేసే అవకాశం ఉంది.

3. బీన్స్
వాటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది రక్తంలో కొలెస్ట్రాల్ చేరకుండా సహాయపడుతుంది. ఇది గుండెపోటుకు దారితీసే ధమనులలో ఫలకం నిర్మాణాన్ని పరిమితం చేస్తుంది. వీటిని కొన్ని గంటలు లేదా రాత్రిపూట నానబెట్టిన తర్వాత వేడినీటిలో ఉడికించాలి.

4. ఇతర చిక్కుళ్ళు
ఎండిన పసుపు, ఆకుపచ్చ స్ప్లిట్ బఠానీలు, అన్ని రంగుల కాయధాన్యాలు , ఇతర చిక్కుళ్ళు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

5. గింజలు
ఈ పోషక గుండె-ఆరోగ్యకరమైన కొవ్వులు, కోఎంజైమ్ %ు (జశీు%10), దాదాపు అన్ని అవయవాలు, కణజాలాలకు అవసరమైన యాంటీఆక్సిడెంట్‌ను అందిస్తాయి. బాదం, హాజెల్‌నట్‌లు, వాల్‌నట్‌లు, పైన్ నట్స్ వంటి ఎంపికల మిశ్రమాన్ని వారానికి 5 సేర్విన్గ్‌లను లక్ష్యంగా చేసుకుని తీసుకోవాలి.

6. విత్తనాలు



ఈ చిన్న ప్యాకేజీలలో మంచి విషయాలు వస్తాయి. అవిసె గింజలలో ఒమేగా-3, లిగ్నన్స్ , ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. రోజుకు ఒకటి నుండి 2 టేబుల్ స్పూన్లు సరిపోతాయి. శరీరం వాటి పోషకాలను ఎక్కువగా జీర్ణం చేసుకోగలిగేలా వాటిని పూర్తిగా కాకుండా మెత్తగా నమిలి తినాలి. చియా విత్తనాలు ఒమేగా-3లు, ఫైబర్, ప్రొటీన్లను అందిస్తాయి.

7. బెర్రీలు
బ్లూబెర్రీస్, రాస్ప్బెర్రీస్, స్ట్రాబెర్రీలు, బ్లాక్‌బెర్రీస్ అన్నీ వాటి వివిధ పాలీఫెనాల్స్, ఇన్ఫ్లమేషన్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్ల కారణంగా గుండె ఆరోగ్యానికి సహకరిస్తాయి.

8. యాపిల్స్, బేరి
రెండింటిలోనూ ఫ్లేవనాయిడ్‌లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి గుండెను రక్షించడంలో సహాయపడే యాంటీఆక్సి డెంట్, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడే కరిగే ఫైబర్ కూడా వీటిలో ఉంటుంది.







# ఆనందయోగ మార్గమిదే

**భౌతికమైన సంపద ఎంత ఉన్నా అది ప్రాపంచిక సౌఖ్యాలు ఇవ్వగలదు. కానీ ఆనందాన్ని ఇవ్వలేదు. మన అంతరంగంలో జ్ఞానం పీఠం వేసుకొనే దాకా శాంతి లభించదు. ప్రకృతిని జయించానని విర్రవీగుతున్న మానవుడు తన భావోద్వేగాల మీద నియంత్రణ సాధించలేకపోతున్నాడు. వ్యక్తిగత జీవితంలోను, ఇతరులతో కలిసి నివసించే సహజీవనంలోను, ఉద్యోగ వ్యాపారాల్లోను తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నాడు. వీటన్నింటికీ విరుగుడు ధ్యాన, జ్ఞాన మార్గాలే!**

జీవితం ఒక ఆనంద సీమ అని అందరం అనుకుంటూ ఉంటాం. కానీ, చాలా మంది జీవితం ఎందుకంత నిర్లిప్తంగా ఉంటోంది? ఎందుకంటే మన జీవితంలో దేనికి స్థిరత్వం లేదు. ఏదీ శాశ్వతం కాదు. అయితే పరిణామక్రమంలో పరిణితి ఒక ప్రక్రియ. నిరంతరం చైతన్యశీలంగా ఉండటమే ఈ ప్రక్రియకున్న ఏకైక మార్గం. వ్యక్తుల అంతరంగాలు అనునిత్యం కొత్తదనాన్ని సంతరించుకోవాలి. అప్పుడే అవతలి వ్యక్తుల్లోని భిన్నత్వాన్ని, వ్యతిరేక తత్వాన్ని కూడా జీర్ణించుకోగలుగుతారు. కానీ ఆధునిక ప్రపంచంలో ఇది జరగడం లేదు. కొత్తదనాన్ని సంతరించుకోని వారిలో స్వార్థం పెరుగుతూ వెళ్తుంది. సర్వ అశాంతులకూ, సమస్త సంఘర్షణలకూ అదే కారణమవుతుంది. స్వార్థశక్తులకు, మార్పునకు మధ్య జరిగే ఘర్షణ వల్లే అశాంతి ఏర్పడుతుందంటాడు బుద్ధుడు.

### తోటలో పువ్వుల్లా...

ప్రపంచంలో అందరూ ఒకరితో మరొకరికి సంబంధం లేకుండా బతకగలిగితే ఇన్ని సమస్యలు ఉండవు. ఎవరి అభిప్రాయాలు వారివి. కానీ ఒక సంఘంలో నివసిస్తున్నప్పుడు సహజీవనం అనివార్యమవుతుంది. ఇతరుల దృక్పథాల్ని, అభిప్రాయాల్ని గౌరవించాల్సి వస్తుంది. పరమ విరుద్ధమైన ఆలోచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. సాధారణంగా మనతో ఏకీభవించేవారితో కలవటానికే మనం ఇష్టపడతాం. కానీ దాని వల్ల వృద్ధి ఉండదు. అభిప్రాయాల మధ్య ఘర్షణ, ఆలోచనలలో రాపిడీ ఉన్నప్పుడే ఎదుగుదల సాధ్యమవుతుంది. ఇతరుల వాదనలో ఉన్న సత్యాన్ని గ్రహించి, దానిని ఆచరించగలిగితే కొత్త మార్గాలు మన కళ్ల ముందు గోచరమవుతాయి. ఇతరులతో స్నేహంగా ఉండడం అంటే ప్రకృతితో స్నేహంగా, ఉండడమే. శరీరం కాలిపోయేంతటి ఎండలోనూ మనం జీవిస్తాం. దానికి పరమ విరుద్ధంగా ఉండే చలిలోనూ జీవిస్తాం. నిలువెల్లా తడిపి ముద్దచేసే వర్షంలోనూ జీవిస్తాం. వాటిలో మనం దేన్నీ ద్వేషించం. పరమ విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో జీవించడానికి మనం సిద్ధమైనట్లే విభిన్నమైన వ్యక్తుల మధ్య జీవించడానికి కూడా మనం సిద్ధంగా ఉండాలి. మనం మన శత్రువుల్ని ప్రేమించగలంతటి ఉన్నతులం కాకపోవచ్చు. కానీ, మన ఆరోగ్యం , మన సంతోషం కోసమైనా కనీసం వారిని మన్నించి మరిచిపోవాలి. సాధారణంగా అందరికీ వైరుధ్యం అంటే ఒక వ్యతిరేకత ఉంటుంది. దాని నుంచి దూరంగా జరిగిపోవటానికి ప్రయత్నిస్తారు. కానీ దానిని అర్థం చేసుకుంటే గొప్ప సత్యాలు తెలుస్తాయి.

### దాంపత్యంలో....

పెళ్లిల్లు స్వర్గంలో నిర్ణయిస్తారు అంటారు. కానీ దాంపత్యం సరిగ్గా లేకపోతే ఆ జీవితాలు నరకకూపాలవుతాయి. దంపతుల హృదయాలలో కేవలం స్వార్థం మాత్రమే ఉంటే ఆ బంధం ఎంతో కాలం నిలబడదు. అడుగడుగునా తలెత్తే వైరుధ్యాలను అర్థం చేసుకొని, అసూయ, ఆగ్రహం, అనుమానం వంటి మానసిక స్థితులకు అతీతంగా ఉండటానికి సహనం కావాలి. ఔన్నత్యం మనిషిని దేవుడిగా మారుస్తుంది. హీనత్వం మనిషిని నిర్వీర్యం చేస్తుంది. ఇక్కడ మనం దేవతలంటే ఎవరో కూడా తెలుసుకోవాలి. దేవతలంటే సకల సద్గుణ సంపన్నులు అని కాదు.

ప్రపంచంలో ఎవరూ పరిపూర్ణులు కాదన్న సత్యాన్ని గుర్తించి వ్యవహరించే వారని అర్థం. ఇలాంటి ఔనత్యాన్ని కలిగినప్పుడు దాంపత్యం సజావుగా సాగిపోతుంది.

### మూలాలు పెకిలిస్తేనే...

అవగాహన, సహనం ఈ రెండు గుణాలతో వైరుధ్యాలను అధిగమించవచ్చు. ఇది సాధ్యం కానప్పుడు అశాంతి ప్రబలుతుంది. ప్రస్తుతం మనం అలాంటి పరిస్థితుల్లో ఉన్నాం. మునుపెన్నడూ లేనంతగా మనం శాంతి కోసం వెతుకుతున్నాం. ఇప్పుడు ఏర్పడిన అంశాంతి అంతా భౌతిక సంపద కోసం వెంపర్లాటం వల్ల వచ్చేదే. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించిన అగ్ర రాజ్యాలు కూడా ఈ సమస్యతోనే బాధపడుతున్నాయి. భౌతికమైన పురోగతి మనిషిని సంతోషపెట్టలేదనే సత్యాన్ని మానవాళి విస్మరించింది. దానికి మూల్యం చెల్లిస్తోంది. జ్ఞానం దాని వల్ల సంక్రమించే నీతి, ఉదాత్తత, ఇవి మాత్రమే శాశ్వతమైనవని గ్రహించిన రోజు శాశ్వతంగా శాంతి ఏర్పడుతుంది. ఆ శాంతి సాధనకు పునాదిగా నిలిచే జ్ఞానాన్ని సముపార్జించటానికి ధ్యానం తోడ్పడుతుంది.

మన దేశంలో సుప్రసిద్ధ బౌద్ధ గురువుల్లో వెన్ దీపాంకర ఒకరు. ఆయన ఒక సారి టిబెట్‌లో దమ్మ తత్వం మీద ప్రసంగించటానికి వెళ్లారు. ఆయన తనతో పాటుగా ఒక వంట మనిషిని కూడా తీసుకువెళ్లాడు. ఆ వంట మనిషికి వంట సరిగ్గా రాదు. పైగా పేచీకోరు. అది గమనించిన కొందరు భక్తులు 'మీరు ఎందుకు ఆ వంట మనిషిని భరిస్తున్నారు? అతనిని వెనక్కి పంపేయండి. మీ అవసరాలు మేం చూసుకుంటాం' అని దీపాంకర వద్దకు వచ్చి ప్రశ్నించారు. అప్పుడు దీపాంకరుడు " అతన్ని నేను ఒక నౌకరుగా చూడటం లేదు. ఒక గురువుగా భావిస్తున్నాను. అతని అసమర్థత, పేచీకోరుతనం నాకు ప్రతి రోజూ పాఠాలు నేర్పుతూ ఉంటాయి. నాలో సహనాన్ని, నిబ్బరాన్ని పెంచుతూ ఉంటాయి.." అని సమాధానమిచ్చాడు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవటంలోనే మనిషి అసలైన సమర్థత దాగి ఉంటుంది.

# వృద్ధులకు ఆరోగ్య నియమాలు అవసరం



**పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు రోగ నిరోధక శక్తికి కావలసిన విటమిన్లను, శరీర పోషణకు కావలసిన పదార్థాలను కలిగిన పదార్థాలే కాకుండా శరీరానికి నూతనోత్సాహాన్నిచ్చే కాఫీ, టీ లాంటివి కూడా ఆహార పదార్థాల జాబితాలోకే వస్తాయి. ఈ విషయంలో వృద్ధులకు మరింత అవగాహన అవసరం అంటున్నారు వైద్యులు..**

పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పులు, కందమూలాలు, సుగంధ ద్రవ్యాలు మనకు ప్రకృతి ప్రసాదం. అన్నంతో కూడా ప్రకృతి సిద్ధమైన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలను ఆహారంగా తీసుకుంటేనే శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు అందుతాయి. వయసు పైబడిన తరువాత అనేక కారణాలరీత్యా ఆహార విషయాల్లోనూ కొన్ని నియమాలు పాటించక తప్పదు. వృద్ధులకు విటమిన్‌డి, కాల్షియం, విటమిన్ బి12, పీచు, పొటా షియం వంటి పోషకాల అవసరం ఎక్కువ. అందుకే వాటికి సంబంధించిన అవగాహన ఉంటే ఆ ఆహారాన్ని తీసుకునే వీలుంటుంది.

వయసు పైబడినవాళ్లు ఎప్పుడూ తక్కువ కొవ్వు ఉండే పాల పదార్థాలు, ఆకు కూరలు, చేపలు తగినంతగా తీసుకోవటం ద్వారా విటమిన్‌డి, కాల్షియం పొందవచ్చు. ఇవి ఎముక పుష్టికి దోహదం చేస్తాయి.

చేపలు, సముద్ర ఆహారం, తేలికైన మాంసం నుంచి విటమిన్‌బి12 అందుతుంది.

సాధారణంగా వృద్ధాప్యంలో తప్పనిసరిగా వేధించే సమస్య మలబద్ధకం. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, ముడి బియ్యం లేదా దంపుడు బియ్యం వంటి పొట్టు తీయని ధాన్యం ఎక్కువగా తీసుకుంటే ఆ బాధ నుంచి తేలిగ్గా బయటపడొచ్చు. ఎందుకంటే వీటన్నింటిలోనూ పీచు అధికంగా ఉంటుంది.

పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వు ఉన్న పాల పదార్థాలలో వృద్ధులకు అవసరమైన పొటాషియం కూడా ఉంటుంది.

అందరిలాగే వృద్ధులు కూడా నూనె పదార్థాలు, వేపుళ్లు తగ్గించడం మంచిది. ముఖ్యంగా నెయ్యి, డాల్డా వంటి సంతృప్త కొవ్వులు తగ్గించి పొద్దు తిరుగుడు నూనె వంటివి మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

# వానాకాలంలో పిల్లలు జాగ్రత్త..!

- ఇపుడిపుడే వర్షాలు ప్రారంభమవుతున్నాయి. వర్షం వస్తే పచ్చదనం పలకరిస్తుంది.. వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈ వర్షంతో పాటు రకరకాల వ్యాధులు కూడా పలకరిస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉండే తల్లిదండ్రులు మరీ జాగ్రత్తగా ఉండాలి. వానచినుకుల్లో చిందులేయాలని పిల్లలు తెగ ఆరాటపడతారు. వానలో తడిస్తే మాత్రం జలుబు.. దానివెంటే దగ్గూ, జ్వరం వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలోనే పిల్లలకి వ్యాధులు అతి సులువుగా వ్యాపిస్తాయి. అందుకే పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.
- వర్షాకాలం అంటే ఇల్లయినా, పరిసరాలైనా సరే చిత్తడితో కూడుకుని ఉంటాయి. ముందుగా వర్షం నీళ్లు ఇంటిచుట్టూ ఎక్కడైనా ఉండే వాటిని తేసేయాలి. అలాగే ఉంచితే మాత్రం ఈగలు, దోమలకి స్వాగతం పలికినట్లే. తద్వారా పిల్లలకి సులువుగా కలరా, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే అవకాశముంది. అంతేనా అలర్జీలు, ఇన్‌ఫెక్షన్‌లు పిల్లల్ని త్వరగా అటాక్ చేసేది వర్షాకాలంలోనే.



- తడి బట్టలను, తడి టవల్స్‌ను ఇంట్లో ఉంచితే బాక్టీరియా, ఫంగస్ అభివృద్ధి చెందుతుంది. అందుకే వాటిని గాలి తగిలేట్లు ఆరేయాలి.

మృదువైన యాంటీబాక్టీరియా సోప్‌తో కనీసం రోజుకు రెండుసార్లు పిల్లలకి స్నానం చేయించాలి.

- వానాకాలంలో పిల్లలకి మలేరియా వంటి జబ్బులు వచ్చే ప్రమాదముంది. తాగే నీళ్లు కలుషితం కాకుండా చూసుకోవాలి. తాజా ఆహారాన్నే తీసుకోవాలి. వర్షాకాలంలో పిల్లల జీర్ణక్రియ తగ్గుతుంది.
- ఇంటి ఫుడ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆ ఆహారంలో అల్లం, పసుసు లాంటి యాంటీఆక్సిడెంట్స్ ఉండేట్లు చూసుకోవటం ఉత్తమం. వేడి ఆహారాన్ని మాత్రమే పిల్లలకి పెట్టాలి. పచ్చిగుడ్డు, ఫ్రూట్ సలాడ్, లస్సీ, బటర్‌మిల్క్‌లకు దూరంగా ఉంచాలి.
- ప్యూరిఫైర్డ్ నీళ్లు పిల్లలకి తాగించాలి. లేకుంటే నీటిని కాచి వడబోసి తాగించాలి. దీని వల్ల సాధ్యమైనంత వరకు పిల్లల జోలికి వ్యాధులు దాదాపు రావు.
- ఇంట్లోని కూలర్లు, ఫ్లవర్‌వాజ్‌లను శుభ్రంగా ఉంచాలి. ఏ.సి.లను వానాకాలం వాడకపోవటం మంచిది. ఇక పిల్లల పాదాలను శుభ్రంగా ఉంచాలి. దీంతో పాటు పిల్లల షూస్‌ని క్లీన్‌గా ఉంచాలి.
- వర్షాకాలంలో లైట్ కాటన్, లూజ్ క్లోత్స్‌ని పిల్లలకి వేయాలి. పిల్లలు బయట ఆడుకొని వచ్చాక శుభ్రపరచాలి.
- వానాకాలంలో పిల్లల గోర్లలో చేరుకున్న మట్టిని క్లీన్ చేయాలి. ఎందుకంటే పిల్లలు తరచూ వేళ్లను నోట్లో పెట్టుకోవడం వల్ల కడుపునొప్పి సమస్యలు వస్తాయి... మొత్తానికి వానాకాలం వచ్చే వ్యాధుల బారినుండి పిల్లల్ని కాపాడాలంటే ముందు జాగ్రత్తలే శరణ్యం.

# అమ్మాయిలూ... ఆలస్యం వద్దు

**గడియారంతో పరుగులు పెట్టందే కెరీర్‌లో దూసుకెళ్లడం కష్టమే! కానీ ఆ క్రమంలో బయొలాజికల్ క్లాక్ దెబ్బతింటుందేమో గమనించారా? మరీ ముఖ్యంగా అమ్మాయిలు ఈ విషయంలో అప్రమత్తంగా లేకపోతే... గర్భధారణ, ప్రసవ సమస్యలు తప్పవు!**

మరీ చిన్న వయసులో 14 నుంచి 18 ఏళ్లలోపు గర్భం దాల్చినా కష్టమే! 30 ఏళ్లు దాటిన తర్వాత గర్భం దాల్చినా క్లిష్టమే! పెళ్లీడుకు తగిన వయసు 20 నుంచి 25 ఏళ్లు. ఈ వయసు కంటే ముందు గర్భాశయం పూర్తిగా వికసించి ఉండదు. గర్భం దాల్చడానికి తగినట్టుగా శరీరం ఎదిగి ఉండదు. 20 నుంచి 25 ఏళ్ల వయసులో నాణ్యమైన అండాలు విడుదలవుతాయి. తద్వారా ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టే వీలుంటుంది. 25 ఏళ్లు దాటినప్పటి నుంచి అండాల నాణ్యత సన్నగిల్లడం మొదలవుతుంది. కాబట్టి ఆరోగ్యకరమైన పిల్లలు కావాలని కోరుకునేవారు 30 ఏళ్లలోపే బిడ్డకు జన్మనివ్వాలి. వ్యక్తిగత కారణాలరీత్యా గర్భం దాల్చడాన్ని వాయిదా వేయాలనుకుంటే, అండాలను ఎగ్ బ్యాంక్‌లో నిల్వ చేసుకోవాలి. ఆ తరువాత అవసరమైనప్పుడు గర్భం దాల్చవచ్చు.

### ఆరోగ్యకరమైన జీవనశైలి కీలకం

వేళకు నిద్ర, ఆహారం, వ్యాయామం గర్భధారణకు ఉపకరించే అంశాలు. భార్యాభర్తల్లో ఎలాంటి శారీరక అనారోగ్యం లేకపోయినా పిల్లలు కలగకపోవడానికి కొన్ని కారణాలున్నాయి. సమతులాహారం, క్రమం తప్పని వ్యాయామం, రోజుకు 8 గంటల నిద్ర.... వీటిని అనుసరించకపోతే శరీర జీవక్రియలు క్రమం తప్పుతాయి. నెలసరి సమస్యలు తలెత్తుతాయి. అండాల విడుదల అటకెక్కుతుంది. దాంతో గర్భం దాల్చే అవకాశాలు సన్నగిల్లుతాయి. కాబట్టి వేళకు పోషకాహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోతూ, రోజుకి కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి.

### బయోలాజికల్ క్లాక్ దెబ్బతిందా?

పగటి వేళను నిద్రకు కేటాయిస్తూ, రాత్రి వేళ డెస్కులకు అతుక్కుపోయి పని చేసే ఉద్యోగినుల బయొలాజికల్ క్లాక్ అస్తవ్యస్తం అవడం సహజం. ఫలితం... నెలసరి స్రావాల్లో హెచ్చుతగ్గులు, తేదీల్లో తారుమార్లు. బయొలాజికల్ క్లాక్ పనితీరు దెబ్బతింటే శరీరంలో హార్మోన్ల విడుదలలోనూ అవకతవకలు చోటు చేసుకుంటాయి. దాంతో నెలసరి క్రమం తప్పుతుంది. దాంతో గర్భం దాల్చే అవకాశాలు తగ్గుతాయి.

గర్భం నిలవకపోవడం, పదే పదే గర్భస్రావం జరగడం నేటి యువతులు ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్య. ఈ సమస్యను వైద్య పరిభాషలో 'ఎంబ్రియో ఎలర్జీ' అంటారు. ఈ ఎలర్జీ కలిగిన వారి శరీరం అండాన్ని రిజెక్ట్ చేస్తుంది. దాంతో గర్భం దాల్చినా నెలసరి ఆగిపోదు. అండం గర్భాశయంలో నాటుకోకపోవడం మూలంగా గర్భం దాల్చినా, నెలసరి స్రావంతో పాటు పిండం బయటకు వచ్చేస్తుంది. ఇలా జరుగుతున్న విషయం ఎవరంతట వాళ్లు గ్రహించలేనంత సహజంగా జరిపోతూ ఉంటుంది. నెలసరి క్రమం తప్పక వస్తున్నప్పటికీ, ఎటువంటి గర్భనిరోధక పద్ధతులూ పాటించకుండా ఏడాదిపాటు కాపురం చేసినా పిల్లలు కలగకపోతే వైద్యుల్ని సంప్రతించి ఎంబ్రియో ఎలర్జీ ఉందేమో నిర్ధరించుకోవాలి.



### గర్భం మధుమేహం

గర్భం దాల్చినప్పుడు మధుమేహం తలెత్తితే దాన్ని 'జెస్టేషనల్ డయాబెటిస్' అంటారు. గర్భం దాల్చే సమయానికే మధుమేహం ఉన్నా, లేకపోయినా ఈ స్థితి ఎవరికైనా తలెత్తవచ్చు. మరీ ముఖ్యంగా తల్లితండ్రులకు మధుమేహం ఉంటే, ఆ యువతులు గర్భం దాల్చినప్పుడు, జెస్టేషనల్ డయాబెటిస్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఒకసారి ఈ సమస్యకు గురయితే, ఆ మహిళలు జీవితాంతం మధుమేహంతో బాధపడవలసి ఉంటుంది. పుట్టే బిడ్డ కూడా అధిక బరువుతో పుట్టే అవకాశాలుంటాయి.

### అధిక రక్తపోటు ఉంటే?

అధిక రక్తపోటు ఉన్న మహిళలు గర్భం దాల్చినప్పుడు కచ్చితంగా రక్తపోటు పెరుగుతుంది. ఇలాంటి మహిళలు కూడా గర్భం దాల్చింది మొదలు వైద్యులను సంప్రతిస్తూ రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి. అలాగే మూత్రపిండాలు, కాలేయం పనితీరులను పరిశీలించుకుంటూ ఉండాలి. అధిక రక్తపోటు ఉండి గర్భం దాల్చిన మహిళలకు మూర్ఛ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ, అవసరమైన పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తగా మెలగాలి.

### వరుస గర్భస్రావాలు

గర్భం దాల్చిన మూడు వారాల్లోపే కొందరికి గర్భస్రావం అయిపోతూ ఉంటుంది. ఇలాంటప్పుడు గర్భం దాల్చింది మొదలు వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ, అవసరమైన పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. థైరాయిడ్ స్రావంలో అవకతవకలు, రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ ఉండడం, క్రోమోజోమల్ డిజార్డర్లు.... మొదలైన సమస్యలు ఉన్నాయేమో వైద్యులు పరీక్షించి తదనుగుణ చికిత్సను అందిస్తారు. 'యాంటీబాడీ సిండ్రోమ్' వల్ల కూడా అబార్షన్లు కలగవచ్చు. ఈ సమస్యలకు చికిత్సలున్నాయి. కాబట్టి వరుసగా గర్భస్రావం అవుతూ ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని కలవాలి.

# చినుకుల్లో చకచకా!

**వర్షంలో చెప్పులు తడిస్తే చికాకు అనిపిస్తుంది. అలాగని చెప్పులు లేకుండా అడుగు బయట పెట్టలేం. మనకు ఇష్టమైన చెప్పుల్నీ ఈ వర్షాల్లో వేసుకోలేము. ఈ సీజన్‌లో ఎలాంటి చెప్పులు వేసుకోవాలి? పాదాల సంరక్షణ పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**జెల్లీషూస్:** ఒకప్పటి స్టయిలే ఇది! జెల్లీషూస్‌ను కాలేజీ అమ్మాయిలు మొదలుకొని గృహిణుల వరకు అందరూ ఇష్టపడేవారు. అయితే అప్పట్లో భిన్నమైన రంగుల్లో, స్టయిల్స్‌లో దొరికేవి కావు. ఇప్పుడు మార్కెట్‌లో రోజుకొక డిజైన్‌తో దర్శనమిస్తున్నాయివి. జెల్లీషూస్ వర్షాకాలంలో భలే సౌఖ్యం. ఒకవేళ నీళ్లలో తడిచినా ఫర్లేదు. క్షణాల్లో తేమ ఆరిపోతుంది. షూస్‌కు పైన రంధ్రాలు ఉంటాయి కాబట్టి కాళ్లకు గాలిసోకి.. తేమతో వచ్చే ఇన్‌ఫెక్షన్లు రావు. నీళ్లలో నడిచినా షూస్ పాడవ్వవు.

**గమ్‌బూట్స్:** ఈ సీజన్‌లో ఎప్పుడు వర్షం వస్తుందో ఊహించలేము. ఏ లెదర్ చెప్పులో వేసుకుంటే పాడైపోతాయి. స్లిప్పర్స్ అయితే జారే ప్రమాదం ఉంది. అందుకే గమ్‌బూట్స్ తొడిగితే ఏ సమస్యా ఉండదు. ఇవి మెత్తటి ప్లాస్టిక్, ఫైబర్‌లతో తయారవుతాయి. కాబట్టి నీళ్లలో గంటలకొద్దీ నానినా ఏ ఢోకా ఉండదు. రబ్బరుకు నీటిని పీల్చుకునే గుణం ఉండదు. తెగిపోవడమూ అరుదు. ఇంట్లో ఒక జత గమ్‌బూట్స్ ఉంటే మంచిది. వరుసగా వానలు పట్టుకున్నప్పుడు.. ఇవెంతో ఉపకరిస్తాయి. అందులోను వీటి ధర కూడా చాలా చౌక.

**ఫ్లోటర్స్:** వర్షాకాలంలో కాలేజీ అమ్మాయిలు.. తమకు ఇష్టమైన చెప్పులు వేసుకునే అవకాశం ఉండదు. అలాగని వర్షాకాలంలో రబ్బరు చెప్పులు వేసుకోవడమూ ఇష్టం ఉండదు. అందుకే ట్రెండీ, స్టయిల్స్‌ను కోరుకునే వారు ఫ్లోటర్స్‌ను ఎంచుకోవచ్చు. పాదానికి బెల్టు బిగుతుగా ఉంటుంది కాబట్టి.. వేగంగా నడిచేందుకూ ఇబ్బంది ఉండదు.

**యొ జెలో శాండిల్స్:** ఒక ప్రత్యేకమైన సింథటిక్‌తో తయారుచేసిన చెప్పల్స్ ఇవి. చూసేందుకు అద్భుతమైన



షైనింగ్‌తో కనిపిస్తాయి. వీటిని ఎంచక్కా వర్షాకాలంలో వాడుకోవచ్చు. జెలోశాండిల్స్‌ను వీలైనంత వరకు వేడి తగిలే ప్రాంతంలో ఉంచకూడదు. బ్రష్‌తో పాలిష్ చేయొద్దు. పొడిబట్టతోనే తుడవాలి. వీటిలో హైహీల్స్ చెప్పులు కొనకపోవడమే మేలు. ఒక్కోసారి జారే ప్రమాదం ఉంది. సల్వార్‌కమీజ్, పంజాబ్‌డ్రెస్, జీన్స్‌ప్యాంట్లలోకి జెలో శాండిల్స్ అదుర్స్!

**ఆక్వావేవ్ వాటర్ షూస్:** తొడుక్కోవడం, వదలడం బహు తేలిక. వర్షాకాలంలో సముద్రతీర ప్రాంతాల్లోని బీచ్‌లు లేదంటే నదుల వద్దకు వెళ్లినప్పుడు, స్విమ్మింగ్ పూల్స్ దగ్గరా ఎంతో ఉపకరిస్తాయి. ఈ షూస్‌తో మెత్తటి ఇసుకలోను, తడిమట్టిలోను నడవడం సులభం. షూస్ అడుగుభాగంలోని రబ్బర్ టెక్చర్ వల్ల నడకకు పట్టు లభిస్తుంది. జారిపడే అవకాశమే ఉండదు.

**ఫ్లిప్‌పాప్:** మనం రోజు వేసుకునే స్లిప్పర్స్‌లాంటివే ఇవి. మన చెప్పుల స్టాండ్‌లో.. ఫ్లిప్‌పాప్ చెప్పులు సైతం ఒక జత తప్పనిసరి. వర్షంలో టక్కున బయటికి వెళ్లాల్సి వస్తే.. వీటిని వేసుకోవచ్చు. ఇంట్లోనూ వాడుకోవచ్చు. కేవలం వర్షాకాలంలోనే కాకుండా అన్ని సీజన్లలోను ఆల్‌ఇన్‌వన్‌లా పనికొస్తాయి.

### ఎలాంటివి వేసుకోకూడదు?

వర్షాకాలంలో కాన్వాస్ షూస్ జోలికి వెళ్లకండి. తడి పట్టుకుంటే ఒక పట్టాన వదలవు. మూడునాలుగుసార్లు వర్షంలో తడిస్తే ఇక పనికిరావు. పడేయాల్సిందే!

ఫార్మల్ షూస్, లెదర్ షూస్‌లను కూడా వాడకపోవడం మేలు. తోలుతో తయారైనవి కాబట్టి నీళ్లకు తడిస్తే త్వరగా దెబ్బతింటాయి. అందులోను దుర్వాసనను వెదజల్లుతాయి. తద్వార ఇన్ఫెక్షన్లు రావొచ్చు.

సాక్స్‌లు లేని షూకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షంలో సాక్సులు నానిపోయి.. చికాకు తెప్పిస్తాయి. తడి వల్ల కాళ్లు నవ్వులుపెట్టి.. ఎర్రటి నీటి బొబ్బలు వచ్చే ప్రమాదం ఉంది. హైహీల్స్ అస్సలు వేసుకోవద్దు. వర్షంలో రోడ్లు తడిచిపోతాయి. సహజంగానే హైహీల్స్ చెప్పులతో నడకే ఇబ్బంది. అలాంటిది వర్షాల్లో జారే ప్రమాదం లేకపోలేదు.

# అయోధ్యపై విపక్షాల రాజకీయం ఆపాలి

### మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్

**హైదరాబాద్,జనవరి19వెలుతురు :** అయోధ్యను విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. భారత జాతికి ప్రతిపక్ష పార్టీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 22న సగం రోజు సెలవు ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రజల



మనోభావాలను తెలుసుకోవాలన్నారు. 22వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవప్రదంగా అయోధ్య రాముడికి పంపించే కానుకలను సిద్ధం చేయాలని బీజేపీ నేత సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి దావోస్‌కు ఎందుకు పోతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. అదానీ, అంబానీలను తిడుతూ మరోవైపు ఆయనతోనే మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని... ప్రజలందరూ ఈ అంశాన్ని గమనించాలన్నారు. గతంలో కేటీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పిన రూ.20వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఏమయ్యాయని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు

# రాజాసింగ్‌కు బెదిరింపుపై పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్,జనవరి19వెలుతురు:** ఎట్టకేలకు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వచ్చిన బెదిరింపు కాల్స్ వ్యవహారంలో మంగళ్‌హాట్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొన్ని రోజులుగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కొంతమంది ఫోన్ చేస్తూ శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తే చంపుతామంటూ బెదిరించారు. ఇదే విషయమై రాజాసింగ్ నగర కమిషనర్‌తోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గత రెండు రోజుల క్రితం సైతం ఓ వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్‌లోనే చంపుతానంటూ చాలెంజ్ చేయడంతో అదే విషయాన్ని రాజాసింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ అంశంపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసి వాటిపై ఆరా తీస్తున్నారు.

# ఇల్లంతకుంట ఆలయంలో బండి కరసేవ

### చీపురుపట్టి ఊడ్చిన బిజెపి ఎంపి

**కరీంనగర్,జనవరి19వెలుతురు:** ఈనెల 22న అయోధ్యలో జరగబోయే రామ మందిర పున:ప్రతిష్ట కార్యక్రమం కోసం యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తున్న తరుణంలో ఆరోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం సంజయ్ చీపురు, పార బట్టి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బండి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు దేవాలయాలను శుద్ది చేస్తున్నామన్నారు. అన్నివర్గాల ప్రజలు దేవుడి అక్షితల కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని చెప్పారు. రామ మందిర నిర్మాణ నిధి సేకరణలో తెలంగాణ అగ్రభాగాన ఉందన్నారు.అయోధ్య అక్షితలు రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను మీడియా ప్రస్తావించగా? 'అక్షితల్లో రేషన్ బియ్యం, బాసుమతి బియ్యం, జై శ్రీరాం బియ్యం అనే రకాలు ఉండవు. పవిత్రమైన దేవుడి అక్షితలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు వక్రీకరించడం తగదు. కాంగ్రెస్ నేతలు కోరితే బాసుమతి బియ్యాన్ని పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం'అని పేర్కొన్నారు.



# యోగి వేమనకు సిఎం జగన్ నివాళి

**విజయవాడ,జనవరి19వెలుతురుద:** యోగి వేమన జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి సిఎం జగన్ ఆయనకు నివాళి అర్పించారు. క్యాంప్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయి రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంపై ఆంక్షలు

**న్యూఢిల్లీ,జనవరి19వెలుతురు:** రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీ విమానాశ్రయంపై శుక్రవారం కేంద్ర ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. జనవరి 26 వరకు ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 10.20 గంటల నుంచి 12.45 మధ్య టేకాఫ్, ల్యాండింగ్‌లపై తాత్కాలికంగా నిషేధం విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. రిపబ్లిక్ డే రోజున ఉదయం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు విమానాశ్రయాన్ని మూసివేయనున్నట్లు తెలిపింది. అయితే వైమానిక, నేవీ, బిఎస్ఎఫ్‌ల హెలికాప్టర్ కార్యకలాపాలు, ఇతర విఐపిల ప్రయాణాలకు మినహాయింపునిచ్చింది. ఈ ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరుకావడం వరుసగా ఇది ఆరవసారి కావడం గమనార్హం.

# పవన్ కళ్యాణ్‌తో కొణతాల భేటీ

### అభిమానుల ఒత్తిడితోనే కలిశానని వెల్లడి

**విశాఖపట్నం,జనవరి19వెలుతురు:** మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే కొణతాల హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి బయలు దేరి వెళ్లారు. విశాఖ ఎయిర్ పోర్టులో ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ... తన శ్రేయోభిలాషులు, అభిమానులు చాలా కాలం నుంచి రాజకీయాలలోకి మళ్లీ రమ్మని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. వారి సూచనల మేరకు హైదరాబాద్ వెళ్లి పవన్ కళ్యాణ్‌ని కలిశానని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్రకు సంబంధించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు చెప్పారు. అలాగే ఏపీలో ఉన్న అన్ని సమస్యలపై పవన్ కళ్యాణ్‌తో చర్చించానని కొణతాల అన్నారు. ఈ నెల 21వ తేదీన అనకాపల్లిలో తన అభిమానులతో సమావేశం అవుతున్నానని.. ఆ రోజే ఏ పార్టీలో చేరతానో స్పష్టం చేస్తానని అన్నారు. పార్టీలో చేరిన తర్వాత ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా పోటీ చేయాలనే నిర్ణయాన్ని కూడా పవన్ కళ్యాణ్‌కు చెబుతానని కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

# ఓటు వజ్రాయుధంతో జగన్‌ను సాగనంపాలి

### జగన్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు

### వెంకటగిరి రా కాదలిరా సభలో చంద్రబాబు

**వెంకటగిరి,జనవరి19వెలుతురు:** తుగ్లక్ సిఎం జగన్ మోహన్ రెడ్డి వెయ్యి తప్పులు చేశారని, ఇంకా భర్తిస్తారా అని ఆంధ్రా ప్రజలను టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడిగారు. ఓటు అనే వజ్రాయుధంతో జగన్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎపిలో ఏ వర్గం అయినా సంతోషంగా ఉందా అని ప్రశ్నించారు. తిరుపతి జిల్లా వెంకటగిరి సభలో ఆయన ప్రసంగించారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, 82 రోజుల్లో ఈ వైసిపి ప్రభుత్వం దిగిపోనుందని చురకలంటించారు. జీతం కోసం అడిగితే ఉద్యోగులు జైలు వెళ్లే దుస్థితి ఏర్పడిందని, జగన్ పోవాలని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలని బాబు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం తాను యువతకు ఐటి అనే ఆయుధం ఇచ్చానని, ఇప్పుడు అది వజ్రాయుధమైందని ప్రశంసించారు. టిడిపి హయాంలో తిరుపతిని మొబైల్ హబ్‌గా తయారు చేశామని, రా కదిలిరా అని పిలుపు ఇస్తే వెంకటగిరి గర్జించిందని, వైసిపి వచ్చాక వెంకటగిరి తలరాత మారిందా? అని బాబు ప్రశ్నించారు. ఎపిలో రాజకీయ దృశ్యం మారిపోతుందన్నారు. వైసిపిలో ఉండే ఆనం జగన్ పాలన బాగోలేదని చెప్పారని, ఆనం ప్రజాహితం కోసం మాట్లాడితే దూరం పెట్టేశారని దుయ్యబట్టారు. సీనియర్లను కూడా లెక్కపెట్టని అహంకారం జగన్‌ది అని మండిపడ్డారు.

వెంకటగిరి 'రా..కదలిరా' బహిరంగ సభలో వైసీపీపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రాజకీయం మారుతుందని... ఏపీని రివర్స్ గేర్ లో నడిపించిన తుగ్లక్ పని అయిపోయిందని వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో ఉండి, జగన్ పాలన బాగాలేదని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారని.. అప్పటి నుంచి ఆనంని ఎన్ని ఇబ్బందులు పెట్టారో చూశామన్నారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్ హయాంలో మంత్రిగా ఆనం పనిచేశారన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే దూరంపెట్టి పక్కన పెట్టారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ఐదేళ్లు పోరాటం చేశారన్నారు. శిషుపాలుడు వంద తప్పులు చేస్తే, ఈ సైకో వెయ్యి తప్పులు చేశారని విమర్శించారు. 'మీ అందరి చేతుల్లో ఓటుంది. ఇంటి పెద్ద సరిలేకుంటే, ఆ కుటుంబం బాగుంటుందా? ఏపీలో కూడా అదే జరిగింది. విధ్వంసం కొనసాగింది. సంక్రాంతి పండుగ కూడా చేసుకోలేకపోయాం. ఉద్యోగులకి జీతాలు పెంచే పరిస్థితి లేదు. అడిగితే జైలుకి పోతామనే భయం' అందరిలో ఉందని టీడీపీ అధినేత పేర్కొన్నారు. చంద్రబాబు ఇంకా మాట్లాడుతూ... తుపానులు, వరదలు వచ్చినప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. ఏ కులస్థులైనా బాగున్నారా? ఏ మతస్థులైనా బాగున్నారా? కనీసం రెడ్లు అయినా బాగున్నారా?.. దీనికి ఒక్కటే మార్గమని.. జగన్ పోవాలి, రాష్టాన్ని కాపాడుకోవాలన్నారు. యువత కోసం 25 ఏళ్ల కిందట ఐటీ ఆయుధం ఇస్తే, ఇప్పుడదే వజ్రాయుధం అయిందన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నైని ఒక హబ్‌గా చేద్దామని అనుకున్నామని... ప్రపంచంలోనే మేలైన ప్రాంతంగా చేయాలని చూశామన్నారు. ఈ ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్‌గా చేద్దామని అనుకున్నామని తెలిపారు. మంచి పరిశ్రమలు, విద్యాసంస్థలు తీసుకువచ్చి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెద్దామని అనుకున్నామన్నారు. అయితే తెచ్చిన వాటిని ఏం చేశారో చూశామని.. రూ.16లక్షల కోట్లు కోట్ల పీడీఆర్ బాండ్ల పేరుతో దోచారు. ఏపీ వ్యాప్తంగా రూ.24 వేల కోట్లు దోచారు. తిరుపతి ప్రాంతంలో ఎర్రచందనం ఉంది. ఆ రోజు స్మగ్లింగ్ చేసే వారిపై గట్టిగా చర్యలు తీసుకున్నాం. ఈ రోజు ఒక్కరినైనా పట్టుకున్నారా? ఆ దేవుడు మిమ్మల్ని క్షమించడు. అయోధ్యలో రామాలయం నిర్మిస్తే దేశమంతా చూస్తుంది. తిరుమలలో స్వామి ఆలయాన్నీ దోచుకుంటున్నారు. ఆ దేవుడు క్షమించినా మనం క్షమించం అంటూ వ్యాఖ్యలు చేశారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో అవినీతే అవినీతి. రూ.15లక్షలకి ఎకరా భూమి కొనుగోలు చేసి, ప్రభుత్వానికి రూ.50కోట్లుకి అమ్మారు. కొండలు, గుట్టలు, చెరువులు అన్నీ మాయమయ్యాయి. రూ.4500కోట్ల



పెట్టుబడులు టీడీపీ తెస్తే, జగన్ నిరుద్యోగం పెంచారని మండిపడ్డారు. కియా వంటి పరిశ్రమలు తెస్తే, వాటికే కన్నం వేశాడీ.. జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఐటీ ఉద్యోగాలిస్తే, జగన్ వాలంటీర్ల ఉద్యోగాలు, బ్రాందీ షాపులో ఉద్యోగాలు, పిష్ మార్కెట్ ఉద్యోగాలిచ్చారని మండిపడ్డారు. టీడీపీ పరిశ్రమలు తెస్తే... జగన్ భూంభూం, ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్ తెచ్చారని.. హోల్ సేల్, రిటైల్ వ్యాపారమంతా ఆయనదే అని విరుచుకుపడ్డారు.
జగన్ ఓ పెద్ద వ్యాపారి. మనల్ని అందర్నీ దోచుకున్నాడు. ఇసుక తైలం తీసి రూ.కోట్లు దోచాడు. తిరుపతిలో రూ.4వేల విలువ చేసే సిలికాని ఈ దుర్మార్గులు దోచేశారు. సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు.

కేజీఎఫ్ త్రీగా మార్చేశారు. మాజీ మంత్రి సోమిరెడ్డి నిరాహారదీక్షకి దిగి పోరాటం చేశారు. అది ప్రజా సంపద, ప్రజలందరి కోసం వినియోగించాలి. జగన్ 45లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టాడు. ఇసుకంతా దోచేశారు. మొన్న బీచ్ శ్యాండ్‌ను అమ్మాలని చూస్తే, కోర్టు ఆపింది. జగన్‌కు ఓడిపోతామనే భయం పట్టుకుంది. ప్రజలు గెలవాలి. జగన్ పోవాలని అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు.

# చరిత్రను వక్రీకరిస్తున్న పెత్తందారీ పత్రికలు

### చంద్రబాబుకు దళితులంటే పడదు

### దళిత సంక్షేమాన్ని వ్యతిరేకించడం అంటే అంటరానితనమే

### స్టాచే ఆఫ్ సోషల్ జస్టిస్ అంటే విజయవాడ గుర్తుకు వస్తుంది

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో సిఎం జగన్

**జయవాడ,జనవరి19వెలుతురు:**
పెత్తందారుల పత్రికలు చరిత్రను కూడా వక్రీకరిస్తున్నాయని.. ఎల్లో మీడియాను చూస్తే పాత్రికేయం ఏ స్థాయికి దిగజారి పోయిందో అర్థం చేసుకోవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభలో మాట్లాడుతూ, పేదవాడి పిల్లలు ఎప్పటికీ పనివాళ్లుగా ఉండిపోవాలా? అంటూ ప్రశ్నించారు. పేదలు చదివే ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోకపోవడం అంటరానితనమే. పేదలకు ఇళ్లు ఇస్తుంటే అడ్డుకోవడం కూడా అంటరానితనమే. పేదపిల్లలకు ట్యాబ్‌లు ఇస్తుంటే కుట్రపూరిత వార్తలు రాయడం అంటరానితనమే. దళితులకు చంద్రబాబు సెంటు భూమి కూడా ఇచ్చింది లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఏ కోశానా ప్రేమలేదు. మన ప్రభుత్వం బడుల రూపురేఖలు మారిస్తే పెత్తందారులకు నచ్చడం లేదు. అంబేద్కర్ భావజాలం పెత్తందారులకు నచ్చదని సీఎం జగన్ దుయ్యబట్టారు. పెత్తందారులకు దళితులంటే చులకన. పెత్తందారీ పార్టీలకు, పెత్తందారి నేతలకు పేదలు అవసరం లేదు. రియల్ ఎస్టేట్ రాజధాని కోసం పేదల భూములు లాక్కున్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడమే పెత్తందారుల లక్ష్యం. గతంలో చంద్రబాబు ఎందుకు బటన్ నొక్కలేకపోయారు. చంద్రబాబు ఎందుకు సామాజిక న్యాయం అమలు చేయలేకపోయారని అంటూ సీఎం జగన్ ధ్వజమెత్తారు. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ అంటే అమెరికా అని, అలాగే స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంటే విజయవాడ గుర్తుకు వస్తుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. మరణం లేని మహానీయుడు విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మన అడుగుల్లో, మన బతుకుల్లో, మన భావాల్లోనూ ఆయన ఎప్పటికీ కనిపిస్తూనే ఉంటాడని అన్నారు. దేశంలో కుల అహంకారం మీద, పెత్తందారీ వ్యవస్థ మీద, వ్యవస్థల దుర్మార్గలపై పోరాటాలకు అంబేద్కర్ స్ఫూర్తినిస్తూనే ఉంటాడని అన్నారు. ఈ విగ్రహం చూసినపుడల్లా...పేదలు, మహిళల హక్కులు, ప్రాథమిక హక్కులకు, సమానత్వ



ఉద్యమాలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. అంబేద్కర్ సమసమాజ భావాలకు నిలువెత్తు రూపమన్నారు. గొంతు వినిపించలేని అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయడానికి కారణం అంబేద్కరేనని జగన్ అన్నారు. అణగారిన వర్గాలకు ఈ విగ్రహం శక్తినిస్తుందని, అండగా నిలుస్తుందన్నారు. ఎంతమందిని రాజ్యసభకు పంపితే అందులో సగం మంది ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారని సీఎం జగన్ తెలిపారు. 13 జిల్లాల జడ్పీ ఛైర్మన్లలో బలహీన వర్గాలకు చెందిన 9 మందికి పదవులు ఇచ్చామన్నారు. ఇలాంటి సామాజిక న్యాయం, మన ప్రభుత్వం తప్పా...ఎక్కడైనా చూశారా అని సీఎం జగన్ ప్రశ్నించారు. దళిత, బలహీన వర్గాలపై చంద్రబాబుకు ప్రేమే లేదని, దళితులంటే చంద్రబాబుకు నచ్చరని అన్నారు. ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అన్న వ్యక్తి చంద్రబాబు అని జగన్ విమర్శించారు. పెత్తందారి పార్టీలకు, పెత్తందారి నేతలకు పేదల సంక్షేమం పట్టదన్నారు. పేదలకు అండగా ఉండాలని...ఈ పెత్తందారి పార్టీలకు ఎందుకు ఆలోచన రాదని ప్రశ్నించారు. దళితులకు చంద్రబాబు నాయుడు సెంటు భూమి ఇవ్వలేదని, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. పేదలు ప్రయాణించే ఆర్టీసీని నిర్వీర్యం చేశారన్న సీఎం జగన్...పేదలు ఆత్మగౌరవంతో బతకొద్దని పెత్తందారులు కోరుకుంటున్నారని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎక్కడా లంచాలు లేవని, వివక్ష అసలే లేదని స్పష్టం చేశారు.

అంటరానితనం రూపం మార్చుకుందన్న సీఎం జగన్... పేదలను దూరంగా ఉంచడం మాత్రమే అంటరాని తన కాదన్నారు. పేదవారు ఇంగ్లీష్ మీడియం చదవొద్దని కోరుకోవడం కూడా అంటరాని తనమేనన్నారు. పేదలు తెలుగు మీడియంలోనే చదవాలని చెప్పడం వివక్ష కాదా అని జగన్ ప్రశ్నించారు. పేద కులాల వారు ఎప్పటికీ తమ సేవకులుగానే ఉండాలని కోరుకోవడం దుర్మార్గమన్నారు. పథకాల అమలులో కూడా వివక్ష చూపడం అంటరానితనమే నన్న జగన్...అంబేద్కర్ భావజాలం అంటే పెత్తందారులకు నచ్చదన్నారు. సామాజిక చైతన్యాలవాడగా విజయవాడ కనిపిస్తోందన్నారు ముఖ్యమంత్రి జగన్. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ అంటే అమెరికా గుర్తుకు వస్తుందని, ఇక నుంచి స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు వస్తుందన్నారు.

# వచ్చే ఎన్నికల తరవాత జగన్ ఔట్

### కొడాలి నాని సహా అందరూ కనుమరుగే

### దొంగోట్ల నమోదులో ఫిర్యాదులు చేస్తూనే ఉంటాం

### టిడిపి నేత బోండా ఉమ ఆరోపణలు

**అమరావతి,జనవరి19వెలుతురు:** ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సహా కొడాలి నాని వంటి వారు కూడా వచ్చే ఎన్నికల తరవాత కనుమరుగై పోతారని వైసీపీపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రానున్నది టిడిపి ప్రభుత్వం అని, రాక్షస ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రెడ్డి, సజ్జల ఆదేశించారని తప్పులు చేసే అధికారులకు ఐఏఎస్ అధికారి గిరీశాకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఎన్నికల అనంతరం జగన్ రెడ్డి దేశం విడిచి పోతారని.. అతన్ని నమ్ముకొని తప్పులు చేసే అధికారులు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. జగన్ రెడ్డి పాలన ఉండేది కేవలం 83 రోజులే అని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఆదుకుంటాం.... రక్షిస్తామన్న ఏ నాయకుడు కనిపించడనే వాస్తవం అధికారులు గ్రహిస్తే మంచిదని ఆయన హితవుపలికారు. తిరుపతి ఉపఎన్నికలో ఆర్వోగా నాడు చేసిన తప్పులకు, నేడు కలెక్టర్‌గా ఉన్న గిరీశా సస్పెండ్ అయ్యారన్నారు. అతనితో పాటు మంత్రిపెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలను కూడా ఎన్నికల సంఘం శిక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వెంటనే విచారణ చేపట్టాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు. గిరీశాను సస్పెండ్ చేసినట్టే ప్రతాపరెడ్డి, రిష్వంత్ రెడ్డి, హరినారాయణ, పరమేశ్వర్ రెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఎవరి ఆదేశాలతో దొంగ ఓట్లు సృష్టిస్తున్నారో, అర్హుల ఓట్లు తొలగిస్తున్నారో, ఇష్టానుసారం ఫామ్-7లు ఎందుకు దుర్వినియోగం చేస్తున్నా రో అన్ని ఆధారాలు సేకరిస్తున్నామని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు తప్పులు చేస్తున్న అధికా రులపై ఫిర్యాదు చేస్తూనే ఉంటామన్నారు. సీఐలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, ఎస్పీలు, కలెక్టర్లుగా ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని టీడీపీ నేత హెచ్చరించారు. కొడాలి నానీ వేస్ట్ ఫెలో అని.. అహంకారపు పొరలు కమ్మి టీడీపీ సభకు వచ్చిన జనం నానీకి కనిపించడం లేదని మండిపడ్డారు. రా.. కదలిరా సభకు వచ్చిన లక్షమందికి పైగా జనాన్ని చూసి కొడాలినానీ ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారన్నారు. 83 రోజుల తర్వాత జగన్ రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి సహా ఎవరూ కనిపించరని బోండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com